VICTORY

విక్టరీ

మహాత్మా

# జ్యోతీరావు ఫూలే

(1827 - 1897)



బయోగ్రఫీ సిరీస్



మహాత్మా

# జ్యోతీరావు ఫూలే

✍

సి.వి.యస్. రాజు

విక్టరీ పబ్లిషర్స్

డోర్. నెం. 30-17-3ఎ, వారణాశివారి వీధి, సీతారాంపురం,
విజయవాడ- 520 002. ఫోన్ : 0866 - 2444156.

**మహాత్మా - జ్యోతీరావు ఫూలే**

©Ln. **I. Ramakumar,** PMJF
Immadisetty Akkeswara Rao
Charitable Trust, Vijayawada.

ప్రథమ ముద్రణ - 2015

**వెల. రూ. 40-00**

***Also available at:***
**www.newshunt.com**
**www.kinige.com**
**www. rockstand.in**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ - ఆంధ్రప్రదేశ్**

**శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో**
30-17-3A, వారణాశివారి వీధి,
సీతారాంపురం, విజయవాడ - 2.
ఫోన్ : **0866 - 2444156**

❖ ❖ ❖

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో**
26-27-77, బాటా షోరూమ్ ఎదురు,
గాంధీనగర్, విజయవాడ-520 003.
ఫోన్ : **(0866) 2570192, 2570309**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ - తెలంగాణ**

**శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో**
ప్లాట్ నెం. 3, 103, 2-4-1085,
సాయిలక్ష్మి నికేతన్,
రామకృష్ణా హాస్పటల్ ఎదురువీధి,
కాచిగూడ కుమార్ థియేటర్ దగ్గర,
నింబోలి అడ్డ, హైదరాబాదు-500027.
ఫోన్ : **(040) 65528228, 24653879**
(ఫాక్స్) **24745257,** సెల్ : **9346771314**

❖ ❖ ❖

**దుర్గా బుక్ డిస్ట్రిబ్యూటర్స్**
# 4-5-172, మొదటి అంతస్తు,
గోఖుల్ టవర్స్, గోఖుల్ చాట్ వెనుక,
హస్మత్‌గంజ్, కోటి,
హైదరాబాద్ - 500 095
ఫోన్ : **(040) 24752801, 64542801**

**లలితా బుక్ డిపో**
15-1-515, షాపు నెం. 1/బి. షికా ఎన్‌క్లేవ్
సిద్ధంబర్ బజార్, హైదరాబాద్ - 500012
ఫోన్ : 040-66825776
సెల్. నెం. 9290061323

**మనవి :** మాచే ప్రచురించబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపులలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచిలలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించగలరు. పుస్తకాలలో ఏవైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియచేసిన తదుపరి ముద్రణలో సరిచేయగలం. ఏ విషయమైన **ramakumarimmadisetty @yahoo.com** మెయిల్‌కు తెలియ జేయవచ్చును. మీకు కావలసిన పుస్తకాలకు : **SBI online A/c. No. 32987503888 విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ** పేరున జమచేసి, మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు వివరాలు తెలుపవలెను.

***Published by :*** **విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ**



**We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.**

# విషయసూచిక


1. జననము – బాల్యం ........ 5
2. స్త్రీలకు, దళితులకు విద్య నేర్పడం ........ 11
3. సంఘ సంస్కరణలు ........ 18
4. బ్రాహ్మణులకు, అస్పృశ్యతకు వ్యతిరేకం ........ 22
5. రైతుల, కార్మికుల హక్కుల కోసం పోరాటం ........ 30
6. హంటర్ కమీషన్‌కి నివేదించడం ........ 35
7. రైతు మార్గదర్శి ........ 41
8. నిజమైన మతం అంటే ఏమిటి? ........ 44
9. చివరి ఏడు సంవత్సరాలు ........ 46
10. "నిర్మిక్" భగవంతుడు ........ 52
11. సత్యప్రవర్తనయే మతం ........ 58
    a) భరత వాక్యం ........ 60
12. జ్యోతిబా గురించి ........ 61


✦ ✦ ✦

## పరిచయం....

మహారాష్ట్రీయుడైన మహాత్మా జ్యోతీరావు పూలే గొప్ప సంఘసంస్కర్త. ఆయన పందొమ్మిదవ శతాబ్దంలోని వ్యక్తి. దళితులకు, స్త్రీలకు విద్య నిర్బంధంగా యిచ్చి తీరాలని వాటి కోసం పోరాడిన ధీశాలి. అంతేకాక వారి ఉన్నతి కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి. భారతీయ సాంఘిక వ్యవస్థని క్షాళన చేయాలని సంకల్పించాడు. నవతరానికి ఆయన స్ఫూర్తిగా నిలిచాడు.

జ్యోతిరావు పూలే జీవితంలోని విశేషాలు యీ పుస్తకంలో విశదీ కరింపబడ్డాయి. ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని, ఆయన అడుగు జాడలలో నడుస్తారని ఆశిస్తూ...

**– రచయిత**

# 1. జననం - బాల్యం

భారతదేశంలో చాలామంది సంఘసంస్కర్తలు జన్మించారు. ఒక్కొక్కరు కొన్ని సంస్కరణలు తీసుకుని రాగలిగారు. మానవత్వం గురించి ఆధునికంగా ఆలోచించి, సంస్కరణలు చేపట్టినవారిలో అగ్రగణ్యుడు జ్యోతీరావు ఫూలే అని చెప్పడంలో సందేహం లేదు. బంగ దేశంలో రాజారామ్మోహన్‌రాయ్, గుజరాత్‌లో స్వామి దయానంద మొదలైన వారు సంఘాన్ని సంస్కరించడానికి కృషి చేశారు.

భారతీయ సాంఘిక వ్యవస్థని సాంప్రదాయం నిర్వీర్యం చేసింది. ప్రజలలో శక్తి, ఉత్సాహం సన్నగిల్లాయి. సంఘం ఎదుర్కొంటున్న సమస్యల మూలాలలోకి పోయి, వాటి ప్రభావాల్ని గురించి సంస్కర్తలు ప్రజలకి బోధించి, ఆ ఆదర్శాలని పాటిస్తే నూతన, సమిష్ఠి సంఘం నిర్మించబడుతుందని ఉద్ఘాటించారు.

పందొమ్మిదవ శతాబ్దంలో ఆధునిక విద్యా విధానం ఫలితంగా మూఢ సాంప్రదాయాల్ని ప్రశ్నించే తత్వం యువకులకు అలవడింది. జ్యోతీరావు ఫూలే యీ ఆధునిక ఆలోచనల వల్ల స్ఫూర్తి పొందాడు. ఫ్రెంచి విప్లవకారుల ఉద్దేశించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మొదలైన ఆశయాలను మొదటగా భారతదేశంలో ప్రవేశపెట్టిన మొదటి వ్యక్తి జ్యోతీరావు ఫూలే. ప్రాచీన భారతదేశంలో బానిసత్వం, కులవ్యవస్థ వేళ్లూనుకుని ఉన్నాయి. దాని వల్ల అభివృద్ధి కుంటుపడింది. కులవ్యవస్థలో శ్రేష్ఠులు బ్రాహ్మణులు, హీనులు మెహర్లు, మంగులు, చమరులు మొదలైనవారు. బ్రాహ్మణులు అర్చకత్వం చేపట్టి, శ్రుతి, స్మృతి, పురాణాలలోని మత విషయాలు బోధించేవారు. బ్రాహ్మణులు అతి పవిత్రులుగా భావింపబడేవారు. మిగిలిన కులాలవారు పవిత్రులు, అపవిత్రుల మధ్య నుండేవారు. బ్రాహ్మణులు సంఘాన్ని పరిపాలించే హక్కుని తీసుకున్నారు. ప్రజలు

ఆమోదించారు. ఇది నిజానికి బానిసత్వమే. జ్యోతీరావు తన రచనల ద్వారా యీ సంస్కృతిని ఖండించాడు. సర్వతో ముఖాభివృద్ధి జరగాలంటే ఆ బానిసత్వం నుండి విముక్తి పొందాలన్నాడు.

పూణే జిల్లాలోని ఖానవలిలో జ్యోతీ రావు యొక్క పూర్వీకులుండేవారు. అతని పూర్వీకుడు షేతిబా. షేతిబాకి ముగ్గురు కుమారులు. వారు పానోజి, గోవింద, కృష్ణ అనేవారు. వారి మొదటి యింటిపేరు గోర్హి. కాని వారు పువ్వుల వ్యాపారం చేయడం వల్ల వారి యింటిపేరు ఫూలేగా మారింది. పీష్వాల పరిపాలన చివరి దశలో ఉన్నప్పుడు యీ కుటుంబం వారు పీష్వాలకు పువ్వులు, పువ్వులతో తయారు చేయబడిన యితర వస్తువులు యిస్తూ ఉండేవారు.

జ్యోతీరావు తండ్రి గోవింద. అతడు పూణేకి దగ్గరలో ఉన్న ధనిక్‌వాడిలో ఉండే జగ్దేపాటిల్ కుమార్తె అయిన "చిమన"ని వివాహం చేసుకున్నాడు. అతనికి యిద్దరు కుమారులు. వారిలో ఒకరు జ్యోతి. ఆయన 1827వ సంవత్సరంలో జన్మించారు. గోవింద కాలంలో పీష్వాలు క్షీణదశలో ఉన్నారు. ఆ దశలో వారు పరిపాలనని విడిచిపెట్టారు. బ్రాహ్మణులకు అర్హత ఉన్నా లేకపోయినా ఉన్నత పదవులు లభించాయి. బ్రాహ్మణులు ఏదైనా నేరం చేస్తే తేలిక శిక్ష విధించేవారు. అవి చట్టప్రకారం ఉండేవి కావు. భూమి పన్ను కూడా వారు సగమే చెల్లించేవారు. రెండవ బాజీరావు పాలనా కాలంలో బ్రాహ్మణులు ఎక్కువగా గౌరవింపబడేవారు. వారికి పారితోషికాలు ఘనంగా ముట్టేవి. కాని రైతుల జీవితం దుర్భరంగా ఉండేది. వారికి ఆర్థిక సహాయం చేసేది బ్రాహ్మణులే. కులం ప్రకారం అధికారం బ్రాహ్మణులదే. ఒక అస్పృశ్యుని నీడ పడితే అపవిత్రమవుతాడనే గట్టి నమ్మకం ఉండేది. ఆ అపవిత్రత నుండి విముక్తి పొందాలంటే బ్రాహ్మణులకు దానమివ్వాలి. లేదా వారి పాదాల్ని కడిగి, ఆ నీటిని తాగాలి. ఈ రోజులో కూడా యిలాంటి నమ్మకాలున్నాయి.

బ్రాహ్మణులు స్త్రీలకి విద్య అనవసరం అని భావించేవారు. పీష్వాల పరిపాలన చివరి దశలో మతపరమైన నమ్మకాలు యింకా దిగజారిపోయాయి. శక్తి (క్షుద్ర) పూజ మొదలయింది. పూణేలో ఉన్న బ్రాహ్మణులు కూడా శక్తి పూజ చేయడం ప్రారంభించారు. ఈ పూజలో మద్యం, మాంసం, మత్స్యం, మైధునం, ముద్ర అనే తంతులు యధేచ్ఛగా జరిగేవి.

చివరి నలుగురు పీష్వాల వల్ల మరాఠా సామ్రాజ్యం విస్తరింపబడింది. తరువాత శివాజీ పాలన వచ్చింది. పీష్వాల చివరి దశలో సాహు మరణించిన తరువాత బ్రాహ్మణులకి అధికారం లభించింది. వారే సర్వశక్తిమంతులు. శివాజి పరిపాలన ధర్మయుక్తంగా ఉండేది.

అర్హులకే మంచి స్థానం లభించేది. అది కూడా క్షీణించింది. లోకహితవాది తాను రాసిన "వంద ఉత్తరాలు" అనే గ్రంథంలో పీష్వాల పాలనకి, బ్రిటిష్ వారి పాలనకి ఉన్న తారతమ్యాల గురించి ప్రస్తావించాడు.

బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని స్వాగతించిన సంస్కర్త రాజారామ్మోహన్‌రాయ్. కొంతమంది బ్రిటిష్ పాలకులు భారతీయ సాంప్రదాయాన్ననుసరించి సంస్కృత అకాడమీలు ఉండాలనుకున్నారు. అప్పుడు రామ్మోహన్‌రాయ్ వారితో, "మీరు మాకు సంస్కృతం నేర్పాల్సిన అవసరం లేదు. మేమే నేర్చుకోగలం. మీరు ఆధునిక విద్య నేర్పడానికి సంస్థల్ని ఏర్పాటు చేయండి" అన్నాడు. బ్రిటిష్‌వారి నూతన విద్యా విధాన ఫలితమే జ్యోతీరావు ఆవిర్భావం.

ఆ కాలంలో అగ్రకులాల వారు యీ నూతన విద్యావిదానాన్ని అంగీకరించలేదు. బ్రాహ్మణ పండితులు ప్రత్యేకంగా పాఠశాలలు నడిపి సంస్కృతం, వ్యాకరణం, న్యాయశాస్త్రం, వేదాంతం, జ్యోతిషం, వక్తృత్వం, హిందూ చట్టం మొదలైనవి నేర్పారు. వైశ్యులు, ధనిక వర్గం వారు చదవడం, రాయడం నేర్చుకున్నారు. 1836లో బ్రిటిష్‌వారు పూణే జిల్లాలోని కొన్ని గ్రామాలలో పాఠశాలలు నెలకొల్పారు. అక్కడి చదవడం, రాయడం, గణితం నేర్పేవారు. బ్రిటిష్‌వారు రాకముందు ప్రభుత్వాలు విద్యగురించి అంతగా పట్టించుకునేవి కావు.

పందొమ్మిదవ శతాబ్దపు భారతదేశ చరిత్ర అంటే సంఘ సంస్కరణల చరిత్ర అని చెప్పవచ్చును. అప్పుడు నూతన విద్యా విధానం ప్రవేశపెట్టబడింది. అది ఒక ముఖ్య సంఘటన. ఇంగ్లీషుని బ్రిటిష్ వారి పాఠశాలల్లో బోధించే వారు. ఇంగ్లీషు నేర్పడం ప్రజల్ని విద్యావంతుల్ని చేయడానికి కాదు. వారి పరిపాలన సాగడానికి, క్రిస్టియన్‌లు పూణేలో ఒక మరాఠీ స్కూలుని స్థాపించారు. ఈ సంధి కాలంలో, ప్రజలకి విద్య అందుబాటులో ఉన్నా, సామాన్యునికి ఆ విద్య యొక్క ప్రాముఖ్యత అవగాహన కాలేదు. గోవింద తన కుమారుడైన జ్యోతిని మరాఠీ ప్రైమరీ స్కూలులో చేర్పించాడు. అప్పుడాతనికి ఏడేళ్ళు. కాని ఒక బ్రాహ్మణుని సలహా మేరకి జ్యోతిని స్కూలు మాన్పించి తన కూరగాయల సేద్యంలో ప్రవేశపెట్టాడు. (ఈ పని జ్యోతి చాలా బాగా చేయగలిగేవాడు)

జ్యోతి చిన్నప్పుడే అతని తల్లి మరణించింది. తండ్రి మళ్ళీ వివాహం చేసుకోలేదు. జ్యోతి కోసం ఒక ఆయాని నియమించాడు. ఆయా జ్యోతిని, అతని సోదరుడు రాజారాంని చాలా ప్రేమతో సాకింది. ప్రైమరీ చదువు పూర్తి అయ్యేసరికి జ్యోతికి బాగా చదవడం రాయడం వచ్చింది. పద్దులు రాయడం కూడా నేర్చుకున్నాడు.

బ్రాహ్మణుడు జ్యోతిని స్కూలు నుండి తీసివేయమనడానికి కారణాన్ని లోకహితవాది గోపాలరావు దేశ్‌ముఖ్ తన రచనలో యిలా చెప్పాడు. బ్రాహ్మణుడు కానివాడు చదువుకుంటే కలియుగం ప్రవేశించినట్లేనని కాబట్టి వారు చదవుకోకూడదని అప్పటి బ్రాహ్మణుల అభిప్రాయం.



జ్యోతిరావుకి చదువు మీద శ్రద్ధ పెరిగింది. నిద్రపోయే ముందు అతడు మినుకు మినుకుమనే దీపం దగ్గర గాని లేదా పొలంలో ఉన్నప్పుడుగాని చదువుకునేవాడు. వీరి కుటుంబానికి పొరుగును యిద్దరు పండితులండేవారు. ఒకరు పర్షియన్ భాషని బోధించే గఫ్ఫార్‌బేగ్ మున్షీ, రెండవ వారు విజిత్ అనే క్రిస్టియన్. వారిద్దరూ జ్యోతిని బాగా చదివించమని గోవిందకి సలహా యిచ్చారు. గోవింద తన కుమారుని 1841లో ఒక స్కాట్లాండు దేశంవారు స్థాపించిన స్కూలులో ప్రవేశపెట్టాడు. అప్పుడు జ్యోతికి పధ్నాలుగు సంవత్సరాలు. జ్యోతికి తన పదమూడవ ఏట జగ్దేపాటిల్ కుమార్తెయైన ఎనిమిది సంవత్సరాల బాలికతో వివాహం అయింది. బుధ్‌వార్‌వాడీలోని ప్రభుత్వ పాఠశాలలో జ్యోతి చదువుతున్నప్పుడు అతనికి సదాశివ్‌బల్లాల్ గోవాందే అనే బ్రాహ్మణ విద్యార్థితో స్నేహం ఏర్పడింది. జ్యోతికి ముస్లిం స్నేహితులు కూడా ఉండేవారు. వారితో హిందూ మతానికి, ఇస్లాంకి గల గొప్పదనం గురించి చర్చించేవాడు. స్కాట్లాండు వారు స్థాపించిన స్కూలులో మోరో విఠల్ వల్వేకర్, శాఖారాం పరంజపె అనే బ్రాహ్మణ స్నేహితులుండేవారు. ఈ స్కూలులో మానవహక్కులు, విధులు గురించి జ్యోతికి అవగాహన కలిగింది. అతడు శివాజి, జార్జి వాషింగ్టన్ చరిత్రలు చదివాడు. ఫలితంగా అతనికి నాయకత్వ లక్షణాలు,

దేశభక్తి అలవడ్డాయి. అలాగే థామస్ పెయిన్ రాసిన "మానవుని హక్కులు" అనే పుస్తకం కూడా అతనిలో స్ఫూర్తిని కలిగించింది. ఆ పుస్తకం ఐరోపాలోను, అమెరికాలోను గొప్ప సంచలనాన్ని కలిగించింది. పుస్తకాలు చదివిన ఫలితంగా జ్యోతికి తన లక్ష్యాన్ని సాధించడానికి శారీరక బలం అవసరం అని తెలిసింది. అతడు తన యిద్దరి స్నేహితులతో కలిసి కత్తియుద్ధం, విలువిద్య, ఆటలు ఆడడం నేర్చుకున్నాడు. వారి గురువు లాహుజిబువ అనే అస్పృశ్యుడు. జ్యోతి కర్రసాములో మంచి నేర్పరి అయ్యాడు. అతనికి శరీర సౌష్ఠవం ఏర్పడింది. వాసుదేవో బల్వంత్‌ఫాడ్కే అనే మరాఠీ విప్లవకారుడు జ్యోతీఫూలే వద్ద మిలిటరీ శిక్షణ నేర్చుకున్నాడు. ఇంగ్లీషు విద్య ఒక కొత్త ప్రపంచాన్ని అతనికి, అతని స్నేహితులకీ ఆవిష్కరించింది.

వల్వేకర్ తన స్వీయచరిత్రలో యిలా అంటాడు. "విద్యార్థులుగా ఉన్నప్పుడు మాకు హిందూమతం మీద విశ్వాసం పోయి, క్రైస్తవ మతం వైపు మొగ్గుచూపాము. అయినప్పటికీ అన్ని మతాల గురించి పూర్తిగా అవగాహన చేసుకున్నాం. అన్ని మతాలలోను కొన్ని నమ్మదగిన విషయాలున్నాయి. అన్ని మతాలలోను సామాన్యంగా ఉండే సిద్ధాంతాలున్నాయి. వాటిని మాత్రమే అనుసరించాలి". ఈ భావంతో వారు క్రైస్తవ మతంలో చేరలేదు. అన్ని మతాలు భగవంతుడు ఒక్కడే అని చెబుతున్నాయి. అతనినే పూజించాలి. ఇటువంటి భావాలున్నా క్రైస్తవ మిషనరీలు చేసే సేవాకార్యక్రమాలు, విద్యని విస్తృతం చేయడం వారిని ఆకర్షించాయి.

జ్యోతి తన ఆంగ్ల విద్యాభ్యాసాన్ని 1847లో పూర్తి చేశాడు. అమెరికా స్వాతంత్ర్య సమరం నుండి స్ఫూర్తిని పొంది అతడు మానవత్వ విలువలు గురించి, సమానత్వం, స్వేచ్ఛ గురించి దీర్ఘంగా ఆలోచించాడు. బ్రిటిష్ వారిని భారతదేశం నుండి ఎలా తరిమివేయాలా అనేదే అతని నిరంతర ఆలోచన. జ్యోతి చదువుకునే రోజుల్లో మహారాష్ట్రలోను, యితర ప్రదేశాలలోను అక్కడక్కడ బ్రిటిష్ వారిపై తిరుగుబాట్లు జరుగుతూ ఉండేవి. 1826లో ఉమాజీ నాయక్, 1836లో పూణేలోని జాలర్లు, 1839, 1846లలో భావుఖరే, చిమన్‌జీయాదవ్, నానాదర్బారేలు, 1848లో బాపుమంగారే, కడోజీ మంగారేలు తిరుగుబాటు చేశారు. బ్రిటిషువారు ఆ తిరుగుబాట్లని అణచివేశారు. యువకులుగా ఉన్న జ్యోతి, అతని స్నేహితుల మనస్సులలో బ్రిటిషువారిని పారదోలాలనే భావం వేళ్లూనుకుంది. జ్యోతి తన గ్రంథం "గులామ్‌గిరి" (బానిసత్వం)లో తన భావాల్ని తన బ్రాహ్మణ స్నేహితులు, బ్రాహ్మణ గురువులు నిర్వీర్యం చేయాలని ప్రయత్నించేవారని

చెప్పాడు. తరువాత పీష్వాల క్షీణదశలో మహారాష్ట్రలోని కొంతమంది బ్రాహ్మణ సంఘాలు బ్రిటిష్‌వారిని ఎలా తరిమివేయాలనే తీవ్ర ఆలోచనలో పడ్డారు.

భారతీయులు బ్రిటిషువారు తమ కిచ్చిన సౌకర్యాలపట్లా, వేతనాల పట్లా, విద్య, ప్రమోషన్‌ల పట్లా అసంతృప్తితో ఉన్నారని అప్పటి బొంబాయి గవర్నరుగా ఉన్న సర్ రిచర్డ్ టెంపుట్ తన ప్రతినిధులకు లేఖల ద్వారా తెలియజేశాడు.

జ్యోతి తన చదువు పూర్తయిన తరువాత తన వంశవృత్తి అయిన పూల వ్యాపారంలో చేరాడు. ఆ సమయంలోనే జ్యోతిని ఒక బ్రాహ్మణ స్నేహితుడు తన వివాహానికి ఆహ్వానించాడు. ఆ ఊరేగింపులో అందరూ బ్రాహ్మణులే. బ్రాహ్మణేతరుడైన జ్యోతిని ఒక బ్రాహ్మణుడు గుర్తించి అతనిని అందరి ముందు తిట్టాడు. జ్యోతికి ఆ సంఘటన చాలా అవమానం అనిపించింది. ఇంటికి వచ్చి ఆ సంఘటనని తన తండ్రికి చెప్పాడు. తండ్రి అతనిని ఆ సంఘటనని పట్టించుకోవద్దనీ, ఎవరి అంతస్తు వారిదని బుజ్జగించాడు. ఆ సంఘటన అప్పటి భారతీయ సంఘ సంస్థ ఎలాగ ఉందో జ్యోతి పూలేకి అర్థమయింది. హిందువులందరూ ఒకే మతాన్ని అనుసరిస్తూన్నా, ఆధ్యాత్మికత వైపు పయనిస్తున్నా, ఐకమత్యం లోపించిందని ఆ చిన్నవయస్సులోనే జ్యోతికి అర్థమయింది. ఐకమత్యం లేకపోవడం వల్ల అసమానతలు, విచక్షణ చోటు చేసుకుంటాయి. కాబట్టి బ్రాహ్మణేతరులకి కూడా విద్య అవసరం. నూతన విద్యావిధానం గొప్ప సాంఘిక మార్పుని తేగలదనే విషయాన్ని గుర్తించాడు జ్యోతి.

✦ ✦ ✦

# 2. స్త్రీలకు, దళితులకు విద్య నేర్పడం

విద్యలో సంస్కరణలకి శ్రీకారం చుట్టాడు జ్యోతీరావు. స్త్రీలు, బ్రాహ్మణేతరులు కూడా నూతన విద్యా విధానంలో భాగస్వాములు కావాలనుకున్నాడు. బ్రాహ్మణుల స్త్రీలకి విద్య అవసరం లేదని అడ్డు పెట్టినప్పటికీ జ్యోతీరావు స్త్రీలకు ఒక పాఠశాలను ప్రారంభించాడు. స్త్రీ విద్యావంతురాలైతే, తన పిల్లలకు తానే విద్య నేర్పగలదు. కుటుంబం విద్యావంతమవుతుంది. ఈ లోపున జ్యోతీరావు స్నేహితుడు సదాశివరావు అతనిని క్రైస్తవులు అహమ్మద్ నగరంలో నడుపుతున్న స్కూలుకి తీసుకుని వెళ్ళాడు. ఫర్రార్ నడుపుతున్న స్కూలుకి వెళ్ళగా ఆమె కూడా భారతదేశంలో స్త్రీలకి విద్య లేకపోవడాన్ని గురించి బాధపడింది. ప్రతి పురుషులు తన భార్యకి విద్య నేర్పితే విద్య వ్యాపించడానికి అవకాశం కలుగుతుందని ఆమె భావించింది.

ఫరార్ ఉద్దేశాన్ని పురస్కరించి, జ్యోతి తన భార్యకి విద్య నేర్పాడు. ఆమె బ్రాహ్మణేతర స్త్రీల కోసం ఒక పాఠశాలని ప్రారంభించింది. బుధ్‌వార్‌పేటలోని భిదే వాడలో యీ స్కూలు 1848లో ప్రారంభమయింది. జ్యోతి స్నేహితులు పరంజపే, హోతే, గోవాందేలు అతనికి ఆర్థిక సహాయం చేశారు. అప్పటి అగ్రకులాల వారు యిటు వంటి స్కూలుని నడిపితే భగవంతునికి అపచారం చేసినట్లే అన్నారు. నిజానికి వేదాలు స్త్రీలు చదవకూడదని ఉంది కాని, విద్య నేర్పకూడదని లేదు. ఇతర కులాల వారు బ్రాహ్మణేతరులకు విద్యని నిషేధించారు.



స్త్రీలు విద్యావంతులైతే సాంఘిక వ్యవస్థ కూలిపోతుందని బ్రాహ్మణుల వాదన. స్త్రీ విద్యావంతురాలైతే చెడు మార్గాలు పట్టి కుటుంబంలో సంతోషం లేకుండా చేస్తుందని వారు భయపడ్డారు.

ఆ కాలంలో స్త్రీలు చెప్పులు వేసుకోకూడదు. గొడుగుని ఉపయోగించకూడదు. పర పురుషులుండగా భర్తతో మాట్లాడకూడదు. పెద్దల ఎదుట నూతన వధూవరులు మాట్లాడుకోకూడదు. భర్తతో సహపంక్తిలో కూర్చుని భోజనం చేయకూడదు. స్త్రీ విద్య అంటే నిప్పుతో చెలగాటమే. పెద్దల యొక్క ఆధిపత్యం పోతుంది కూడా.

గోవింద పూర్వ సాంప్రదాయాల్ని పాటించే వ్యక్తి. తన కుమారుని చర్యలకి చాలా బాధపడ్డాడు. కాని అతని స్నేహితులు జ్యోతి చేస్తున్న పని సమంజసమే అని సమర్ధించారు. పాత మూఢకాలు తొలగుతేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. జ్యోతిరావు తన తండ్రితో యీ విషయం గురించి వాదించినా ఫలితం లేకపోయింది. తండ్రి అతనిని యిల్లు విడిచి పొమ్మన్నాడు. జ్యోతీరావు భార్య సావిత్రీబాయి భర్తకి తోడుగా నిలిచింది. ఇద్దరూ యిల్లు విడిచి బయటికి పోయారు. నిధులు లేకపోవడం వల్ల స్కూలు మూతపడింది. నిధులు చేకూరిన తరువాత మళ్ళీ స్కూలు తెరిచారు. ఆ స్కూలుకి స్థలాన్ని గోవాందే గంజ్‌పేట్‌లో యిచ్చాడు.రాను రాను విద్యార్థినుల సంఖ్య పెరగడంతో ఒక ముస్లిం యింటిని అద్దెకి తీసుకున్నాడు జ్యోతి. మేజర్ క్యాండీ అనే వ్యక్తి స్కూలుకి పుస్తకాలు సరఫరా చేశాడు.

1851వ సంవత్సరం జులై 3వ తేదీన అన్నాచిప్లూంకర్ యొక్క భవనంలో బాలికల పాఠశాలని ప్రారంభించాడు. ప్రతిరోజు అతడు నాలుగు గంటలు జీతం తీసుకోకుండా విద్య నేర్పేవాడు. అతడు ఒక కమిటీని ఏర్పాటు చేసి, స్కూలుని అప్పగించాడు. ఆ కమిటీలో కేశవ్‌శివరామ్ భావల్కర్, అన్నాసహస్త్రబుద్ధి, బాపూరావ్‌జీ మండే, విష్ణుభిదే, కృష్ణశాస్త్రిచిప్లూంకర్, విష్ణుశాస్త్రి పండిట్ సభ్యులు. విష్ణుశాస్త్రి పండిట్ విధవా వివాహాల్ని ప్రోత్సహించాడు. మొదట్లో ఆ పాఠశాలలో ఎనిమిదిమంది విద్యార్థినులే ఉండేవారు. తరువాత నలభై ఎనిమిదికి చేరింది. ఆర్ధికవనరులు లేకపోవడం వల్ల జ్యోతిరావు భార్య కూడా జీతం లేకుండానే పని చేసింది. చివరికి ఆమె ఆ స్కూలుకి ప్రిన్సిపాల్ అయింది.

రస్తాపేటలో 1851వ సంవత్సరం, సెప్టెంబరు 17వ తేదీన జ్యోతిరావు బాలికల పాఠశాల నింకొక దానిని ప్రారంభించాడు. మూడవ పాఠశాల 1859, మార్చి 15న ప్రారంభించాడు. ఆ స్కూలులో చదవడం, వ్యాకరణం, లెక్కలు, భూగోళశాస్త్రం, చరిత్ర,



మ్యాప్‌రీడింగ్ మొదలైనవి నేర్పారు. సూపర్‌వైజర్‌గా ఉన్న మేజర్‌క్యాండీ ఆ స్కూలు గురించి యిలా అన్నాడు. "బాలికల తెలివితేటలు, వారి అభివృద్ధి నాకు చాలా సంతోషాన్ని కలిగించాయి". 1852, ఫిబ్రవరి 17వ తేదీన స్కూలుని తనిఖీ చేయడానికి వచ్చిన భన్‌సాహెబ్ మండే యిలా అన్నాడు. "మన దేశ ప్రజలు స్త్రీ విద్య అత్యవసరమనే విషయాన్ని గుర్తిం చకపోవడం చాలా దురదృష్టకరం" న్యాయాధిపతి బ్రౌన్ యిలా అన్నాడు" "మిల్టన్ మహాకవి ఉద్దేశం ప్రకారం స్త్రీలకి విద్య నేర్పితే కుటుంబ వ్యవస్థ సుఖ సంతోషాలతో విరాజిల్లుతుంది". ఆ స్కూలులో చదివే పధ్నాలుగేళ్ళ బాలిక ఒక వ్యాసంలో యిలా రాసింది. "బ్రాహ్మణులు బ్రాహ్మణే తరులకు వేదాలు చదివే అర్హత లేదన్నారు. కాబట్టి మనకి మత గ్రంథమనేదే ఉండదు. కాబట్టి మనకి మతమే లేదు. ఓ భగవంతుడా! మా మతం ఏమిటో చెప్పు. ఓ భగవంతుడా దయతో నువ్వు బ్రిటిష్ ప్రభుత్వాన్ని మాకు పంపించావు. దీని వల్ల మాకు ఊరట, సంక్షేమం లభించాయి. బ్రిటిషు వారు రాకముందు మెహర్‌లు, మంగులు మొదలైనవారు శిక్షార్హులైతే వారికి మరణశిక్ష విధింపబడేది. మేము వీధులలో తిరగడానికి కూడా అర్హులం కాము. ప్రస్తుతం మేము తిరగగలుగుతున్నాం". ఇటువంటి స్వేచ్ఛని బాలికలకు జ్యోతీరావు పాఠశాలలు యిచ్చాయి.

స్థానిక ప్రభుత్వ పాఠశాలలకు సూపర్‌వైజరుగా దడోబా పాండురంగ తర్కాడ్కర్ ఉండేవాడు. అతడు బుధ్‌వార్‌పేటలో ఉన్న జ్యోతిరావు స్కూలుని తనిఖీ చేశాడు. అతి

తక్కువ కాలంలో ఎక్కువ ప్రగతిని సాధించిందనీ, ఆ గొప్పదనం స్కూలుని నడిపేవారిదనీ అతడు ప్రశంసించాడు. జ్యోతిరావు స్కూల్‌లో ఒక లైబ్రరీని కూడా స్థాపించాడు. ఎందుకంటే ఒక గ్రంథాలయం కూడా ఒక ఉపాధ్యాయుని వంటిదే అని అతని అభిప్రాయము. ప్రభుత్వ పాఠశాలలో కంటె పదిరెట్లు విద్యార్థులు జ్యోతీరావు స్కూళ్ళలో ఉన్నారు. ఈ పరిస్థితి ఏర్పడడానికి కారణం బోధించడానికి అక్కడున్న అనుకూల వాతావరణమే.

1852వ సంవత్సరం నవంబరు 16న ప్రభుత్వం స్థానిక నాయకులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమావేశంలో జ్యోతీరావుని సత్కరించదలచుకుంది. ప్రభుత్వం తరఫున జ్యోతీరావుని శాలువతో సత్కరించారు. ఇటువంటి సన్మానాలు పూర్వం బ్రాహ్మణులకు మాత్రమే జరిగేవి. ఆ సమావేశంలో బాపూరావ్ మండే, పూణే కాలేజి ప్రిన్సిపాల్ అయిన మోరేశ్వరశాస్త్రి ప్రసంగించారు.

ఈ స్త్రీ విద్య ఉద్యమం ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించింది. బొంబాయిలో ఒక సారస్వత, విజ్ఞాన సంస్థ ఏర్పాటు చేయబడింది. ఆ సంస్థకి మొదటి నలుగురు అధ్యక్షులు తెల్లజాతివారే. ఆ సంఘం బొంబాయిలో ఎనిమిది పాఠశాలల్ని 1849, అక్టోబరు 1 తేదీన స్థాపించింది. ఈ పాఠశాలల్లో అన్ని కులాలవారికీ ప్రవేశం ఉంది.

అప్పటి పరిస్థితుల్ని గురించి లోక్‌హితవాది యిలా అన్నాడు. “అన్యాయంగా బ్రాహ్మణులు విద్యని తమ చేతుల్లోకి తీసుకున్నారు. బ్రాహ్మణేతరులకి విద్య నేర్పకూడదన్నారు. ఈ రోజు బ్రాహ్మణులు అన్ని విధాల జీవనాధారాల్ని సంపాదించుకున్నారు. బ్రాహ్మణేతరులకి సంస్కృతాన్ని బోధించే కంటే తమ వృత్తినే వదులుకుంటామని వారు బెదిరించారు.”



జ్ఞానోదయపత్రిక యిలా రాసింది. "ఇటువంటి విచిత్ర అభిప్రాయాన్ని బ్రాహ్మణులు యిప్పటికే విడిచి పెట్టి ఉండవలసింది." 1820 – 1825 మధ్య కాలంలో గంగాధర్ ఫాడ్కే అనే బ్రాహ్మణ పండితుడు బొంబాయిలో యూరోపియన్లకి సంస్కృతం నేర్పి పొట్ట పోషించుకునేవాడు. పూణేలో ఉన్న బ్రాహ్మణులు అతనిని అనేక విధాల దూషించారు. నీలకంఠశాస్త్రిభట్, యింకా అయిదుగురు పండితులు బ్రాహ్మణేతరులకి సంస్కృతం నేర్పడానికి అంగీకరించలేదు. అందువల్ల వారిని ఓరియెంటల్ రీసెర్చి ఇన్స్టిట్యూట్‌కి తక్కువ వేతనం మీద బదిలీ చేశారు. ధోండో శాస్త్రి డెంగ్వేకర్, కృష్ణశాస్త్రిరజ్వాడేలు బ్రాహ్మణేతరులకి సంస్కృతం బోధించినందువల్ల పూణే బ్రాహ్మణులు వారిని బహిష్కరించారు.

జ్యోతిరావుకి సమకాలీనుడైన దడోబాపాంధారే సాంఘిక సమానత్వం గురించి ఉద్యమాన్ని లేవదీశాడు. అతనికి బైబిల్‌మీద విశ్వాసం ఉంది. 1844లో దడోబా సూరత్‌లో గుజరాతీ ఉపాధ్యాయుల సహాయంతో, మానవధర్మ సభ స్థాపించాడు. 1848లో పరమహంస సభని స్థాపించాడు. ఈ పరమహంస సభకి రాంబాలకృష్ణ జయకర్ అధ్యక్షుడు. జ్యోతిరావు శివాజి గురించి రాసిన గేయాన్ని జయకర్‌కి అంకితం యిచ్చాడు. పరమహంస సభ మహారాష్ట్రలో సంఘసంస్కరణ చరిత్రలో ప్రముఖ స్థానం పొందింది. ఈ సభకి సభ్యులు బ్రాహ్మణేతరులే. ఈ సభ యొక్క లక్ష్యం కులవ్యవస్థని రద్దు చేయడం, బాల్య వివాహాల్ని అరికట్టడం, విధవా వివాహాల్ని ప్రోత్సహించడం, హిందూ మతంలో సంస్కరణలు తీసుకుని రావడం మొదలైనవి. పూణే, సతారా, నగర్, ధార్వాడ్, బెల్గాం, కలకత్తాలలో యీ సభయొక్క శాఖలు ఉన్నాయి.

బొంబాయిలో జంభేకర్, నానా అనే సంఘ సంస్కర్తలు యిద్దరున్నారు. క్రైస్తవ మతంలో చేరిన వారిని తిరిగి హిందూమతంలోకి చేర్పించాలన్నది వారి ఉద్యమం. అయితే జ్యోతిరావు యీ ఉద్యమంలో చేరలేదు. వ్యక్తి యొక్క మతం గురించి అతడు పట్టించుకోలేదు. అతడు ఏ మతం వాడైన కావచ్చు. అతని ముఖ్య ఉద్దేశం బ్రాహ్మణేతరులకి విద్య నేర్పించడం. కాబట్టి బాల బాలికల విద్యను గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకున్నాడు. జ్యోతిరావుకి బ్రాహ్మణ స్నేహితులున్నారు. వారు కూడా జ్యోతీరావు యొక్క కృషిని అభినందించారు. ధైర్యంగా, స్వార్థరహితంగా మద్దతిచ్చారు. కొన్ని పాఠశాలల డైరక్టర్లు అస్పృశ్యులకి తమ స్కూళ్ళలో ప్రవేశం యివ్వలేదు. చట్టప్రకారం అలా యివ్వకపోవడం నేరం. కాని ఎవరూ పాటించడం లేదు. అగ్రకులాలవారు అసలే అంగీకరించడం లేదు.

## ✦ మహాత్మా - జ్యోతిరావు ఫూలే ✦

అధమ కులాల వారు విద్యావంతులైతే వారు తమ ప్రాధమిక మానవహక్కుల కోసం పోరాడతారని జ్యోతీరావు నమ్మకం. కుటుంబ పోషణ కష్టం ఉన్నప్పటికీ జ్యోతీరావు తన కృషిని విడిచిపెట్టలేదు. భార్య కూడా అతనికి మద్దతు యిచ్చింది. 1855వ సంవత్సరంలో భగవంతుని పేరిట జరుగుతున్న నమ్మకాలు, కర్మలు మొదలైన వాటిని జ్యోతీరావు ప్రజల ముందు పెట్టడం. విద్యావంతులైన కొంతమంది హిందువులు కూడా మూఢనమ్మకాల్ని పోగొట్టి, ఆధునిక భావాలు నెలకొల్పడానికి ప్రయత్నించారు. బ్రాహ్మణుల ఆధిపత్యం కొనసాగకుండా చేయడానికీ, హిందూమతం యొక్క మూలాల్ని కనుక్కోవడానికీ, జ్యోతి రావు చేసే కృషి కొంతమంది గుర్తించారు.

కొంతమంది మూఢులు జ్యోతిరావుని హతమార్చడానికి పంపారు. వారు జ్యోతిరావు యింట్లో కాలు పెట్టగానే వారికీ జ్యోతిరావుకీ యీ విధంగా సంభాషణ జరిగింది.



**జ్యోతి :** నన్ను చంపడానికి మీరు ఎందుకు వచ్చారు? నేను మీకు ఏమి హాని చేశాను?

**హంత :** మిమ్మల్ని చంపితే మాకు ఒక్కొక్కరికి వేయి రూపాయలు యిస్తామన్నారు.

**జ్యోతి :** సరే ! అయితే యిదిగో నా మెడ. ఈ పని చేయడానికి మీకు దారిద్ర్యమే కారణం అన్నమాట.

జ్యోతీరావు యొక్క ఔదార్యం వారిని కదిలించి వేసింది. వెంటనే వారు పశ్చాత్తాపంతో ఆయన కాళ్ళ మీద పడ్డారు. ఆజన్మాంతం వారు ఆయనకు అనుయాయులుగా ఉన్నారు. వారిలో ధండీరామ్‌కుంభార్ అనే వ్యక్తి బాగా చదువుకుని సత్యశోధక సమాజానికి మూలస్తంభం అయ్యాడు.

## ✦ మహాత్మా - జ్యోతిరావు ఫూలే ✦

1857, మే 10వ తేదీన బ్రిటిష ప్రభుత్వం, మీద తిరుగుబాటు జరిగింది. అయితే అది మహారాష్ట్రకి బయట జరిగినా, నాయకులు మహారాష్ట్రులే. ఈ తిరుగుబాటుకి కారణం చాలా విచిత్రమైనది. తుపాకులలో ఉండే బుల్లెట్లకు ఆవు కొవ్వు పూశారు. ఆవు హిందువులకి పవిత్రమైనది. పంది కొవ్వు కూడా పూయడం జరిగింది. అది ముస్లింలకి అసహ్యకరం, అపవిత్రం. ఈ విధంగా చేయడం బ్రిటిష వారి కుట్ర అనుకున్నారు భారత సైనికులు. అంతేకాక తమను క్రైస్తవ మతంలోకి మార్చడానికి అలా చేశారని అనుకున్నారు. కాని ఆ తిరుగుబాటు వ్యూహాత్మకంగా లేకపోవడం వల్ల విజయవంతం కాలేదు. పైగా బ్రిటిషువారి సైనికులు క్రమశిక్షణ గలవారు. అయినా బ్రిటిషువారు తేలికగా విజయాన్ని సాధించలేదు. ఈ సంఘటన మీద జ్యోతిరావు యొక్క అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి, అతడు యీ విషయంలో తటస్థంగా ఉన్నాడు. ననా ఫడ్నవిస్ అనే బ్రాహ్మణుని నాయకత్వంలో తిరుగుబాటు భగ్నమైంది. పైగా బ్రాహ్మణేతరులకు సంతోషం కలిగింది. కాబట్టి ఆ తిరుగుబాటు భగ్నమైనందుకు తనకి సంతోషంగా ఉందన్నాడు. బ్రిటిషువారు యీ రోజు మనల్ని పాలించవచ్చు. రేపు వెళ్ళిపోవచ్చుననుకున్నాడు.



బ్రిటిషువారు ఉండగానే బ్రాహ్మణేతరులకు విముక్తి కలగాలనుకున్నాడు. బ్రిటిషువారి పరిపాలనలోనే సంఘ సంస్కరణలు జరగడానికి అవకాశం ఉందని భావించాడు. తరువాత కాలంలో గోపాల్ గణేశ్ అగార్కర్ అనే సంస్కర్త కూడా యిలాగే భావించాడు. స్త్రీల కోసం పాఠశాలల స్థాపన జరగడం స్త్రీలను, బ్రాహ్మణేతరులను ఉద్ధరించడానికి తొలిమెట్టు.

✦ ✦ ✦

# 3. సంఘ సంస్కరణలు

పాఠశాలల్ని స్థాపించడం పూర్తయిన తరువాత జ్యోతిరావు పురాతన సాంఘిక సాంప్రదాయాల మీద దృష్టి పెట్టాడు. అంతకు ముందు బెంగాల్‌లో రాజా రామ్మోహనరాయ్ సతీ సహగమనంపై పోరాడాడు. చివరికి 1829లో అది రద్దయింది. ఇక విధవా వివాహం అనేది చాలా సున్నితమైన సంస్కరణ. సాధారణంగా హిందూ స్త్రీ పునర్వివాహానికి అంగీకరించదు. జ్యోతీరావు విధవల పరిస్థితిని చూసి చలించిపోయాడు. 1864వ సంవత్సరం భార్య చనిపోయిన ఒక వ్యక్తికి వివాహం చేశాడు. అతడు గర్భస్రావాన్ని వ్యతిరేకిస్తూ ఒక కేంద్రాన్ని ప్రారంభించాడు. అక్కడ విధవలు ప్రసవించవచ్చును. బిడ్డల్ని ఆ కేంద్రం సంరక్షిస్తుంది. అటువంటి కేంద్ర స్థాపన యిదే ప్రథమం. విధవలు ఒంటరి జీవితాన్ని గడపనక్కరలేదు. గర్భస్రావాలు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడదు.




## ✦ మహాత్మా - జ్యోతిరావు ఫూలే ✦

జ్యోతీరావుకి పిల్లలు కలుగలేదు. అతని మామ అతనిని యింకో వివాహం చేసుకోమని చెప్పినా అతడు చేసుకోలేదు. “ఒక స్త్రీ తన మొదటి భర్త ద్వారా బిడ్డను కనలేకపోతే యింకొక పురుషుని వివాహం చేసుకుంటుందా? ఇది న్యాయమేనా? ఒక స్త్రీయందు సంతానం కలగకపోతే పురుషుడు యింకొక స్త్రీని వివాహం చేసుకోవడం దారుణం కాదా?” అనేవాడు.

తండ్రి చనిపోయిన తరువాత జ్యోతీరావు తండ్రికి అంత్యక్రియలు చేశాడు కాని సాంప్రదాయం ప్రకారం చేయలేదు. అనాథలకు, వికలాంగులకు అన్నదానం చేశాడు. తండ్రి చనిపోయిన మొదటి ఆబ్ధికంనాడు అతడు పేదలకి అన్నదానం చేశాడు. పిల్లలకు పుస్తకాలు యిచ్చాడు. అతని భార్య కూడా కేంద్రంలో పిల్లల గురించి శ్రద్ధ తీసుకునేది.

జ్యోతీరావు కావాలంటే మంచి ప్రభుత్వ ఉద్యోగమే లభించేది. కాని అతడు ప్రజలకి సేవ చేయడమే తన నైతిక బాధ్యతగా భావించాడు. అతడు ఒక వ్యాపారం చేసి తన కుటుంబాన్ని పోషించుకున్నాడు.

ప్రభుత్వం ఖడక్‌వలసల ఆనకట్టని నిర్మించాలని అనుకున్నప్పుడు రాయి సరఫరా చేసే కాంట్రాక్టుని జ్యోతీరావు, అతని స్నేహితడు శాఖారామ్ పరంజపే కలిసి సంపాదించారు. ఈ కాంట్రాక్టు కాలంలో జ్యోతీ రావు కార్మికుల్ని, ప్రభుత్వ ఉద్యోగుల్ని ముఖ్యంగా ఇంజనీర్లని కలిశారు. అతడు కార్మికుల సంక్షేమం గురించి, వారి హక్కుల గురించి పోరాడాడు. కార్మి కుల పిల్లలు చదువుకోవాలని పట్టుపట్టాడు. ఇటువంటి సందర్భాలలో జరిగే అక్రమాల్ని విమర్శించేవాడు. తరువాత అతడు యెర్వాడ వంతెనకి సున్నం సరఫరా చేశాడు. ఖాళీ సమయాల్ని క్రైస్తవ మిషనరీలు రాసిన పద్యాల్ని, చరిత్ర పుస్తకాల్ని చదవడానికి కేటాయించేవాడు.



1865లో జ్యోతీరావు ఒక సంచలనాత్మకమైన పుస్తకాన్ని ప్రచురించాడు. ఆ పుస్తకం పేరు “జాతి భేద వివేకసారం”. ఆ పుస్తకం రాసినది అతని స్నేహితుడు తుకారం తాత్యాపాడ్వాల్. ఆ పుస్తకం యొక్క రెండవ ముద్రణ పరిచయ వాక్యాలలో రచయిత యిలా రాశాడు.

"బ్రాహ్మణులు తమ జన్మరీత్యానే అగ్రకులం వారయ్యారు. వారికి విద్య లేక పోయినా, తెలివితేటలు లేకపోయినా, ధర్మప్రకారం నడచుకోకపోయినా శ్రేష్ఠులుగా పరి గణింపబడుతున్నారు. బ్రాహ్మణులకి సేవ చేస్తే పరలోకంలో సుఖశాంతలు కలుగు తాయని పురాణాలు చెబుతున్నాయి. బ్రాహ్మణత్వం అనే ఆధారం మీద కులవివక్ష ఏర్పడింది. శూద్రుడు గుణవంతుడైనా, ఇంద్రియ నిగ్రహం కలిగినవాడైనా శ్రేష్ఠుడు కాలేదు. ప్రపంచం అంతా దేవతల అధీనంలో ఉంది. దేవతలు మంత్రాల అధీనంలో ఉన్నారు. మంత్రాలు బ్రాహ్మణుల అధీనంలో ఉన్నాయి. కాబట్టి బ్రాహ్మణుడే నాకు దేవుడు. భూమిపై ప్రవహిస్తున్న పవిత్ర జలాలన్నీ సముద్రంలో ఉన్నాయి. సముద్రంలో ఉన్న పవిత్ర జలం అంతా బ్రాహ్మణుని కుడి పాదంలో ఉంది. ఇటువంటి నమ్మకాలే కుల వ్యవస్థ ఏర్పడడానికి కారణం."

ఈ పుస్తకాన్ని మొదటగా ఆగస్టు 1861లో వాసుదేవో నవరంగే అనే వ్యక్తి ప్రచురించాడు. అతడొక షరాఫు. ఇంగ్లాండులో తన వ్యాపారంలో నష్టం వస్తే బాకీలు తీర్చివేసి బొంబాయి చేరాడు. బొంబాయిలో ఉన్న ప్రార్థనా సమాజానికి తన సేవలు అంది ంచాడు. 1870లో అతడొక విధవ రాలిని వివాహం చేసుకున్నాడు.

1873లో కాశీబాయి అనే ఒక విధవరాలు గర్భస్రావ వ్యతిరేక కేంద్రంలో ఒక మగ బిడ్డకి జన్మనిచ్చింది. ఆ బిడ్డ పేరు యశ్వంత్. జ్యోతీరావు భార్య సావిత్రీబాయి ఆ బిడ్డని కన్న కొడుకులా సాకింది. ఈ చర్యని లోకహితవాది, భండా ర్కర్, మదన్ శ్రీకృష్ణ, మామా పరమానంద, తుకారాం పాడ్వాల్ మొదలైన సంస్కర్తలు అభినందించారు.

1871లో మాధవరావు రెనడే అనే వ్యక్తి జ్యోతీరావుకి అనుయాయి అయ్యాడు. శిశువుల సంరక్షణ కోసం జ్యోతీరావు ఏర్పాటు చేసిన కేంద్రాన్ని చూసి 1875లో రెనడే పండర్‌పూర్‌లో అటువంటి కేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. జ్యోతీరావు విధవా పునర్వివాహం గురించి అనేక వ్యాసాలు "ఇందుప్రకాష్" అనే పత్రికకు రాశాడు. విద్యాసంస్థలో సభ్యుడైన విష్ణుశాస్త్రి పండిట్ జ్యోతీరావుకి సహకరించాడు. 1866, జనవరి 28వ తేదీన విష్ణుశాస్త్రి విధవా వివాహాల కోసం ఒక సంస్థని ప్రారంభించాడు. త్వరలో యీ సంస్థకి చాలా శాఖలు ఏర్పడ్డాయి.

పాండురంగ వినాయక కర్మార్కర్‌కి వేణుభాయ్ అనే విధవరాలుతో వివాహం చేస్తారనే శుభలేఖలు ఆహ్వానాలు పంపబడ్డాయి. ఆహ్వానాల మీద గోపాల్‌హరి దేశ్‌ముఖ్, ఎమ్.జి. రెనడే, విష్ణు పరశురామ్, విష్ణుశాస్త్రి పండిట్ (ఇతరే మహారాష్ట్రీయుడైన



ఈశ్వరచంద్ర విద్యాసాగర్)లు సంతకాలు చేశారు. ఈ సంఘటన మహారాష్ట్ర సంఘంలో తీవ్ర చర్చలకి దారితీసి, ఆ సంఘం విభజింపబడింది.

అస్పృశ్యతా నివారణకి జ్యోతీరావు ఒక ఉదాహరణగా, ఆదర్శంగా నిలిచాడు. సనాతన సాంప్రదాయాలకి విరుద్ధంగా తన యింటికి దగ్గరగా ఉన్న నీటి ట్యాంకుని అస్పృశ్యుల్ని వాడుకోమన్నాడు. మునిసిపాలిటీ వారికి నీటి సౌకర్యం కలిగించలేదు. ఎండలో వారు చాలా దూరం నుండి నీరు తెచ్చుకోవలసి వచ్చింది. జ్యోతీరావు కులంలోని కొందరు యీ చర్యని ఖండించారు. జ్యోతీరావు క్రైస్తవుడయ్యాడనుకున్నారు. అంతటి సాంఘిక ఒత్తిడి ఉన్నా జ్యోతీరావు ఆదర్శంగా ధైర్యంగా నిలిచాడు. ధర్మం తన ప్రక్క ఉందనే నమ్మకం జ్యోతిరావుకి.

✦ ✦ ✦

# 4. బ్రాహ్మణులకు, అస్పృశ్యతకు వ్యతిరేకం

జ్యోతీరావు ఒక కవి కూడా. పద్యాలు బాగా రాయగలడు. "పావడాల" మీద ఒక పుస్తకం రాశాడు. "వివిధ జ్ఞాన విస్తార్" అనే మ్యాగజైను అతని పద్యాల్ని ప్రచురించింది. అయితే ఆ మ్యాగజైన్ ఉద్దేశం జ్యోతీరావు యొక్క అభిప్రాయాలు సరియైనవి కావని నిరూపించడమే.

బ్రాహ్మణులు ఆర్యులని, వారు ఇరాన్ నుండి భారతదేశానికి వచ్చారని, భారతదేశ వాసులను క్షీణదశకు తెచ్చారని, అసలు భారతీయుల్ని శూద్రులుగా పరిగణించారని



జ్యోతీరావు యొక్క అభిప్రాయం. అప్పటి సాంఘిక పరిస్థితుల్ని కళ్ళకి కట్టినట్లు వివరించాడు. ప్రభుత్వం రైతుల నుండి పన్ను వసూలు చేస్తుంది కాని రైతుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకి వెళ్ళరు. అతడు పావడాలలో ఒక అర్జీని విక్టోరియా మహారాణికి పంపాడు.

**"బ్రాహ్మణుల బారి నుండి రైతుల్ని రక్షించండి.**
**ఇతర కులాల నుండి గుమాస్తాల్ని, ఉపాధ్యాయుల్ని నియమించండి"**

జ్యోతీరావు యొక్క సందేశం వల్ల స్ఫూర్తిని పొంది బ్రాహ్మణేతరులు బాగా చదువు కుని ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారు. జ్యోతీరావు తన పావడాలలో అగ్రకులాల వారికి ముఖ్యంగా బ్రాహ్మణులకి వ్యతిరేకంగా రాశాడు. అయితే అతడు రాసిన చరిత్ర నమ్మదగినదిగా లేదు. అది యీ రోజు లభించలేదు. శివాజి గురించి రాసిన పావడా 1869లో ప్రచురించబడింది. అది నలభై అయిదు పేజీలు కలది. జ్యోతీరావు తనను తాను "కుల్వాది భూషన్‌గా" వర్ణించుకున్నాడు. శివాజి తన తల్లి దీవనలతో, విధేయులైన సహాయకులతో హిందూ పతాకాన్ని ఎగురవేశాడు. రామదాసుని శివాజి గురువుగా భావించాడు. మహ్మదీయులకు మృత్యువయ్యాడని పావడాలలో రాశాడు. జ్యోతీరావు రాసిన పద్యాలు "(బ్రాహ్మణాచేకసబ్)" దానిలో అతడు యిలా రాశాడు.

"అమాయకులు, సులభంగా మోసగించబడే రైతులు బ్రాహ్మణుల చేత చెప్పబడిన మతపరమైన పూజాదికాలు చేస్తారు. కాని వారు దోచుకోబడుతున్నారనే విషయం వారికి తెలియదు.

ఒక రైతు భార్య ప్రసవిస్తే ఆ రైతు తన బిడ్డ అకాల మరణం పాలుగాకుండా ఉండేందుకు బ్రాహ్మణుడు చెప్పిన విధంగా పూజాదికాలు చేస్తాడు. అలాగే ప్రతి సంఘటనలోను బ్రాహ్మణులకే ధన ప్రాప్తి. వివాహాలు కూర్చాలన్నా, భగ్నం చేయాలన్నా బ్రాహ్మణుల చేతిలోనే ఉంది. ఎందుకంటే వారు జాతకాల్ని చూసి, దోషాలుంటే గ్రహాలకి శాంతి చేయించి డబ్బు గుంజుతారు. పైగా బ్రాహ్మణులకి మృష్టాన్న భోజనం పెట్టాలి. ఇలా ఏ సందర్భం వచ్చినా లాభపడేది బ్రాహ్మణులే. భగవంతుని కృప కలగాలంటే బ్రాహ్మణుడు పూజ చేయవలసిందే. అతనికి భోజనం, భారీగా దక్షిణ యివ్వలసిందే. అలా చేయకపోతే భగవంతుడు కరుణించడు. రోగికి ప్రక్కన కూర్చుని బ్రాహ్మణుడు శివలీలామృతం, హరి విజయం, రామ్ విజయం మొదలైనవి చదివితే రోగి కోలుకుంటాడు. బ్రాహ్మణుడికి ధనలాభం. అదేవిధంగా మంత్రాలు చదివి, అభిషేకాలు చేయించి, పూజలు

చేయిస్తే కోరికలు సిద్ధిస్తాయి. బ్రాహ్మణుడికి ధనప్రాప్తి. మరణ సమయంలో పది రోజులు ఉత్తర క్రియలు చేయిస్తారు. దానిలో బ్రాహ్మణులకు గొడుగులు, పాదరక్షలు, బట్టలు, ఆవులు, భారీ దక్షిణ వస్తాయి.



ఈ విధంగా రాసిన పద్యాల్ని జ్యోతీరావు తానే ప్రచురించాడు. ఆ పుస్తకాన్ని విద్యాశాఖకి యిచ్చాడు. కాని వారు స్కూళ్ళలో ప్రవేశపెట్టలేదు. 1867, మార్చి 31వ తేదీన బొంబాయిలో ప్రార్థనా సమాజం స్థాపించబడింది. ఇది బెంగాల్‌లోని బ్రహ్మ సమాజ్‌లో ఒక భాగం. ఆత్మారామ్ లడ్కర్, వామన్ అబాజీ, మోదక్, రెనడే దీనిలో సభ్యులు. మొదట్లో వారు సంఘ సంస్కరణలు గురించి చర్చించేవారు. తరువాత మత విషయాల్ని గురించి చర్చిండం మొదలుపెట్టారు. వారు జ్యోతిరావు యొక్క కృషిని ప్రశంసించారు. తరువాత జ్యోతీరావు దానిలో సభ్యునిగా ఉండడం మానుకున్నాడు.

1870, ఏప్రిల్ 2వ తేదీన సార్వజనిక సభ ఏర్పడింది. దానికి గణేశ్ వాసుదేవో జోషీ నాయకుడు. సదాశివ గోవాండే కూడా ఆ సభలో ఉన్నాడు. ప్రజల యొక్క యిబ్బందుల్ని ప్రభుత్వానికి చేరవేయడం, వాటిని పరిష్కరించేటట్లు చూడడం యీ సభ యొక్క లక్ష్యం. జ్యోతీరావు స్నేహితులు మోరో విఠల్ వల్వేకర్, శాఖారం యశ్వంత్ పరంజపేలు ప్రభుత్వం ముందు ప్రజల సమస్యల్ని పెట్టే బాధ్యత తీసుకున్నారు. లార్డ్ లిట్టన్ ప్రవేశపెట్టిన ఆర్డినెన్సుకి వ్యతిరేకంగా పోరాడడానికి వారు భారతీయ పత్రికల సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఎందుకంటే ఆ ఆర్డినెన్సు పత్రికాస్వేచ్ఛకి భంగం కలిగించేది.

## ✦ మహాత్మా - జ్యోతిరావు ఫూలే ✦

1852వ సంవత్సరం ప్రధమార్థంలో సార్వజనిక సభ ఏర్పాటు కాక ముందు "దక్కన్ సఘం" అనే రాజకీయ సంఘం ఏర్పాటయింది. ప్రగతి కాముకులు, విద్యా సంపన్నులైనవారు దీనిలో క్రియాశీలక పాత్రలను చేపట్టారు. బ్రిటిషు ప్రభుత్వానికి ప్రజల సమస్యల్ని నివేదించడం వారి పని. పూణేలో 1867లో "పూనా సంఘం" ఏర్పడింది. ఈ సంఘాలు అగ్రకులాల వారి సమస్యల గురించి మాత్రమే ప్రభుత్వానికి నివేదిస్తున్నాయని జ్యోతీరావు అభిప్రాయం. కాని నిమ్నకులాల వారు సమస్యలు ప్రభుత్వానికి చేర లేదనుకున్నాడు. కాబట్టి యిటువంటి సంఘాల మీదా, సంస్థల మీదా జ్యోతీరావుకి విశ్వాసం లేదు.

సాంఘిక వ్యవస్థ యొక్క మూలాల్ని క్షాళన చేయాలనేదే జ్యోతీరావు లక్ష్యం. అందువల్ల అతడు నిమ్నకులాల వారిలో అజ్ఞానాన్ని, నిరక్షరాస్యతని, అపోహల్ని, మూఢనమ్మకాల్ని తొలగించడానికి కృషి చేశాడు. అలా చేస్తే బ్రాహ్మణుల ఆధిపత్యం నుండి వారికి విముక్తి కలుగుతుందని అతని నమ్మకం. జ్యోతీరావు రాసిన పుస్తకం యొక్క మొదటి భాగంలో పరశురాముని ప్రసక్తి ఉంది. ఎందుకంటే బ్రాహ్మణుల పురాణాల ప్రకారం పరశురాముడు 432 మిలియన్ల సంవత్సరాలు జీవించాడు. రెండు యితర పుస్తకాలు కూడా ప్రచురించాడు. దానిలో బ్రాహ్మణుల ధర్మాల గురించి అసలు విషయాలున్నాయి. ఫ్రెంచి విప్లవకారణాలైన ఆదర్శాలు అనగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మొదలైనవి ఉన్నాయి. తన పుస్తకాన్ని అమెరికాలోని నల్లజాతి వారికి అంకితం చేశాడు.

అతడు తన పుస్తకాన్ని హోమర్ మహాకవి స్ఫూర్తితో ప్రారంభించాడు. "ఏ రోజైతే వ్యక్తి బానిస అవుతాడో, ఆ రోజే అతనిలో ఉన్న మంచి గుణాలు సగం పోతాయి" ఈ పుస్తకం ప్రశ్నలు-జవాబుల రూపంలో ఉంది. పదహారు అధ్యాయాలున్నాయి. మొదటి తొమ్మిదిలో బ్రాహ్మణుల ఆధిపత్యం గురించి ఉంది.

తన పుస్తకంలో జ్యోతీరావు యీ విధంగా చెప్పాడు. "శూద్రులే జాతికి ప్రాణం. ఆర్థిక, రాజకీయ పరిస్థితులు అస్తవ్యస్తమైనప్పుడు ప్రభుత్వం బ్రాహ్మణుల మీద కంటె శూద్రుల మీదే ఆధారపడాలి. శూద్రుల్ని సంతృప్తిపరచి వారు సంతోషంగా ఉంటే వారు విధేయులై ఉంటారనడం సందేహం లేదు. కాబట్టి ప్రజలంతా విద్య నేర్చుకోవాలి".

జ్యోతీరావు పరిశోధకుడూ కాదు, భాషాశాస్త్రవేత్త కూడా కాదు. అతడు ఒక గొప్ప సంఘసంస్కర్త. బ్రాహ్మణులు, ఆర్యులను గురించి అతడు రాసిన చరిత్ర ఊహా మాత్రమే. జ్యోతీరావు తన లక్ష్యాన్ని యీ విధంగా వ్యక్తీకరిస్తున్నాడు.

## ✦ మహాత్మా - జ్యోతిరావు ఫూలే ✦

"బ్రాహ్మణులు శూద్రుల్ని దోచుకుంటున్నారని తెలియజేయడమే నా పుస్తకం యొక్క ఉద్దేశం"

ఆ పుస్తకం రాసిన తరువాత జ్యోతీరావు ఒక ఉద్యమాన్ని ప్రారంభించడానికి సిద్ధమయ్యాడు. పుస్తకం రాయడానికి ముందు కూడా తన అభిప్రాయాల్నీ, లక్ష్యాన్నీ, ప్రజలకు తెలియజేశాడు. తన పోరాటానికి నాందిగా సత్యశోధక సమాజాన్ని స్థాపించాడు. ఇదే మొదటి సాంఘిక ఉద్యమం. ఆ సమాజానికి మొదటి అధ్యక్షుడూ, కోశాధికారీ అయనే. కడ్లాగ్ అనే వ్యక్తి కార్యదర్శి. ఈ సమాజం యొక్క లక్ష్యం శూద్రులు మతపరంగా బ్రాహ్మణుల ఆధిపత్యంలో బానిసలుగా మగ్గిపోతున్నారనే విషయం వారు తెలుసుకోవడం. ఈ సమాజంలో సభ్యుడు కావాలంటే తులసీదళాన్ని చేతిలో ఉంచుకుని బ్రిటిషు వారికి విధేయులుగా ఉంటానని ఖండేరావ్ ఆలయంలో ప్రమాణం చేయాలి.

1911లో సత్యశోధక సమాజం తన నియమాల్ని ప్రకటించింది.

1) ప్రతి మానవుడు భగవంతుని బిడ్డయే. కాబట్టి మానవులందరూ నా సోదరులు.
2) తల్లి వద్దకు బిడ్డ వెళ్ళడానికి బిడ్డకి మధ్యవర్తి ఎలా అవసరం లేదో అలాగే భగవంతుని ప్రార్థించడానికి అర్చకుని మధ్యవర్తిత్వం అవసరం లేదు.
3) భగవంతుని సాక్షిగా నా సంతానానికి విద్య నేర్పిస్తాను.

ఈ నియమాల ప్రకారం నేను జీవించడానికి తగిన శక్తిని భగవంతుడు నాకు ప్రసాదించు గాక!

ఈ సమాజంలో అన్ని కులాల వారు సభ్యులుగా చేరవచ్చు. అలా చేరారు కూడా. ఒక శాఖని ప్రారంభించినప్పుడు ప్రతీ వారం సమావేశాలు జరిగేవి. పూణేలోని సోమ వారపేటలో ఉన్న గోవాండే యింటి వద్ద యీ సమావేశాలు జరిగేవి. ఆ సమావేశాలలో మద్యపాన నిషేధం, నిర్బంధ విద్య, దేశీయ వస్తువులు వాడకం, బ్రాహ్మణులు లేకుండా పండుగలు చేసుకోవడం, తక్కువ ఖర్చుతో వివాహాలు చేసుకోవడం, దయ్యాలు, భూతాలను గురించిన మూఢ నమ్మకాలు పోగొట్టడం, జ్యోతిషం గురించిన నిజాలు, భగవంతుడే తండ్రి, సోదరుడు అనే భావాన్ని కలిగించడం మొదలైన అంశాల మీద చర్చలు జరిగేవి.

ప్రార్థనా సమాజం, బ్రహ్మ సమాజాలలాగే యీ సత్యశోధక సమాజం కూడా ఏకేశ్వరోపాసనే ధ్యేయంగా కలిగి ఉంది. ఈ మూడు సమాజాలూ ప్రజలంతా దేవుని బిడ్డలని నమ్ముతాయి. సామూహికంగా ప్రార్థనలు చేస్తాయి. ప్రతీవారం సమావేశాలు

నిర్వహిస్తాయి. రామ్మోహన్ రాయ్ ప్రార్థనకి ప్రాధాన్యత యిస్తే, జ్యోతీరావు సత్యానికి ప్రాధాన్యత యిచ్చాడు. ఎందుకంటే ప్రార్థన, ఆధ్యాత్మికాభివృద్ధి అనే వాటి మీద జ్యోతీరావుకి నమ్మకం లేదు.



సమాజాన్ని స్థాపించిన తరువాత దాని లక్ష్యాల్ని ఆచరణలో పెట్టడానికి కృషి చేశాడు. పదిమంది విద్యార్థులకి స్కాలర్‌షిప్ యిచ్చేవాడు. (ఉపకార వేతనం). బ్రాహ్మణుల జోక్యం లేకుండా చాలా వివాహాలు చేశాడు. వధూవరులు ఒకరికొకరు విధేయులుగా ఉంటామని ప్రమాణం చేయించేవాడు. తరువాత వధూవరుల్ని ఆశీర్వదించేవాడు. బ్రాహ్మణుల ప్రమేయం లేకుండా వివాహం జరిపించడం అనేవి అప్పట్లో కనివినీ ఎరుగని విషయం. అటువంటి వివాహం జ్యోతీరావు స్నేహితుడైన జ్ఞానోబాససానేకి జరిగింది. ఆ వివాహం పెద్ద సంచలనాన్ని కలిగించింది.

తరువాత అదే ఆలోచనలో ఉన్నవారు జ్యోతీరావు యొక్క ఉద్యమంలో పాల్గొన్నారు. వార్తాపత్రికలు యీ విధంగా చెప్పాయి.

కృష్ణారావు పాండురంగ భవేకర్ అనే వ్యక్తి వృత్తిరీత్యా పూలవ్యాపారి. అంతేకాక అతడు కవి, సంపాదకుడు, మంచి వక్త కూడా. అతడు గ్రామ గ్రామంలోను యీ సమాజం యొక్క సందేశాన్ని అందజేయడానికి విశేషకృషి చేశాడు. భవేకర్‌తో పాటు

బొంబాయిలో ఉన్న వ్యాంకు బాలాజీ కలేవర్, జయ కారడిలింగు కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. అలాగే నర్సుసాయిబ్ అనే కాంట్రాక్టర్ కూడా ప్రచారంలో సహాయం చేశాడు. కామాటిపురాలో నివసించే కలేవర్ 1200/- రూపాయిల విలువ చేసే తన కర్మాగారాన్ని సమాజానికి యిచ్చాడు. నిమ్న కులాలలో ఉండే ధనికులు సమాజంలో చేరారు. వారిలో పోల్సాని రాజన్నలింగు ముఖ్యుడు. రెండవ వ్యక్తి వ్యాంకు అయ్యావారు. తరువాత రామ్‌సేట్ బాపూసేట్ ఉర్వానీ పూణే నుండి, మారుతిరావ్ నవాటే కూడా చేరారు. అప్పటి వైస్రాయికి గౌరవ డాక్టరుగా ఉన్న విశ్రమ్ రాంజీ ఘోబే కూడా సహాయం చేశాడు.

ఈ సమాజం యొక్క ప్రథమ వార్షికోత్సవం చాలా ఘనంగా జరిగింది. నారాయణ్ తుకారాం నగార్కర్‌ని కార్యదర్శిగా ఎన్నుకున్నారు. భవేకర్, ఉర్వానీలు, నామినేట్ చేయ బడ్డారు. తరువాత రామచంద్రరావ్ ధమ్నస్కర్, సంతూజీ రాష్జిల్యాడ్, నారాయణ్ మేఘాజీలో ఖండేలు కూడా యీ సమాజం లోనివారే.

ఈ సమాజం యొక్క కృషి చాలా మంది భావుకుల దృష్టిని ఆకర్షించింది. కాని ధైర్యంగా ఆచరింప గలవారు చాలా కొద్దిమంది మాత్రమే. మహదేవరావ్ రెనడే సోదరి భర్త మరణించాడు. అప్పుడు రెనడే యిలా అన్నాడు. “నేను నా సోదరికి పునర్వివాహం చేస్తే నా తండ్రి హృదయం పగులుతుంది. పైగా పూణే బ్రాహ్మణులు నన్ను నిశితంగా విమర్శిస్తారు” అన్నాడు. జ్యోతీరావు ఆ మాటలకు, “అయితే సంస్కర్తగా ప్రచారం చెయ్యకు” అని సమాధానం యిచ్చాడు. 1873 అక్టోబర్ నెలలో రెనడేకి ముప్ఫయి రెండేళ్ళు. అతని భార్య చనిపోయింది. పన్నెండేళ్ళ బాలికని వివాహం చేసుకున్నాడు. ఈ చర్య మహారాష్ట్రలోని సంస్కర్తలకి విభ్రాంతి కలిగించింది. జ్యోతీరావు యీ చర్యకి ఘాటుగా రెనడే మీద “వివిధ జ్ఞాన విస్తార్” అనే పత్రికలో వ్యాసం రాశాడు.

లోకహితవాది గోపాలరావు దేశ్‌ముఖ్ కూడా సాంప్రదాయానికి విరుద్ధంగా తన కుమారుని ఇంగ్లాండు పంపించినందుకు ప్రాయశ్చిత్తం చేసుకున్నాడు. ఆ కాలంలో బ్రాహ్మణులు సముద్రాన్ని దాటకూడదు. అలాగే మరికొంతమంది సంస్కర్తలు కూడా వెనక్కి తగ్గారు. కొంతమంది మాత్రమే సంస్కరణల్ని అమలులో పెట్టగలిగారు.

1875 జులై నెలలో మహాదేవ్‌రావ్ రెనడే ఆర్య సమాజ స్థాపకుడైన దయానంద సరస్వతిని ఆహ్వానించాడు. దయానంద సరస్వతి అప్పటికే ఉత్తర హిందూస్థాన్, బెంగాల్‌లో పర్యటించాడు. కాని దయానంద్ యొక్క సిద్ధాంతాన్ని అంగీకరించడం ప్రజలకి కష్ట

మయింది. ఎందుకంటే అతడు జ్ఞానసర్వస్వమంతా వేదాలలోనే ఉందన్నాడు కాని కుల వ్యవస్థ గురించి చెప్పలేదు. దయానంద్ పూణే, సతారాలలో చాలా ప్రసంగాలు చేశాడు. పూణేలో ఊరేగింపుని అడ్డగించుదామనుకున్నారు. సనాతనవాదులు ఆ ఊరేగింపుని అడ్డగించుదామనుకున్నారు. సంస్కర్తలు జ్యోతీరావు సహాయాన్ని కోరారు. జ్యోతీరావు కూడా ఆ ఊరేగింపులో తన సహచరులతో పాల్గొన్నాడు. అయితే దీని వ్యతిరేకులు, ఒక గాడిదను ఊరేగించారు. ఇరువర్గాల వారికి పోట్లాట జరిగింది. పోలీసుల జోక్యంతో అది సద్దుమణిగింది.

1875లో సమాజం యొక్క రెండవ వార్షికోత్సవం జరిగింది. విశ్రమ్ రాంజీ ఘోడే అధ్యక్షుడయ్యాడు. రాంసేట్ ఉర్వానీ కోశాధికారి అయ్యాడు. ఒక యూదుజాతికి చెందిన ఇలయ్యసాల్మన్ అనే వ్యక్తిని కమిటీలోకి తీసుకున్నారు. ప్రతీ ఆదివారం సాయం కాలం సమావేశాలు జరిగేవి. ప్రతి పదిహేను రోజులకి వేదాంతం మీద ప్రసంగాలు జరిగేవి. సమాజంలో చురుకుగా పని చేసేవారు కూడా ఉపన్యాసాలు యిచ్చేవారు. అదే సంవత్సరం నవంబరు నెలలో ప్రిన్స్ ఆఫ్ వేల్స్ పూణేని సందర్శించాడు. అప్పుడు ఏర్పాటు చేసిన సమావేశంలో ధండీరామ్ కుంభార్, కృష్ణారావ్ భలేకర్లు ప్రిన్స్‌ని కీర్తిస్తూ పాటలు పాడారు. సమాజంలో బ్రాహ్మణుల ప్రమేయం లేకుండా వివాహాలు జరిగాయి. ఈ వివాహాలు చట్ట సమ్మతమైనవని లాయరు రాఘవేంద్రరావు సమర్థించాడు. సమాజంలో విగ్రహారాధన, కుల వ్యవస్థల మీద వ్యాసరచన పోటీలు కూడా జరిగాయి. గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సమాజ సేవకులు గ్రామాలలో విద్యాభివృద్ధికి కృషి చేశారు. వారు హడప్సర్ అనే గ్రామంలో ఒక స్కూలుని ప్రారంభించారు. సమాజంలో మూడువందలమంది సభ్యులు చేరారు.

✦ ✦ ✦

# 5. రైతుల, కార్మికుల హక్కుల కోసం పోరాటం

1877వ సంవత్సరం ప్రథమార్థంలో సత్యశోధక సమాజంలో సభ్యులకు హేతువాదం, శాస్త్రీయ దృక్పథం కలిగించేటందుకు భావస్ఫోకరమైన ఉపన్యాసాలు యిచ్చారు. వాటిలో ఒక ఉపన్యాసం "భారతదేశంలో పేదరికం" అనే అంశం మీద యివ్వబడింది. వక్తృత్వ పోటీలు జరిగాయి. వ్యాసాలకి, వక్తృత్వానికి బహుమతులిచ్చారు.



కరవుతో బాధపడుతున్న పిల్లల కోసం ఏర్పాటు చేయబడిన వసతి గృహం పని చేయడం ప్రారంభించిందని జ్యోతీరావు సమాజ సభ్యులకు తెలియజేశాడు. ఇవి ఐదర్‌పూర్, మరాజ్, టస్గాంవ్‌లలో యీ గృహాలు ఏర్పాటు చేయబడ్డాయి.

1875లో ఋణదాతలు తాము యిచ్చిన అప్పు కంటే ఎక్కువ మొత్తం రాసి సంతకాలు చేయించుకుంటున్నారని అహమ్మదాబాదు, పూణే, సతారా, షోలార్‌పూర్‌లలోని రైతులు వారిపై తిరుగుబాటు చేశారు. దీనికి ప్రభుత్వం ఒక కమిటీని వేసి విచారించమంది. కమిటీ నివేదిక ప్రకారం ఋణదాతలకు, ఋణగ్రహీతలకు మధ్య సత్సంబంధాలు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం "డెక్కన్ ఎగ్రికల్చరల్ వీఫ్ ఏక్ట్" అనే చట్టాన్ని అమలు చేసింది. దానివల్ల రైతుల హక్కులు సంరక్షింపబడతాయి. ఈ చట్టాన్ని జ్యోతీరావు సమర్ధించాడు.

పూణే మునిసిపాలిటీ యొక్క కార్యక్రమాలలో జ్యోతీరావు ఉత్సాహంగా పాల్గొనేవాడు. పౌరహక్కుల గురించి నిరంతరం ఆలోచించేవాడు.

అదే సమయంలో వాసుదేవ్ బల్వంత్ ఫాడ్కే బ్రిటిషు వారిపై తిరుగుబాటు చేశాడు. 1847లో లాహూజీ మాంగ్ వద్ద ఫాడ్కే మిలిటరీ శిక్షణ పొందాడు. 1849వ సంవత్సరానికి మహారాష్ట్రని యీ తిరుగుబాటు కుదిపివేసింది. దీనిపై వార్తలు ఎక్కువగా ప్రచారం చేశాయి. ఫాడ్కేని అరెస్టు చేసి జైలుకి పంపారు. అతడు ఏడెన్‌లోని జైలులో 1883 ఆగస్టు 17న మరణించాడు.



ఫాడ్కే సైనికులకి జ్యోతీరావు రొట్టెల్ని సరఫరా చేశాడంటారు. కాని జ్యోతీరావు "సార్వజనిక సత్యధర్మ" పత్రికలో ఫాడ్కేని దుయ్యబట్టాడు. చిప్లూంకర్ ఫాడ్కేని ఒక బందిపోటుగా వర్ణించాడు. రెనడే అతనిని విపరీత దేశభక్తుడన్నాడు. ఫాడ్కే, జ్యోతీరావులు ఒకే గురువు వద్ద సైనిక శిక్షణ నేర్చుకున్నాడు.

## ✦ మహాత్మా - జ్యోతిరావు ఫూలే ✦

1879 చివర్లో జ్యోతీరావు "దీనబంధు" పత్రిక ద్వారా నిర్బంధం ప్రాథమిక విద్యా విధానాన్ని ప్రవేశపెట్టమని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుని వచ్చాడు. కాని ప్రభుత్వం పట్టించుకోలేదు. నిర్బంధ ప్రాథమిక విద్య ఇంగ్లాండులో 1870లోను, 1889లో ఐర్లాండులోను, 1890లో స్కాట్లాండులోను ప్రవేశపెట్టారు. కాని ప్రభుత్వం భారతదేశం గురించి పట్టించుకోలేదు.

జ్యోతీరావు కార్మికుల సమస్యల గురించి గట్టిగా కృషి చేశాడు. జ్యోతీరావు సహచరుడైన నారాయణరావు "దీనబంధు" లో కార్మికులు కర్మాగారాలలో రోజుకి పధ్నాలుగు గంటలు పని చేస్తున్నారనీ, వారి యితర సమస్యల గురించీ తెలియజేశాడు. వారికి విశ్రాంతి అనేదే లేదు. విశ్రాంతి కోసం అందరు కార్మికులూ ఒక్కసారిగా కాక వంతుల వారీగా వెళ్ళాలని నిర్దేశించారు యజమానులు. అలాకాకుండా కార్మికులు బయటికి వెళ్తేవారికి నాలుగు అణాలు జరిమానా వేసేవారు. ఈ విషయాన్ని అధ్యయనం చేయమని ప్రభుత్వం కమిటీని వేసింది. అయితే ఆ కమిటీలో కార్మికుల ప్రతినిధి ఉండాలని లోఖాండే అన్నాడు. తరువాత అతడే ప్రతినిధిగా ఎన్నుకోబడ్డాడు.

మునిసిపాలిటీలో కమిటీ ఎన్నికలు ప్రతీ ఏడు ప్రారంభంలో జరగాలనీ, సభ్యులు ఓటు వేయాలనీ హరి రావోజీ చిప్లూంకర్ ఒక తీర్మానాన్ని ప్రవేశ పెట్టాడు. జ్యోతీరావు ఆ తీర్మానాన్ని బలపరిచాడు. ఎందుకంటే అలా చేయడం వల్ల అధికారం ఒక వర్గంలోనే ఉండిపోదు. లార్డ్‌లిట్టన్ పూణేని సందర్శించినపుడు అయ్యే ఖర్చులు భరించడానికి మునిసిపాలిటికి తీర్మానాన్ని అంగీకరించింది. అందరు ఓటు వేశారు జ్యోతీరావు తప్ప. ఆ డబ్బుని పేదల సంక్షేమం కోసం ఉపయోగించాలని అతని అభిప్రాయం. ప్రజా సంక్షేమం కోసం ఏ తీర్మానాన్నైనా వ్యతిరేకించవచ్చునని దీని వల్ల తెలుస్తుంది.

మద్యపానం స్వేచ్ఛగా జరుగుతుండడం చూసి జ్యోతీరావు తీవ్రంగా స్పందించాడు. అతడు పూణే మునిసిపాలిటీ అధ్యక్షునికి యీ విషయం గురించి ఘాటుగా లేఖ రాశాడు. ఆ లేఖలో యిలా ఉంది.

"ఉద్యోగుల నియామకానికీ, ఆరోగ్యశాఖకీ మునిసిపాలిటీ విరివిగా ఖర్చు చేస్తుంది. పూణేలో యిదివరకు మద్యం దుకాణాలు లేవు. కాని యిప్పుడు ఆ దుకాణాలు జనసమ్మర్దమైన ప్రదేశాలలో కూడా ఎక్కువగా ఉన్నాయి. ప్రజల నైతికత క్షీణించడానికి బీజాలు పడుతున్నాయి. దీనివల్ల మునిసిపాలిటీ ఊహించిన ఆరోగ్యం పాడవుతుంది. మద్యపానం వల్ల చాలా కుటుంబాలు నాశనమయ్యాయి. కాబట్టి యీ ఉద్ధృతాన్ని

తగ్గించడానికి మద్యం దుకాణాల మీద పన్ను వేయాలి. ఇంతవరకూ ఏ మునిసిపాలిటీ యిటువంటి పన్ను విధించలేదు. కాని కేంద్రప్రభుత్వం ఆ పని చేసింది. కాబట్టి మునిసి పాలిటీ నా తీర్మానాన్ని కమిటీలో చర్చించవలసినదిగా కోరుతున్నాను"

ఈ లేఖ సంచలనాన్ని సృష్టించింది. "జ్ఞాన ప్రకాష్" అనే పత్రిక జ్యోతీరావుని సమర్థించింది. ఆ పత్రిక యిలా అంది.

"జ్యోతీరావు మొట్టమొదటిగా మునిసిపాలిటీని యీ సమస్యపై దృష్టి సారించేటట్లు చేయడం ప్రాధాన్యతని సంతరించుకుంది. ఆయనకి మా కృతజ్ఞతలు".

జ్యోతీరావు లేఖ అందినట్లుగా మునిసిపాలిటీ అధ్యక్షుని నుండి సమాచారం వచ్చింది. కమిటీలో యీ విషయం గురించి చర్చించబడింది. తీర్మానం యిలా ఉంది.

"కమిటీలో యీ విషయం గురించి చర్చించడానికి అధ్యక్షులు నిర్ణయం తీసు కోవాలి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డరు ప్రకారం మద్యం మీద పన్ను విధించకూడదు. కాని యీ పన్ను వేయడం వల్ల పూణేలో మద్యం దుకాణాల సంఖ్య తగ్గుతుంది."

జ్యోతీరావు లేఖని పై తీర్మానంతో కలిపి అధ్యక్షుడైన రిచ్నెల్‌కి పంపారు. ఆయన ఎక్సైజ్ శాఖాధిపతి హెన్రీ డిక్సన్‌కి పంపాడు. డిక్సన్ యీ క్రింది విధంగా జవాబు పంపాడు.

"1873-77 సంవత్సరాలలో పూణేలో నాలుగే మద్యం దుకాణాలు ఉండేవి. 1877-78లో ఆరు కొత్త దుకాణాలు వచ్చాయి. అవి పదికి పెరిగాయి. మద్యం దుకాణాలు లేకపోతే అక్రమంగా మద్యం తయారు చేసేవారు ఎక్కువవుతారు. జిల్లా గవర్నరు మద్యపానం ఎక్కువవుతుందని అంగీకరించారు. రిచ్నెల్ యీ సమస్యని పబ్లిక్ సూపరింటెండెంట్‌కి పంపారు. ఆయన యిలా జవాబిచ్చాడు.

"ధనికులు యిదివరకు మద్యపానానికి బానిసలు కాలేదు. కాని యిప్పుడు బాగా అలవాటు పడ్డారు. ఆ కారణం చేతనే మద్యపానం అధికమయింది. కాని వారు దేశవాళీ మద్యానికి అలవాటు పడలేదు.

ఈ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటినీ రిచ్నెల్ పూణే మునిసిపాలిటీకి పంపాడు. ఈ క్రింది విధంగా దానిపై రాశాడు.

"మద్యం దుకాణాలు పెరిగినందువల్ల మద్యపానం కూడా పెరిగిందనుకోడానికి వీలు లేదు. కాని యిది పెరగకుండా చేయడానికి ఏమైనా చేయగలమా అనేదే ప్రశ్న".

జ్యోతీరావు లేఖపై స్పందించిన మునిసిపాలిటీ మద్యపానము పెరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపింది. అయితే మద్యపానాన్ని నిషేధించాలని అన్న మొదటి వ్యక్తి జ్యోతీరావు కాదు. అంతకు ముందు 1852లో సతారా వాసులు మద్యం దుకాణాల్ని మూసివేయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 1869లో ఒక ఆఫీసరు డి.డబ్ల్యు. బెల్ అనే ఆయన ప్రభుత్వం యొక్క మద్యం విధానాన్ని యీ క్రింది విధంగా తెలియజేశాడు.

"పీష్వాల క్షీణదశలో మద్యపానం బాగా పెరిగింది. దాని వల్ల వచ్చిన పన్నుల ఆదాయం కూడా పెరిగింది. నేరస్థులకు కఠిన శిక్షలు పడేవి"

జ్యోతీరావు యొక్క ప్రభావం మహారాష్ట్ర అంతటా ప్రబలింది. నిమ్నజాతుల సమస్యలు ప్రభుత్వానికి తెలియజేయడానికి అతడొక సాధనంగా మారాడు. సంఘసంస్కరణలో అతడొక నూతనాధ్యాయాన్ని సృష్టించాడు.

✦ ✦ ✦

# 6. హంటర్ కమీషన్‌కి నివేదించడం

**భా**రతదేశంలో విద్య గురించి అధ్యయనం చేయడానికి 1882లో సర్ విలియం హంటర్ అధ్యక్షతన ప్రభుత్వం ఒక కమిటీని వేసింది. చాలామందిని అక్షరాస్యుల్ని చేసే ఉద్దేశంతో హంటర్ భారతదేశం అంతటా పర్యటించి ప్రముఖుల్ని కలుసుకున్నాడు. బ్రిటిష్ ఇండియా రాష్ట్రాలలో అతడు కమిటీలు ఏర్పాటు చేశాడు. నిపుణులతో మంతనాలు జరిపాడు. ఆ నిపుణులలో ఒకరు జ్యోతీరావు. అతడు తన అభిప్రాయాల్ని తెలియజేశారు.

న్యూ ఇంగ్లీష్ స్కూల్ సూపరింటెండెంట్ అయిన వి.యస్. ఆప్టే విద్యా కమిటీకి యీ విధంగా నివేదిక పంపాడు.



"క్రైస్తవ మిషనరీలు నిజమైన దేశభక్తితో పాఠశాలల్ని స్థాపించలేదు. వారి ఉద్దేశాలు కూడా పూర్తిగా విద్యకే పరిమితం కాలేదు."

చాలామంది ప్రముఖులు, నిపుణులు భారత దేశంలో విద్యావిధానం ఉండాలని సూచించారు. కానివారు ఆ విద్యని అగ్రకులాల వారికే అని తెలియజేశారు. జ్యోతీరావు మాత్రం దానిని విరుద్ధంగా తెలియజేశారు. నిమ్న వర్గాల వారిని ప్రభుత్వం పట్టించుకోలేదని అతడు దుయ్యబట్టాడు. జ్యోతీరావు తాను స్థాపించిన పాఠశాలల గురించీ, విద్యా వ్యాప్తికి తాను చేసిన కృషిని తెలియజేశాడు. ఇంకా తన నివేదికలో యిలా చెప్పారు.



"అగ్రజాతుల వారు నిమ్నజాతుల వారికి విద్యనందిస్తారనే భ్రమలో ప్రభుత్వం ఉంది. రైతుల వద్ద నుండి పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని అగ్రకులాల వారి విద్య కోసం వెచ్చిస్తుంది. విద్యాసంస్థలు కూడా ధనిక వర్గాల వారికే విద్య నేర్పి వారి ఉన్నతికి తోడ్పడుతుంది. విద్యావంతులైన వారు నిమ్నకులాలను ఉద్ధరించే స్థితిలో లేరు. డిగ్రీల చేత పుచ్చుకున్నవారు అదృష్టహీనులకు ఏం సాయం చేశారు? సంఘంలో ఎలాంటి మార్పు తెచ్చారు? కాబట్టి అగ్రవర్ణాల వారికే విద్యనందించడం ఎంతవరకు సమంజసం? అలా చేసినందువల్ల నైతికత పెరుగుతుందా?

జాతీయాభివృద్ధికి కొలమానం విశ్వవిద్యాలయాలలో విద్యార్థుల సంఖ్యాబలం. వేటాడకూడదని చట్టం తీసుకుని రావడం, ఎక్కువ పన్ను చెల్లించేవారికి ఓటు హక్కు యివ్వడం రాజ్యాంగం యొక్క గొప్పతనం అనిపించుకోదు. అలాగే విశ్వవిద్యాలయము

నుండి వచ్చిన మెరుగైన వారికి ఉద్యోగాలివ్వడం (అగ్రకులాలకు), విశ్వవిద్యాలయాలకు డీన్లుగా దేశీయుల్ని (అగ్రజాతులు) నియమించడం జాతిని అభివృద్ధి చేయడం అనిపించుకోదు. చివరకు తేలేది ఏమంటే ముఖ్యమైన ప్రభుత్వ ఉద్యోగాలన్నీ బ్రాహ్మణుల కైవశం అవడం. వారికే గుత్తాధిపత్యం లభించడం ప్రభుత్వం ప్రజా సంక్షేమమే కోరుకుంటే యీ సమస్య గురించి ప్రభుత్వం లోతుగా ఆలోచించాలి. ఇతర కులాలవారికి కూడా ఉద్యోగాలు యివ్వాలి. ఇది యిప్పట్లో సాధ్యం కాదని ప్రభుత్వం భావిస్తే ప్రాథమిక విద్య పై దృష్టి పెట్టాలి. అప్పుడు ప్రజలలో నైతికత ఏర్పడుతుంది. అగ్రకులాలవారు పై చదువులు తామే కొనసాగించుకోగలరు.

బొంబాయి జిల్లాలో ప్రాథమిక విద్య నిర్లక్ష్యం చేయబడింది. దానికి సరియైన వసతుల, వనరులు లేవు. రైతుల నుండి పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని విద్యకు కేటాయిస్తామన్నారు. కాని అలా జరుగలేదు. దాదాపు పది లక్షలమంది పిల్లలకి ప్రాథమిక విద్య అందలేదు. రైతుల దారిద్ర్యం, వారు యింకొకరి మీద ఆధారపడడం మొదలైన ప్రస్తుత దయనీయ స్థితికి కారణాలు. రైతులు, నిమ్న కులాలవారు ప్రాథమిక విద్యని ఉపయోగించుకోలేకపోతున్నారు. వారి పిల్లలు చాలా కొద్దిమంది మాత్రమే చదువుతున్నారు. వారు కూడా విద్య కొనసాగించలేకపోతున్నారు. తండ్రుల పేదరికం వల్ల వారు కూడా పని చేయవలసి వస్తుంది. వీరికి ప్రభుత్వం ఎటువంటి ఆర్థిక సహాయం చేయడంలేదు. కాబట్టి ప్రాథమిక విద్యని నిర్బంధం చేయాలని నా అభిప్రాయం. ముస్లింలు కూడా విద్యకి దూరంగానే ఉన్నారు. ఎందుకంటే వారికి మరాఠీ, ఇంగ్లీషు భాషలంటే యిష్టం లేదు. వారి భాషలో బోధించే పాఠశాలలు చాలా తక్కువగా ఉన్నాయి. కుల వివక్షతో నిమ్నకులాల వారు విద్యని కోల్పోతున్నారు. పైగా అగ్రకులాల వారి ప్రక్క వీరిని కూర్చోనివ్వరు. వారి కోసం ప్రత్యేకంగా స్కూళ్ళు ఉన్నా అవి పెద్ద పట్టణాలలో ఉన్నాయి. పూణేలో నిమ్నజాతుల వారు అయిదువేలకి పైగా ఉన్నారు. వారికి ఒక్కటే స్కూలు ఉంది. అదీ నామమాత్రంగా. ముప్పయిమంది విద్యార్థులే ఆ స్కూలులో ఉన్నారు. ఇవి విద్యాశాఖకే అవమానం.

కాబట్టి గ్రామాలలో నిమ్నకులాల వారి జనాభాని అనుసరించి ప్రత్యేక పాఠశాలలు స్థాపించాలి. ప్రస్తుత పద్ధతి ప్రకారం ఒక ఉపాధ్యాయుని వేతనం విద్యార్థి యొక్క ప్రగతిని బట్టి యివ్వకూడదు. ఏ ఉపాధ్యాయుడూ స్వంతంగా స్కూలుని నడపలేడు. అతని జీవనోపాధికి సరిపోదు. ప్రభుత్వ పాఠశాలలో అందించే విద్య నాణ్యంగా ఉండాలి, ఉపయోగకరంగా ఉండాలి. ఉపాధ్యాయుల వేతనాలు వారి అవసరాలు తీర్చేటట్లుగా ఉండాలి. జీతాలు తక్కువైతే పని నాణ్యత తగ్గుతుంది. ఉపాధ్యాయులకు బోధనలో శిక్షణ యివ్వాలి.

అగ్రవర్ణాల వారితో కలిసి నిమ్నకులాల వారు చదివితే అందరిలోనూ నైతిక విలువలు పెరుగుతాయి. కాని వారి మతపరమైన అభిప్రాయాల వల్ల అగ్రకులాలవారు కలవలేరు. నిమ్నకులాల వారు ఉపాధ్యాయులైతే వారికి అంతస్తు భేదం ఉండదు. అవి నాగలి పట్టిన చేతులు. ఉపాధ్యాయశిక్షణ లేకపోయినా అర్హత ఉంటే ఉపాధ్యాయులుగా వారిని నియమించవచ్చు. పన్నెండు రూపాయలకి తక్కువ కాకుండా వారికి జీతాలివ్వాలి. వారికి అదనంగా అకౌంటెంటు లేక గ్రామపోస్టుమాస్టరు ఉద్యోగాన్ని యివ్వాలి. వారి అంతస్తుని పెంచాలి. ఏ స్కూలులో ఎక్కువమంది విద్యార్థులు ఉత్తీర్ణులవుతారో ఆ స్కూలు ఉపాధ్యాయులకు అదనపు జీతం యివ్వాలి. పట్టణాలలో ఉండే పాఠశాలల పాఠ్య ప్రణాళిక కంటె గ్రామాలలోని పాఠశాలలో సులభంగాను, ఆచరణాత్మకంగాను ఉండే ప్రణాళికని ప్రవేశపెట్టాలి. ఒక ఆదర్శక్షేత్రాన్ని ఏర్పాటు చేయాలి. దాని వల్ల వ్యవసాయం గురించి విద్యార్థులకు మంచి అవగాహన కలుగుతుంది.

ప్రైమరీ స్కూళ్ళలోను, మాతృభాషా మాధ్యమంలో నడిచే స్కూళ్ళలోను పాఠ్య ప్రణాళికను మార్చాలి. స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్లు సంవత్సరానికి కనీసం నాలుగుసార్లైనా స్కూళ్ళను సందర్శించాలి. అదీ ఆకస్మికంగా వెళ్ళాలి. అంతేకాని ఏదో చూశామన్నట్లుగా ఉండ కూడదు. ముఖ్యంగా తెల్లవారు తనిఖీ చేయడం అవసరం. ఎందుకంటే వారు చేస్తేనే ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుంది. ప్రాథమిక పాఠశాలలు పెరగాలి. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్న స్కూలుకి ప్రభుత్వం గ్రాంటు యివ్వాలి. రైతుల పన్నుల ద్వారా వచ్చిన దానిలో సగం ప్రాథమిక పాఠశాలల కోసం వెచ్చించాలి. మునిసిపాలిటీల పరిధిలోనే ప్రభుత్వం పాఠశాలలను ఏర్పాటు చేయాలి. రాష్ట్రనిధుల నుండి, కేంద్ర నిధుల నుండి వాటి కోసం ఖర్చు చేయాలి. మునిసిపాలిటీ పాఠశాలల నిర్వహణ పగ్గాలు చేపట్టకూడదు.

తగిన నిధులు ఉంటే ప్రాథమిక పాఠశాలలకు, ప్రైవేటు ఇంగ్లీషు పాఠశాలలకు గ్రాంట్లు యివ్వాలి. నిధుల విడుదల విద్యాశాఖ డైరెక్టర్ చేతిలో ఉండాలి. ప్రస్తుతం కమిటీలలో ఉన్న పాటిల్‌లు, ఇనాందారులు సక్రమంగా వాటిని వినియోగించడం లేదు. ప్రైమరీ (ప్రాథమిక) పాఠశాలలు పాతబడిపోయాయి. చదవడం, రాయడం రాని బ్రాహ్మణుల ఆధీనంలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధ్యాయులకు శిక్షణ యివ్వడానికి అవకాశం లేదు. కాబట్టి ప్రభుత్వమే వీటి నిర్వహణని చేపట్టాలి. సెకండరీ పాఠశాలల్ని నడిపే ప్రైవేటు వ్యక్తులకు తగినంత జీవనాధారం లభించడం లేదు. విష్ణుశాస్త్రి చిప్లూంకర్ లేక భావేలావంటివారు ఆ స్కూళ్ళని నడిపి, వారికి గ్రాంటు యిస్తే విద్యార్థులకి విలువలతో కూడిన విద్య లభిస్తుంది. కాని సెకండరీ స్కూళ్ళలో విద్యార్థుల సంఖ్య పెరగడం

లేదు. కాబట్టి సామాన్యులకి సెకండరీ విద్య తగినది కాదు. పైగా ఆచరణాత్మకం కూడా కాదు. ఉపయోగం ఉండాలి కదా? అప్పుడే అటువంటి విద్యార్థులకి ఉపాధ్యాయులుగానో, గుమాస్తాలుగానో ఉద్యోగాలు వస్తాయి. మెట్రిక్యులేషన్ పరీక్ష వల్ల విద్యార్థులు తమ భవిష్యత్తుని ఏర్పాటు చేసుకోలేకపోతున్నారు. కాబట్టి అందరికీ ఉన్నత విద్య అవసరం. అన్ని సబ్జెక్టుల పుస్తకాల్ని బొంబాయి ప్రభుత్వం గెజిట్‌లో ముద్రించాలి. మద్రాసులో అలాగే జరుగుతుంది.

బొంబాయి విశ్వవిద్యాలయం ప్రైవేటు విద్యార్థుల్ని కూడా పరీక్షలకు అనుమతించడం శ్లాఘనీయం. అలాగే ఉన్నతవిద్యకు కూడా జరగాలి. విశ్వవిద్యాలయం బి.ఏ., ఎమ్.ఏ. పరీక్షలకి ప్రైవేటు విద్యార్థుల్ని అనుమతిస్తే వారు కష్టపడి చదువుతారు. దీని వల్ల విద్యావ్యాప్తి జరుగుతుంది.

నిమ్నకులాల విద్యార్థులు చదువులో ఎక్కువగా రాణించలేకపోయినా వారికి ఉపకారవేతనాలు యివ్వాలి. అంతేకాని దానికొక పోటీ పెట్టి యిస్తే అది విద్యావ్యాప్తికి దోహదం చేయదు. సాంకేతిక విద్య, ఆచరణాత్మక విద్య లేకపోవడం వల్ల చాలామంది విద్యావంతులు శారీరకశ్రమ చేయడానికి యిష్టపడడం లేదు. ప్రస్తుతం విద్యావంతుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఈ సంఖ్య వంద శాతం పెరగడానికి కాలం దగ్గర్లోనే ఉంది. అందువల్ల వృత్తివిద్యలు అభ్యసించడానికి ప్రయత్నించాలి కాని ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకూడదు. కమీషన్‌ని నేను కోరేది ఒక్కటే. స్త్రీ విద్య గురించి విస్తృతంగా చర్యలు చేపట్టండి.

జ్యోతీరావు హంటర్ కమీషన్ గురించి యిలా చెప్పాడు. “హంటర్ కమీషన్ రైతులతో ముఖాముఖిగా మాట్లాడలేదు. పార్శీలతోను, క్రైస్తవులతోను, బ్రాహ్మణుల తోను మాత్రమే చర్చలు జరిపారు. వారి మాటల్నే విశ్వసించారు. కాబట్టి హంటర్ యొక్క నివేదిక నిరక్షరాస్యులకు, పేదవారికి ఉపయోగకరం కాదు”

1882వ సంవత్సరం అక్టోబరు 30న పూణే మునిసిపాలిటీకి పశువైద్య కళాశాల కావాలని ఒక తీర్మానం వచ్చింది. మద్రాసు మునిసిపాలిటీ అటువంటి కాలేజీని నడుపుతూంది కాబట్టి ఎంత ఖర్చవుతుందో వారి నుండి తెలుసుకోమని జ్యోతీరావు సూచించాడు. దానికి పూణే మునిసిపాలిటీ అంగీకరించింది. తరువాత ప్రైమరీ స్కూళ్ళకిచ్చే స్కాలర్‌షిప్పుల సంఖ్య పెంచమని పూణే మునిసిపాలిటీకి యింకొక తీర్మానం అందింది. దానికి జ్యోతీరావు యిలా సలహా యిచ్చాడు. “ప్రైమరీ స్కూళ్ళ బాధ్యత మునిసిపాలిటీల నుండి ప్రభుత్వం తప్పించేవరకూ ఆగాలి”.

1882, డిశంబరు 4వ తేదీన మార్కెట్టుకి ఒక భవనాన్ని కట్టించమనే తీర్మానం మునిసిపాలిటీకి వచ్చింది. అయితే దానికి మూడు లక్షల అయిదు వేల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశారు. అంత డబ్బు భవనం గురించి ఖర్చు చేయవద్దనీ, ఆ డబ్బుని పేదపిల్లల విద్య కోసం వెచ్చించాలనీ జ్యోతీరావు, హరిరావులు చెప్పారు. ఇంకొక రెండు మూడు సూచనలు కూడా చేశారు. అయితే ఎక్కువమంది సభ్యులు రెండు లక్షల రూపాయల ఖర్చుతో రెండు వందల దుకాణాలు గల భవనాన్ని నిర్మించాలని తీర్మానించారు. “కేసరి” పత్రిక యీ తీర్మానాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అంత ఖర్చుతో కూడిన భవన నిర్మాణం అనవసరం అంది. అయినా ఆ వ్యతిరేకత వీగిపోయింది.

✦ ✦ ✦

# 7. రైతు మార్గదర్శి

మానవుని నిత్యావసరాలు కూడు, గుడ్డ. కాబట్టి వాటిని సమకూర్చడానికి రైతులకు ఆరోగ్యం, బలం ఉండాలి. ఆధునిక సాంఘిక వ్యవస్థ పారిశ్రామిక విప్లవం యొక్క పునాదుల మీద నిర్మించబడింది. కాని దానికి ఆధారం రైతులే. దీనిని దృష్టిలో ఉంచుకొని జ్యోతీరావు "షేత్ కార్యాచ ఆసూద్" అనే పుస్తకాన్ని రచించాడు. పుస్తకం రాస్తూన్నప్పుడే దానిని తన స్నేహితులకి చదివి వినిపిస్తూ ఉండేవాడు. 1883లో మొత్తం పుస్తకాన్ని బొంబాయిలో చదివి వినిపించాడు. ఆ సమయంలో జ్యోతీరావు బరోడా పాలకుడైన సాయాజీ రావుని కలిశాడు. సాయాజీ మిక్కిలి సమర్థుడు. తన ప్రజల యొక్క సంక్షేమం కోరేవాడు. జ్యోతీరావు అతనికి తన పుస్తకాన్ని చదివి వినిపించాడు. సాయాజీరావు అతనికి ధన సహాయం చేయడమే కాక, శాలువతోను, తలపాగాతోను సత్కరించాడు. 1883 జులై 28న ఒక కాపీని వైస్రాయి సర్ ఫ్రెడరిక్ హే మిల్టన్ టెంపుల్‌కి జ్యోతీరావు పంపాడు.

ఆ పుస్తకం యొక్క ఉపోద్ఘాతంలో జ్యోతీరావు యిలా రాశాడు.

**"జ్ఞానం లేకపోతే మనస్సు లేదు**
**మనస్సు లేకపోతే సుగుణాలు ఉండవు.**
**సుగుణాలు లేకపోతే అదృష్టమే ఉండదు.**
**అదృష్టమే లేకపోతే ఐశ్వర్యమే ఉండదు. (సంపద)**
**సంపద లేకపోతే శూద్రులకి అధోగతే**
**అందుకే జ్ఞానం లేకపోతే సర్వనాశనమే"**

జ్యోతీరావు యింకా యిలా రాశాడు.



ప్రస్తుతకాలంలో మూడు రకాల రైతులున్నారు. కున్బీలు (శూద్రులు), మాలీలు, ధంగార్లు. మొదటి నుండీ వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నవారు కున్బీలు. తోటల్ని పెంచేవారు మాలీలు. రెండూ చేస్తూ గొర్రెల్ని, మేకల్ని, పెంచేవారు ధంగార్లు. ఈ మూడు కులాల మధ్య కులాంతర వివాహాలు లేవు. మిగిలిన విషయాలలో కలుస్తారు. కాబట్టి యీ మూడు కులాల వారు శూద్రులే అయి ఉంటారు. రాను రాను వారు తమ కులవృత్తుల్ని విడిచి పెట్టి యితర వృత్తుల్ని చేపట్టారు. కాని వారిలో చాలామందిని నిరక్షరాస్యులు, అమాయకులు. వారిలో షిండేలు, హోల్కారులు జాగీర్లు, ఇనాములు సంపాదించారు. కాని యీ రోజు వారి వారసులు అమాయకులు, చదువు లేనివారు కావడం వల్ల వాళ్ళ జాగీర్లను ఇనాంలను తాకట్టు పెట్టి అప్పుల్లో మునిగి ఉన్నారు. కొంతమందిని పస్తులు కూడా పడి ఉన్నారు. వారికి తమ పూర్వీకులు వాటిని సంపాదించడానికి ఎంత కష్టపడ్డారో తెలియదు. పైగా వారు చెడు సహవాసాలు చేస్తున్నారు. బ్రాహ్మణులు మొదలైన అగ్రకులాల వారు స్వార్థపరులు. అందువల్ల ఆ వారసులకి చదువుకోడానికి అవకాశం యివ్వలేదు. వారు తమ పూర్వీకులు ఎలా సంపాదించారో తెలియకపోవడం వల్ల యిప్పుడు అగ్రకులాల వారి మీద ఆధారపడి ఉన్నారు. వారు శూద్రుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు. ఎప్పుడైతే బ్రాహ్మణులు దేవతలనే భావం వారి నుండి పోతుందో అప్పుడే వారికి జ్ఞానోదయం అవుతుంది.

జ్యోతీరావు రాసిన పుస్తకంలో మొదటి అధ్యాయంలో శూద్రుల్ని జననం నుండి మరణం వరకు బ్రాహ్మణులు మతం పేరిట ఏ విధంగా దోచుకున్నారో తెలియజేయబడినది.

మతపరమైన కర్మల్ని నిరంతరం శూద్రుల చేత చేయించేవారు. చదువు సంధ్యలు లేని బ్రాహ్మణులు సన్యాసులై అమాయకుల్ని దోచుకున్నారు.

బ్రిటిషువారిని గురించి జ్యోతీరావు యిలా చెప్పాడు. "రైతులకు తమ పిల్లల్ని చదివించడానికి తగిన ఆర్థిక స్తోమత లేదు. ఇంగ్లీషువారు తమ కార్యక్రమాలలో మునిగి ఉండడం వల్ల వారికి రైతుల గోడు పట్టలేదు. పైగా రైతులకు తమ కుటుంబాల్ని పోషించ డమే భారంగా ఉంది. బ్రిటిషు ప్రభుత్వోద్యోగులు ఎక్కువవేతనాలు తీసుకుంటూ ఆనందంగా జీవితాన్ని గడుపుకుంటున్నారు. రైతులు అణగద్రొక్కబడుతున్నారు.

జ్యోతీరావు యొక్క అభిప్రాయం ప్రకారం రైతుల పేదరికానికి చాలా కారణాలు న్నాయి. బ్రిటిషువారు రాకపూర్వం రాజుల పాలన ఉండేది. రాజులు తమ సైన్యంలో చాలామందిని చేర్చుకొనేవారు. అంటే చాలామందికి ఉద్యోగాలుండేవి. పీష్వాల తరువాత సైనికులకి ఉద్యోగాలు లేవు. వారు యిళ్ళకి తిరిగి వచ్చి వ్యవసాయం చేయడం మొదలు పెట్టారు. పొలాలకు ఒత్తిడి పెరిగింది. పైగా జనాభాకూడా పెరిగింది. ఆ విధంగా భూమి (పొలాలు) విభజింపబడ్డాయి. వారికి దక్కిన పొలంద్వారా వారి కుటుంబాల్ని పోషించు కోగలిగినంత ఆదాయం వారికి రాలేదు. అటవీశాఖ కూడా పొలాల్ని ఆక్ర మించుకుంది. పొలాలలో సారం తగ్గింది. వారు తమ పొలాల్ని పెద్ద రైతులకి అమ్ము కున్నారు. భూములు లేని రైతులు ఉద్యోగాన్వేషణకు బయల్దేరారు. వారు నేతపనివారుగానో, వడ్రంగులగానో మారారు. వారు చిరు వ్యాపారులు. వారు బ్రిటన్ నుండి హిందూదేశానికి దిగుమతి అయ్యే వస్తువులైన కత్తులు, కత్తెరలు, కుట్టుయంత్రాలు, దారం, తాళం కప్పలు, తాళాలు, ఇనుపరేకులు, తారు, బట్టలు మొదలైన వాటికి తట్టుకోలేక పోటీలో నిలవ లేకపోయారు. ఫలితంగా స్థానికంగా ఉన్న చిరు వ్యాపారులకి నష్టం కలిగింది. అందువల్ల వారు తయారు చేసిన వాటిని తక్కువ ధరలకు అమ్మివేశారు. కుటుంబాన్ని పోషించలేక పోతున్నారు.

రైతుల సమస్యలే కాక యితర సమస్యలు కూడా ఉన్నాయి. కులాల మీద కూడా నియంత్రణలున్నాయి. సముద్రం దాటి వెళ్ళకూడదనే నియంత్రణ ఉంది. దానివల్ల హిందు వులకి బయటి ప్రపంచంతో సంబంధాలు పోయాయి. బ్రాహ్మణులకు బాగానే ఉంది. శూద్రుల్ని వారు బానిసలుగా చేసుకున్నారు.

సాంప్రదాయిక సాంఘిక వ్యవస్థ మీద తిరుగుబాటు చేసిన మొదటి వ్యక్తిగా జ్యోతీరావుని చెప్పుకోవచ్చును. ఎక్కడ నుండి జ్యోతీరావుకి యిటువంటి స్ఫూర్తి కలిగింది? అతడు సత్యాన్వేషకుడు. ఆధునిక పాశ్చాత్య నాగరికత అనుసరిస్తూన్న స్వేచ్ఛ మీద అతనికి నమ్మకం ఉంది.

✦ ✦ ✦

# 8. నిజమైన మతం అంటే ఏమిటి?

పుస్తకం రాయడానికి జ్యోతీరావు శారీరకంగా కూడా కష్టపడవలసి వచ్చింది. అతని కుడి చేతికి పక్షవాతం వచ్చింది. ఎలాగైనా పుస్తకం రాసి తీరాలన్న దృఢ నిశ్చయంతో, తన సందేశం ప్రజలకి చేరాలనే పట్టుదలతో అతడు తన ఎడమ చేతితోనే రాశాడు. "సార్వజనిక సత్యధర్మం" అనే పుస్తకంలో ప్రజాస్వామ్యం ప్రతిబింబిస్తుంది. ఆ స్ఫూర్తి అతనికి పాశ్చాత్య నాగరికత నుండి వచ్చింది.

జ్యోతీరావు యొక్క పుస్తకంలో ముప్ఫయి మూడు వ్యాసాలున్నాయి. వాటిలో మానవహక్కుల్ని పరిరక్షిస్తూ, సాంఘిక వ్యవస్థని వసుధైక కుటుంబవ్యవస్థగా ఎలా మార్చాలో వివరంగా పొందుపరచబడ్డాయి.

జ్యోతీరావు మాటల్లో.....

"స్త్రీ పురుషులందరూ కలిసి మెలసి యీ ప్రపంచంలో ఉండాలి. వారు నిజాయితీతో, విచక్షణలు లేకుండా ఉండాలి. వారు ఏ ప్రాంతం వారైనా కావచ్చు. ఏ కులం వారైనా కావచ్చు, ఏ మతం వారైనా కావచ్చు.

సృష్టికర్త మానవుల్ని స్వేచ్ఛగా జీవించడానికే సృష్టించాడు. వారి హక్కుల్ని వారు అనుభవించడానికే సృష్టించాడు. ప్రతివారు తమ భావాల్ని స్వేచ్ఛగా వ్యక్తీకరించవచ్చు. కాని వారి భావాల వల్ల యితరులకి బాధ కలుగకూడదు. దీనినే ధర్మప్రవర్తన అంటారు. ఎవరి హక్కులు వారికున్నప్పుడు ఒకరిపై ఒకరికి ఆధిపత్యం అనేది ఉండకూడదు. అలాగే సృష్టికర్త అందరికీ మతస్వేచ్ఛ, రాజకీయ స్వేచ్ఛ యిచ్చాడు. ఎవరైతే యితరులకి హాని చేయరో, యితరుల హక్కుని హరించరో వారే ధర్మవర్తనులు. మంచి గుణాలు భగవంతుని సంతృప్తిపరుస్తాయి. నిజాయితీగా నడుచుకోడమే నైతికత.

సృష్టికర్తా, సౌర వ్యవస్థా ఒకటే అయితే, దేశాలన్నీ పరస్పరం విద్వేషాల్ని ఎందుకు కలిగి ఉండాలి? తామే దేశభక్తులమని ఎందుకు భేషజాలు పలకాలి? నదులన్నీ



ప్రపంచంలోని అన్ని దేశాల గుండా ప్రవహించి చివరకి సముద్రంలో కలుస్తాయి. అలాంటపుడు ఒక దేశంలోని నది ఒక్కటే పవిత్రమైనదని ఎలా అనగలం? మానవులంతా భగవంతుని దృష్టిలో సమానులే అయినప్పుడు పుట్టుక వల్ల గొప్పతనం ఎందుకు ఆపాదించబడుతూంది? జనన మరణాలలో అందరూ సమానులే కదా? సుగుణాలు, దుర్గుణాలు కూడా కలిగి ఉన్నారు కదా? కాబట్టి మానవులలో విచక్షణ ఉండకూడదు. ప్రతి వారికి ధర్మగుణం ఉండాలి. అప్పుడే భగవంతుడు సంతోషిస్తాడు".

ఇటువంటి ఆలోచనలు కలిగిన వ్యక్తి ప్రజాస్వామ్యం మీద నమ్మకం కలిగినవాడై ఉంటాడు. "భూమి మీద భగవంతుని రాజ్యం" అనే భావన జ్యోతీరావుకి క్రైస్తవమతం వల్ల కలిగింది. అయితే దానికి మానవవిలువలు అనే పదాన్ని అతడు జోడించాడు. అతడు జాతీయవాది కాడు. అతని అభిప్రాయం ప్రకారం "జాతి" అంటే స్వేచ్ఛ, సమానత్వం కలిగిన ప్రదేశం. ఏ వ్యవస్థలైతే మతం, కులం మీద ఆధారపడి ఉంటుందో అది జాతి అనిపించుకోదు. మత వ్యవస్థ ప్రపంచ వ్యవస్థకి అనుబంధంగా ఉండాలి. మత వ్యవస్థలు విభజనకి దారితీస్తాయి. జ్యోతీరావు పదే పదే మతాన్ని గుడ్డిగా నమ్మవద్దని చెబుతూ ఉంటాడు.

"నిమిక్" అంటే భగవంతుడు. ఈ పదాన్ని జ్యోతీరావు సృష్టికర్తకి ఆపాదించాడు. ఇదివరకు భగవంతునికి పెట్టిన పేర్లు వాడుకలో లేవు. అవన్నీ సంఘ వ్యవస్థని విడదీసేవే.

మానవసేవ, సమానత్వం, స్వేచ్ఛ అనేవి భగవంతునికి నిజమైన ఆరాధన అంటాడు జ్యోతీరావు.

✦ ✦ ✦

# 9. చివరి ఏడు సంవత్సరాలు

బ్రాహ్మణేతర కులాల వారందరూ జ్యోతీరావు వద్దకు చేరారు. సత్యశోధన సమాజం వారి కార్యక్రమాలు ఏవనగా "బ్రాహ్మణుల ప్రమేయం లేకుండా పూజలు చేయించడం, వివాహాలు, గృహప్రవేశాలు చేయించడం మొదలైనవి. బాలాజీ కుశాజీ పాటిల్ అనే వ్యక్తి బ్రాహ్మణుల జోక్యం లేకుండా తన కుమారుని వివాహం జరిపించాడు. బ్రాహ్మణులు లేకుండా వివాహం జరిగింది కాబట్టి ఆ వివాహం చెల్లదని బ్రాహ్మణులు అన్నారు. పూణే, యితర ప్రాంతాల బ్రాహ్మణులు అందరూ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమావేశంలో బాలాజీ చేయించిన వివాహం బ్రాహ్మణుల హక్కుల్ని హరించిందని వారు బాలాజీ మీద దావా వేశారు. న్యాయమూర్తి మహాదేవ్ గోవింద రెనడే బ్రాహ్మణులకు అనుకూలంగా తీర్పు చెప్పాడు. బ్రాహ్మణుడు లేకుండా వివాహం చేయడం నేరమనీ, బ్రాహ్మణుని వివాహానికి పిలవకపోయినా అతనికి దక్షిణ యివ్వాలనీ, తీర్పు చెప్పాడు. ఆ తీర్పుని జ్యోతీరావు వ్యతిరేకించాడు. పై కోర్టుకి వెళ్ళాడు బాలాజీ. పై కోర్టు బాలాజీకి అనుకూలంగా తీర్పు యిచ్చింది.

రైతులు ఋణాలు తీర్చలేకపోతే ఋణదాతలు వారిని ఒక యేడాది వరకు వ్యవసాయం చేయనీయడం లేదు. ఆ సంఘటన గురించి జ్యోతీరావు ఒక రైతు ఉద్యమాన్ని లేవదీశాడు. అటువంటి పనుల్ని నివారించడానికి ప్రభుత్వం చట్టం చేయక తప్పలేదు. అది "డెక్కన్ ఎగ్రికల్చరిస్ట్ రిలీఫ్ ఏక్ట్". దీని వల్ల రైతుకి తక్కువ వడ్డీకి ఋణాలివ్వడం. వారు భూమిని కోల్పోకుండా ఉండడం జరిగింది. ఆ ఉద్యమం నలుమూలలా వ్యాపిస్తుందని జ్యోతీరావు విశ్వాసం. తరువాత 1884లో సాయాజీరావుగైక్వాడ్ బరోడా రాజయ్యాడు. అతడు కూడా ప్రజల సంక్షేమం గురించి ఆలోచించేవాడే. జ్యోతీరావు రాజుని కలిశాడు. అంతకు ముందు నుండీ జ్యోతీరావు తన పుస్తకాన్ని రాజుకీ, ప్రజలకీ చదివి వినిపించాడు.

అనేక ప్రసంగాలు కూడా చేశాడు. సాయాజీరావు వెంటనే బ్రాహ్మణులకు కిచిడీ యిచ్చే అలవాటుకి స్వస్తి చెప్పాడు.

1885లో ఏప్రిల్ నెలలో సత్యశోధక సమాజం వారు పూణేలో ఒక ఊరేగింపుని జరిపారు. ఆ నాయకులు, ప్రజలు పచ్చని, ఆకుపచ్చని జెండాలు ఊపుతూ ఆ ఊరేగింపులో పాల్గొన్నారు. వారంతా ఆటపాటలతో ఊరేగుతున్నారు. ఆ ఊరేగింపులో జ్యోతీరావు, రామయ్య వ్యాంకయ్య అయ్యవారు, మహాదేవ్ గోవిందరెనడే, కృష్ణారావు భలేకర్, సడో బాగవాడే, ఘోర్పడే, దేవరామ్ తోసర్, నవాల్కర్ మొదలైనవారున్నారు. ఆ ఊరేగింపు విట్రోబా ఆలయం నుండి సాయంకాలం నాలుగు గంటలకి బయలుదేరి సడోబా యింటికి తొమ్మిది గంటలకి చేరింది. జ్యోతీరావు, రెనడే అయ్యవారు తదితరులు ప్రసంగించారు.

రెండవ మరాఠీ సాహిత్య సమావేశం 1885 మే 24వ తేదీన జరిగింది. కృష్ణశాస్త్రి రజ్వాడే అధ్యక్షతన పూణేలో సార్వజనిక హాలులో జరిగిన యీ సమావేశానికి మూడువందల మంది సాహితీకారులు వచ్చారు. హాజరు కాలేని వారి వద్ద నుండి నలభై మూడు లేఖలు వచ్చాయి. వాటిలో జ్యోతీరావు లేఖని మొదటగా చదివారు. ఆయన లేఖలో తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. అంతకుముందు పేదల సమస్యల్ని గురించి చర్చించారు.

1885లో మాన్సూన్ (ఋతుపవనాలు) సమయంలో సాయాజీరావు పూణేలోనే రెండు నెలలున్నాడు. రాజు అక్కడ ఉన్న సందర్భంగా జ్యోతీరావు ఒక సమావేశాన్ని ఆయన్ని అభినందించడానికి ఏర్పాటు చేశాడు. ఆ సమావేశంలో రెనడే, భండార్కర్, జ్యోతీరావులు ప్రసంగించారు. జ్ఞానప్రకాష్ పత్రిక రెనడీ ప్రసంగాన్ని అభినందించింది కాని జ్యోతీరావు ప్రసంగాన్ని విమర్శించింది. ఆ విమర్శకి బదులుగా అతడు ఒక హెచ్చరిక చేశాడు. దానిలో రెనడే ప్రసంగంలోని విషయాల్ని విమర్శించాడు. ఆ విమర్శలో రెండవ బాజీరావు పాలనా కాలంలో బాజీరావు సింహాసనాన్ని భగవంతుడు ఒక శూద్రునికిచ్చాడనీ, బ్రిటిషువారి ద్వారా చక్కని పరిపాలన అందించాడనీ చెప్పి, బ్రిటిష్ పాలన చాలా కాలం ఉండాలని తాను భగవంతుని ప్రార్థిస్తున్నట్లు చెప్పాడు.

అదే సంవత్సరం జ్యోతీరావు సత్సార్ (మంచి యొక్క సారం) అనే చిన్న పుస్తకాన్ని ప్రచురించాడు. దానిలో బ్రాహ్మణుల సంఖ్య తక్కువనీ, బ్రాహ్మణేతరులు అంతకు పది రెట్లున్నారనీ, మరి బ్రాహ్మణులకి ఆధిపత్యం ఎలా వచ్చిందని ప్రశ్నించాడు. మరి స్వల్ప సంఖ్య గల మహమ్మదీయులు, బ్రిటిషువారు లక్షలాది భారతీయుల్ని ఎలా పరిపాలించ గలిగారు? పుస్తకం చివర్లో ఒక బ్రాహ్మణునికి, జ్యోతీరావుకి మధ్య సంభాషణ రూపంలో

ఉంది. ఆ సంభాషణ చాలా ఘాటుగా ఉంది. అచ్చుమయిన రెండు వేల కాపీలు వెంటనే అమ్ముడయ్యాయి.

1885 అక్టోబరులో సత్సార్ రెండవ పుస్తకం విడుదల అయింది. దానిలో స్త్రీలు పురుషుల చేత ఏ విధంగా వంచింపబడ్డారో, బ్రిటిషు పాలనలో వారు ఎటువంటి హీన పరిస్థితులు ఎదురుకుంటారో వివరించాడు. అలాగే హిందూ శాస్త్రాలలో స్త్రీల గురించి రాసిన దారుణమైన రాతల్ని వివరించాడు. ఆ విధంగా అతడు స్త్రీల పక్షాన నిలబడ్డాడు. తరువాత జ్యోతీరావు "అస్పృశ్యాంచి కైఫీయత్" అనే పుస్తకం రాశాడు. దానిలో ఒక అస్పృశ్యుడు విక్టోరియా రాణిని తమ ప్రాంతాన్ని సందర్శించమని కోరినట్లు రాశాడు. వారిలో ఏమైనా అభివృద్ధి ఉందేమో స్వయంగా వచ్చి పరిశీలించమని కోరాడు. రాణి అంగీకరిస్తుంది. పీష్వాలు తమను అతి క్రూరంగా హింసించేవారనీ, బ్రిటిషువారు వచ్చిన తరువాత పరిస్థితి మెరుగైనా స్వేచ్ఛలేని పరిస్థితి ఉందనీ, తమ పిల్లల్ని పేదరికం వల్ల చదివించలేకపోతున్నామనీ విన్నవించుకున్నాడు. రాణి వారికి అభయం యిచ్చింది.

అస్పృశ్యుల్ని కొందరికి శిక్షణ యిచ్చి వారి సమస్యలని ఎలా పరిష్కరించుకోవాలో తెలియజేశాడు. వారికి ప్రసంగాలు ఎలా చేయాలో నేర్పారు. సమాజసేవ వారితో చేయించాడు. అస్పృశ్యులలో బాగా రాణించిన వ్యక్తి గోపాల్‌బాల్ వాలంగ్‌కర్. అతడు రచయిత, మంచి వక్త కూడా. అతడు "దీనబంధు"లోను, "సుధారక్"లోను అనేక వ్యాసాలు రాశాడు.

జ్యోతీరావు చాలా పుస్తకాలు రాశాడు. మరాఠీలో అభంగాలు రాశాడు. తన అభంగాలకి "అఖండ" అనే పేరు పెట్టుకున్నాడు. అతడు "మంగళాష్టకాలు" కూడా రాశాడు. వివాహ సమయాలల్లో వాటిని పాటలుగా పాడుకునేవారు. మంగళాష్టకాలలో విశేషం ఏమంటే, వరుడు, వధువు వంతులవారీగా పాడుతారు. అతిథులు వారిని ఒక ప్రత్యేక పద్యంతో ఆశీర్వదిస్తారు.

జ్యోతీరావు మునిసిపాలిటీ వారి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు. ఒకసారి మునిసిపాలిటీ వారు అతనిని వ్యర్థాలు పడవేయడానికి ఒక ప్రదేశాన్ని ఎంచమన్నారు. అతడు అంగీకరించాడు. రైతులకు ఆదర్శంగా నిలువడానికి జ్యోతీరావు రెండు వందల ఎకరాల భూమిని కొన్నారు. దానిలో ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం ఎలా చేయాలో రైతులకు నేర్పాలనుకున్నాడు. వారు వెంటనే అంగీకరించలేదు. కాలువ నీటిని వారు సేద్యానికి ఉపయోగించదలచుకోలేదు. జ్యోతీరావు వారికి కాలువల ద్వారా ఎలా ఉప యోగించాలో నేర్పారు.

కార్మికుల్ని సత్యశోధక సమాజం ద్వారా స్వీయ అభివృద్ధి ఎలా చేసుకోవాలో నేర్పాడు. దీనబంధు పత్రిక పేదల సమస్యల గురించి ప్రచురిస్తూ ఉంది.

1885వ సంవత్సరం సెప్టెంబరు నెలలో జ్యోతీరావు బొంబాయిలోని కార్మికుల కాలనీలలో చాలా ఉపన్యాసాలిచ్చాడు. థానేలో జరిగిన సత్యశోధక సమాజం యొక్క వార్షికోత్సవానికి హాజరయ్యాడు. ఆ ఉత్సవంలో కార్మికుల ఉద్యమాన్ని స్థాపించిన నారాయణరావు లోఖండేని కార్మికులు "సత్యశోధక నిబంధమాల" అనే వరుస వ్యాసాల్ని ప్రచురించమని కోరారు.

భారతజాతీయ కాంగ్రెస్ 1885లో స్థాపించబడింది. కాని జ్యోతీరావుకి ఆ కాంగ్రెస్ పేదవారి సమస్యల్ని తీర్చగలుగుతుందనే నమ్మకం లేదు. జ్యోతీరావు యొక్క వ్యాసాలు, ప్రసంగాలు బొంబాయిలో ఉన్న సంఘసేవకుడు మామా పరమానందని ఆకర్షించాయి. అతనికి రెనడే, భండార్కర్ మొదలైన వారితో సంబంధాలున్నాయి.

1885లో మార్కెట్టు భవన నిర్మాణం పూర్తి అయింది. దానికి గవర్నర్ 'రే' పేరు పెట్టారు. అద్దె ఎక్కువగా ఉండడం వల్ల వ్యాపారులు దానిలో దుకాణాలు తెరవలేదు. మొదట్లో భనవ నిర్మాణానికి జ్యోతీరావు వ్యతిరేకి. కాని యీ రోజు ఆ మార్కెట్టుకి పూలే మార్కెట్ అనిపేరు పెట్టారు.



సత్యశోధక సమాజం తన కార్యక్రమాల్ని కొనసాగిస్తూనే ఉంది. గుణాజీ బాపూ పాటిల్ అనే వ్యక్తి తన యింట్లో వివాహాన్ని బ్రాహ్మణులు లేకుండా జరిపించాడు. అలాగే

ఒక మంగలి యింట్లో కూడా అటువంటి వివాహం జరిగింది. మంగలికి, బ్రాహ్మణులకి మధ్య వివాదం చెలరేగింది.

1888లో దళితులకి సేవ చేసినందుకు జ్యోతీరావుకి మండేలో పెద్ద ఉత్సవం జరిపి "మహాత్మా" అనే బిరుదు యిచ్చి సత్కరించారు. 1888 జులైలో జ్యోతీరావుకి పక్షవాతం వచ్చి నాలుగు మాసాలు పక్క మీదనే ఉన్నాడు. అతడు యశ్వంత్ అనే అతనిని దత్తత తీసుకున్నాడు. అతనికి జ్ఞానోబాససానే అనే వ్యక్తి కుమార్తె రాధతో వివాహం జరిపించాడు. ఈ వివాహసమయంలో మంగళాష్టకాలు పాడారు.

1890 జనవరిలో జ్యోతీరావు పక్షవాతంతో బాధపడుతూనే ఉన్నాడు. బాలాజీ కూశాజీ పాటిల్ తన యింట్లో బ్రాహ్మణుల ప్రమేయం లేకుండా వివాహం జరిపాడు. ఆ వివాహంలో వధూవరులు పూలదండలు మాత్రమే మార్చుకున్నారు. అదే సమయంలో సుప్రీంకోర్టు ఛీఫ్ జస్టిస్ సర్ చార్లెస్ సార్జెంటు వివాహ సమయంలో బ్రాహ్మణులకు దక్షిణ యివ్వవలసిన పని లేదన్నాడు. 1890లో ఫిబ్రవరి మాసంలో విధవల పక్షాన నిలిచాడు. మంగలి వారు కూడా అతనికి మద్ధతిచ్చారు.



1890, నవంబర్ 27 నాటికి జ్యోతీరావు పరిస్థితి విషమించింది. అతనికి మరణం ఆసన్నమైన సూచనలు కనిపించాయి. అతడు తన భార్యకి ధైర్యం చెప్పాడు. యశ్వంత్‌ని భగవంతుని ప్రార్థించమని చెప్పి తాను కూడా ప్రార్థించాడు. చివరి వరకు అతడు స్పృహలోనే ఉన్నాడు. అతడు 1890, నవంబరు 28వ తేదీని తుదిశ్వాస విడిచాడు.

అతని మరణవార్త నలుమూలలా వ్యాపించింది. చాలామంది అతనిని కడసారిగా చూడడానికి వచ్చారు. అన్ని కులాల వారు, మతాల వారు జాతుల వారు, స్త్రీలు, పురుషులు ఆబాలగోపాలం అతనిని దర్శించడానికి వచ్చారు. మామా పరమానంద సావిత్రీ బాయికీ, యశ్వంత్‌కీ ధన సహాయం చేయమని సాయాజీరావును కోరాడు. 1892లో సాయాజీ వేయి రూపాయిలు పరమానందకి యిచ్చాడు. ఆయన దానిలో నుండి ప్రతి మూడునెలలకి ఏభై రూపాయలు చొప్పున సావిత్రీబాయికి యిచ్చాడు. జ్యోతీరావుకి స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయడానికి పరమానంద ఒక నిధిని ఏర్పాదు చేశాడు. ఆరు సంవత్సరాల తరువాత సావిత్రీబాయి, యశ్వంత్‌లు కూడా 1897లో పూణేలో మరణించారు.

✦ ✦ ✦

# 10. "నిర్మిక్" భగవంతుడు

జ్యోతీరావు తాను చనిపోవకముందే "సార్వజనిక సత్యధర్మ"మనే పుస్తకాన్ని రాశాడు. కాని అది ఆయన చనిపోయిన తరువాత ప్రచురించబడింది. అతడు ఆ పుస్తకం యొక్క ఉపోద్ఘాతంలో యిలా రాశాడు.

"సృష్టికర్త (నిర్మిక్) యీ యావత్ప్రపంచాన్ని, జీవుల్ని, సౌర వ్యవస్థని, గ్రహాల్ని, ఉపగ్రహాల్ని సృష్టించాడు. అటువంటి భగవంతుని దయవల్ల నేను యీ పుస్తకం రాయ గలిగాను. దీనిని మానవుల సంక్షేమం కోసం రాశాను. మానవులు ఎలా ప్రవర్తిస్తే భగవంతునికి యిష్టులవుతారో దానిలో వివరించాను. భగవంతుని నేనొకటే ప్రార్థిస్తాను. ఈ పుస్తకం అందరి ఆమోదం పొందాలని భగవంతుని కోరుకుంటాను. అందరూ ఆ సృష్టికర్త యొక్క సత్యమార్గాన్ని పొందాలని, సంతోషంగా జీవించాలని ఆశిస్తున్నాను".

జ్యోతీరావు బ్రాహ్మణులు వల్లించే విషయాల్ని ముఖ్యంగా మతపరమైన వాటికి వ్యతిరేకంగా ఉన్నా, భగవంతుడున్నాడని, అతని సామ్రాజ్యం ఉందని నమ్మాడు. అయితే మూఢనమ్మకాల్ని, హేతుబద్ధత లేని ఆచారాల్ని తిరస్కరించాడు. సత్యశోధక సమాజంలోని వారంతా జ్యోతీరావుని అనుసరించారు.

ఆ పుస్తకానికి పరిచయవాక్యాలు రాస్తూ విశ్రమ్‌ఘోలే యిలా అంటాడు.

"బూటకపు మతం, విగ్రహారాధన, కులవ్యవస్థ మొదలైనవి భారతదేశానికి అరిష్టాన్ని తీసుకు వచ్చాయి. ఇటువంటి విషయాలు యీ పుస్తకంలో వివరంగా తెలుప బడ్డాయి. భగవంతుడు ఎలా ఉంటాడో తెలియనివారు ఆయన విగ్రహాల్ని ఎలా తయారు చేయగలరు?

ఆయనని ఎవరూ చూడలేదు కదా! కుల వ్యవస్థ వల్ల చాలా సమస్యలు యిబ్బందులు కలుగుతున్నాయని అందరూ గుర్తించారు. భారతీయులలో అనైక్యతకు, పరస్పర శత్రుత్వానికి యిదే కారణం. అందువల్లనే బానిసత్వ వ్యవస్థ కూడా ఏర్పడింది.

ఘోలే యింకా యిలా అన్నాడు.

“గత నలభై యేళ్ళుగా జ్యోతీరావు మతపరమైన విషయాల మీద మాట్లాడుతూనే ఉన్నాడు. చర్చల ద్వారా ప్రజలలో ఉన్న సందేహాలను తీరుస్తూనే ఉన్నాడు. వారి భ్రమల్ని తొలగిస్తూనే ఉన్నాడు. అంతేకాక వార్తాపత్రికల ద్వారా కూడా వివరిస్తూ ఉన్నాడు. పుస్తకాలు రాసి ప్రజలకే అంకితం చేశాడు. పద్యాల ద్వారా తన భావాల్ని విశదీకరించాడు. ప్రజాసేవకే అంకితమయ్యాడు. మతపరమైన కర్మలను విశ్లేషించి, సత్యాన్ని తెలుసుకోమన్నాడు. సాంప్రదాయాలలోని తప్పొప్పుల్ని ఎత్తి చూపించాడు. విగ్రహారాధనని ఖండించాడు. భగవంతుడొక్కడే అని చెప్పాడు. దైనందిన చర్యలలో మత ప్రమేయాన్ని ఖండించాడు. ఆయన చేసిన కృషి యొక్క ఫలితం యీనాడు చూస్తున్నాం. అందరూ భగవంతుడొక్కడే అని నమ్ముతున్నారు. మతంలోని లోపాల్ని ప్రజలు గ్రహించారు. పురాణాలు కల్పితాలని నమ్ముతున్నారు”.

జ్యోతీరావు యొక్క సిద్ధాంతాన్ని ఘోలే యిలా చెబుతున్నాడు.

“ఒక్క భగవంతుడినే పూజించండి. సత్ప్రవర్తనని అలవరచుకోండి. సౌభ్రాతృత్వాన్ని పెంచుకోండి. మానవులందరికీ (స్త్రీ పురుషులకు) సమాన హక్కులున్నాయి. కుల విచక్షణ ఉండకూడదు. మతం నుండి పుట్టుకొచ్చిన చెడు ఆచారాన్ని విడిచిపెట్టండి.”

ఈ పుస్తకం మూఢనమ్మకాల్ని పారదోలుతుందనే విశ్వాసాన్ని ప్రకటించాడు ఘోలే. ఏ మతం వారైనా, ఏ కులం వారైనా, ఏ జాతివారైనా యీ పుస్తకాన్ని చదవాలని ఆయన కోరాడు.

ఏ వ్యక్తీ సత్ప్రవర్తన లేకపోతే యీ ప్రపంచంలో సంతోషంగా ఈ జీవించలేడనేది జ్యోతీరావు నమ్మకం.

సత్యమనేది అందరికీ ముఖ్యం.

అదే అన్ని మతాలకీ ఆటపట్టు.

ప్రపంచంలో ఉన్న సంతోషం అంతా

సత్యం నుండి పుట్టినదే.

మిగిలినదంతా అంధకారమే

సత్యమే ప్రపంచాన్ని పాలిస్తుంది.

సత్యం ఉంటే ద్వేషానికి తావు లేదు.

సత్యవంతులు అసత్యం పలికే వారిపై

విజయం సాధించగలరు.

సత్యం యొక్క శక్తి తెలిస్తే

అబద్ధం చెప్పేవాడు నిలవలేడు.

సత్యాన్నీ, భగవంతుడినీ విడిచినవారు

నిజమైన ఆనందాన్ని అనుభవించలేరు.

కాబట్టి ప్రజలు అసత్యం వైపు మొగ్గు చూపరాదు" అంటాడు జ్యోతీరావు. ఇంకా తన పుస్తకంలో యిలా రాశాడు.

మానవులు రచించిన మత గ్రంథాలలో విశ్వజనీనత గల సత్యం గురించి ఎవరూ చెప్పలేదు. ఎందుకంటే కాలానుగుణంగా వాటిలో మార్పులు, చేర్పులు జరిగాయి. దానివల్ల ప్రజల మధ్య ఈర్ష్య, ద్వేషం ప్రబలాయి.

జ్యోతీరావు యొక్క పుస్తకం యొక్క సారాంశం ఏమంటే –

సృష్టికర్త నిర్మాత (నిర్మిక్) కాబట్టి ఆయన సృష్టి అంతా అందరికీ సుఖశాంతులు కలిగించాలి. వారి హక్కులు వారికి దక్కేటట్లు అనుగ్రహించాలి. కాని అలా జరుగలేదు. కాని మానవులు భరించలేని బాధలను అనుభవిస్తున్నారు. ప్రపంచంలోని దేశాలన్నీ పరస్పరం శత్రుత్వంతో ఉన్నాయి. ప్రపంచంలోని నదులన్నీ సముద్రంలోనే కలుస్తున్నాయి. అలాంటప్పుడు ఒక నది మాత్రమే పవిత్రమైనదని ఎలా చెప్పగలం? నదులు దేశాల గుండా ప్రవహిస్తున్నప్పుడు మలినాలను కూడా తమతో తీసుకొనిపోయి సముద్రంలో కలుస్తున్నాయి. అలాగే మానవులంతా సమాన ఆకృతులలో ఉన్నా పుట్టుకతో పవిత్రత వస్తుందా? శ్రేష్ఠులవుతారా? వారు జనన మరణాల నుండి తప్పించుకోగలరా? వారు కూడా అందరిలాంటివారే. సృష్టికర్త ఎలా ఉంటాడో అని మానవులు ప్రయత్నం చేయనక్కర లేదు. ఆయన ఉన్నాడు. విశ్వానికి అంతం లేదు. దానితో పోల్చితే మానవుడు చాలా అల్పుడు. కాబట్టి సృష్టికర్త ఎలా ఉంటాడో యీ అల్పునికి సాధ్యమా? ఆయన మనకి

అవగతం కాదు. విష్ణువు యొక్క నాభి కమలం నుండి పుట్టిన బ్రహ్మదేవుడు కూడా సృష్టి కర్తని కనుక్కోలేకపోయాడు. మానవుని ఆనందానికి సృష్టికర్త అందమైన పువ్వుల్ని సృష్టించాడు. అందువల్ల వాటితో మనం ఆయన్ని పూజించడంలో అర్థం లేదు. ఆ పువ్వుల్ని దండగా కట్టి ఎవరైతే కష్టించి కుటుంబాన్ని పోషించుకుంటూ, ప్రజా సంక్షేమం గురించి పాటుపడతారో వారి మెడలో వేస్తే ఆ పువ్వులకి సార్థకత చేకూరుతుంది.

విగ్రహాన్ని పూలతో పూజించి ప్రార్థించినంత మాత్రం చేత మానవునికి ఏ లాభం చేకూరదు. పీతాంబరాలు కట్టుకుని, ముక్కూ కళ్లూ మూసుకుని ఆయన నామాన్ని అనేక పర్యాయాలు జపం చేసినంత మాత్రాన సృష్టికర్తని చూడలేరు. ఎవరైతే కష్టించి పని చేసి జీవనోపాధిని పొందరో, ఎవరైతే ప్రజాసంక్షేమం గురించి ఆలోచింపకుండా, కాషాయాలు కట్టుకుని “భంగు” సేవిస్తూ మత్తులో ఉండి, ప్రజల్ని మోసగిస్తూ, కృత్రిమంగా భజనలు చేస్తూ ఉంటారో అటువంటివారిని వివేకవంతులు ఆదరించరు. భగవంతుడు మనల్ని సృష్టించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, సౌభ్రాతృత్వంతో, అందరి క్షేమం కోరేవారు ఎల్లప్పుడూ ఆనందంగా ఉండగలరు. భగవంతుని సామ్రాజ్యం వస్తుంది. వేదాలు, పురాణాలు, స్వర్గం గురించి చెబుతాయి. కాని అది ఊహ మాత్రమే.

నిర్మిక్ (సృష్టికర్త) కి పూజా పునస్కారాలు అక్కర్లేదు. అందరి యెడల దయ గలిగి, అవసరమైన వారికి సహాయం చేస్తే చాలు.

స్త్రీ పురుషులలో స్త్రీలే శ్రేష్టులు. ఎవరి రుణాన్నైనా తీర్చుకోవచ్చు కాని తల్లి రుణాన్ని తీర్చుకోలేము. స్త్రీ లేని యిల్లు యిల్లే కాదు. స్త్రీ స్వార్థం లేకుడా సేవ చేస్తుంది. స్త్రీ అబల కాబట్టి పురుషుడు ఆమెను బాధలకు లోను చేస్తున్నాడు. ఆమె హక్కులు ఏమిటో ఆమెకు తెలియకుండా ఉండడానికి ఆమెకు విద్య లేకుండా చేశాడు. బహు భార్యాత్వం చెడు సాంప్రదాయం. పురుషుని దురాశ వల్ల ఈర్ష్యాసూయలు తలెత్తుతాయి. చెడు ఆలోచనలున్న వ్యక్తులు పరస్త్రీలతో పోయి రోగాలు తెచ్చుకుంటున్నారు. తమ భార్యల్ని మోసగిస్తున్నారు. ఆర్యులు విధవా పునర్వివాహాన్ని నిషేధించారు. బాల్య వివాహాలు చేసుకుంటే ఆ బాలిక యొక్క భర్త వెంటనే మరణిస్తే మళ్ళీ ఆ బాలిక వివాహం చేసుకోకూడదు.వేదకాలంలో బ్రాహ్మణులు తమ సోదరుని భార్యని తమ భార్యగా స్వీకరించవచ్చు. స్వార్థం కోసం పురుషులకి ఒక నియమం. స్త్రీలకి యింకొక నియమం ఏర్పాటు చేశారు.

శారీరకంగా, మానసికంగా ఎవరికీ హాని చేయనివాడు ఆనందాన్ని అనుభవిస్తాడు. మంచి చేస్తే పుణ్యం, చెడు చేస్తే పాపం వస్తుంది. పేదల్ని మతం పేర మోసగించి,

బ్రాహ్మణులకి దానం చేస్తే పుణ్యం రాదు. విచక్షణ చూపిస్తే అది మత ధర్మం అని పించుకోదు. మొదట్లో కుల వ్యవస్థ లేదు. స్వార్థంలో బ్రాహ్మణులు చేసిన కల్పన. మంచి, చెడు అనేవి వంశపారంపర్యంగా వచ్చేవి కావు. బ్రాహ్మణుల పిల్లలు శంకరా చార్యులు వారంత మంచి గుణాలు కలిగినవారు కారు.

మానవులకు, పశు పక్ష్యాదులకు సహజంగా భేదం ఉంది. భగవంతుడు మానవునికి మంచి చెడులను గుర్తించే విచక్షణా జ్ఞానం యిచ్చాడు. కాని మానవుని కంటే పశుపక్ష్యాదులే శ్రేష్ఠమైనవి.

వ్యాపారం, మతం ఒకటి కావు. క్షవరం చేయడం మంగలి వృత్తి. కాని అతని మతం కాదు. బట్టలు ఉతకడం చాకలి వృత్తి. కాని అతని మతం కాదు. లంచాలు తీసుకోవడం ప్రభుత్వ ఉద్యోగుల మతం కాదు. అమాయకుల్ని మోసం చేసి, స్వార్థంతో పొట్ట పోషించు ఆర్య బ్రాహ్మణుల మతం కాదు. ఇది బహిరంగ మోసం. నిమ్న కులాల వారు మాంసాహారాన్ని తీసుకోవడం వారి మతం కాదు. అది వారి నిస్సహాయత. ఇవన్నీ వారు చేసే వృత్తులు. వారి మతాలు కావు. ప్రజల నుండి పన్నులు వసూలు చేయడం ప్రభువు యొక్క విధి. అది మతం కాదు. బైరాగులు, గోసాయిలు సంఘం మీద బతికే పరాన్న జీవులు.

నిర్మిక్ (సృష్టికర్త) మానవుల సుఖం కోసం ఆహారం, పువ్వులు, పండ్లు మొదలైనవి సృష్టించాడు. మానవులు అన్నదమ్ముల్లాగా, అక్కచెల్లెళ్ళులాగా ఉండడం లేదు. దానివల్ల సత్యం అనేది లేకుండా పోయింది. ప్రపంచంలో దుఃఖం మిగిలింది. పురుషులు స్త్రీలను (తల్లిని, భార్యని, అక్క చెల్లెళ్ళని) బానిసలుగా చూస్తున్నాడు. స్త్రీల హక్కులని పురుషులు అడ్డుగా నిలవకుండా ఉంటే సృష్టికర్త భూమికి దిగి వచ్చి ఉండేవాడు. అప్పుడు అందరూ సుఖసంతోషాలతో ఉండేవారు. ఇతరులు మనని ఏ విధంగా చూడాలని మనం అనుకుంటామో, మనం కూడా యితరుల్ని అలా చూడాలి. ఆర్యుల మతం ఒక్క బ్రాహ్మణు లకు తప్ప యితరులకు సమానత్వం యివ్వలేదు.

రామాయణ, భాగవతాలలో కూడా చెప్పబడిన అన్ని నీతులూ, నియమాలూ సత్యమైనవి, నమ్మదగినవి కావు. ఉదాహరణకి– రావణుడు రాక్షసజాతి వాడయితే జనకుడు అతనిని సీతాస్వయంవరానికి ఆహ్వానించేవాడు కాదు. ఇస్లాం మతంలో ఒకరినొకరు అన్నదమ్ముల్లా, అక్కచెల్లెండ్రుగా భావించాలని అల్లా చెప్పాడు. అందరూ బైబిలు, ఖురాను చదవవచ్చు. మానవులంతా సమానులే అని వాటిలో ఉంది.

## ✦ మహాత్మా - జ్యోతిరావు ఫూలే ✦

నైతికంగా ఉండడం అంటే సత్ప్రవర్తన కలిగి ఉండడం. అలా ఉంటే సృష్టికర్త సంతోషిస్తాడు. మంచి ప్రవర్తన కలిగి ఉండడం ఎవరైనా ఉండవచ్చు. వారు క్రైస్తవులు కావచ్చు, మహమ్మదీయులు కావచ్చు, హిందువులు కావచ్చు.

దేవుళ్ళు, బ్రహ్మరాత, ధాన్య పద్ధతులు, అదృష్టం అన్నీ మన ఊహల నుండి పుట్టినవే. నిజం కావు. ఎవరు చేసిన కర్మకు ఫలితాలు వారే అనుభవిస్తారని రామదాసు చెప్పినది నిజం కాదు. ఒక బాలుడు పరీక్షలో తప్పితే అది అతడి దురదృష్టం అంటారు. కృతార్థుడైతే అదృష్టవంతుడంటారు. వ్యాపారంలో నష్టపోతే అతని అజ్ఞానం వల్ల, పరీక్షలో తప్పితే అతడు సిద్ధంగా లేకపోవడం వల్ల.

అన్ని మతాల వారూ వారి మత గ్రంథాల్ని చదవవచ్చు. కాని హిందూ మతంలో వేదాలు అందరూ చదవకూడదు. బైబిలు, ఖురాన్ చదివిన వారికి భయం ఉండదు. కాని వేదాలు చదివిన వారికి భయం ఉంటుంది. ఎందుకంటే వారు చేసిన మోసాలు బయటపడతాయని. బ్రాహ్మణుల మతగ్రంథాలన్నీ తరచి చూస్తే అవి రాజకీయ మూలాలు కలిగి ఉన్నాయి. వేదాలు భగవంతుని నుండి పుట్టాయనడం సమంజసం కాదు.

✦ ✦ ✦

# 11. సత్ప్రవర్తనయే మతం

“సార్వజనిక సత్యధర్మం”లో జ్యోతీరావు మతంగురించి విస్తృతంగా విశ్లేషించాడు. ఎవరిని సత్ప్రవర్తనులు అంటారు? దీనిని గురించి జ్యోతీరావు యిలా చెప్పాడు.

స్త్రీ పురుషులు స్వతంత్రంగా జన్మించి, వారి హక్కుల్ని అనుభవిస్తారని ఎవరు అంగీకరిస్తారో, వారే సత్ప్రవర్తనులు. ఎవరైతే రాళ్ళకి, రప్పలకి, నక్షత్రాలకి పూజలు చేయరో వారు సత్ప్రవర్తనులు. ఎవరైతే ప్రజల చేత స్వార్థబుద్ధితో, తూతూ మంత్రంగా పూజలు చేయిస్తారో వారు సత్ప్రవర్తనులు కారు. ఎవరైతే యితరులకు అపకారం తలపెట్టరో వారు సత్ప్రవర్తనులు. ఎవరైతే యితరుల హక్కులకి భంగం కలగకచేయరో వారు సత్ప్రవర్తనులు.

ప్రతి స్త్రీకి, పురుషునికి మత స్వేచ్ఛ, రాజకీయ స్వేచ్ఛ ఉన్నాయి. ఏ పురుషుడు తన భార్య తప్ప యితర స్త్రీలను అక్కచెల్లెంద్రలా చూస్తాడో, ఏ స్త్రీ తన భర్త తప్ప యితరుల్ని అన్నదమ్ములుగా చూస్తారో వారు సత్ప్రవర్తనులు. స్త్రీ పురుషులు తమ భావాల్ని వ్యక్తీకరించడానికీ, తమ హక్కుల్ని గురించి తమ భావాల్ని తెలియజేయడానికీ స్వేచ్ఛ ఉంది. తమ భావాలు యితరులకు బాధ కలిగించకుండా ఉంటే అటువంటివారు సత్ప్రవర్తనులు. ఇతరులకి కూడా భావవ్యక్తీకరణకి స్వేచ్ఛ ఉందని గ్రహించి, వారి భావాల్ని ఎవరు ఖండించరో వారు సత్ప్రవర్తనులు. స్త్రీ పురుషులు తమ గ్రామాలలోనే ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తే బాగుంటుందని అంగీకరిస్తారో వారు సత్ప్రవర్తనులు. ఎవరు వృద్ధుల్ని, విద్యావంతుల్ని గౌరవిస్తారో, వారి అవసరాల్ని తీరుస్తారో వారు సత్ప్రవర్తనులు. వృద్ధులైన తల్లిదండ్రులకు ఎవరు సేవ చేస్తారో వారు సత్ప్రవర్తనులు. ఎవరైతే మత్తు పదార్థాలకి బానిసలవుతారో, అలా అయి అసభ్యకరంగా ప్రవర్తిస్తారో వారు సత్ప్రవర్తనులు కారు.

పశుపక్ష్యాదులు మొదలైన మూగజీవుల్నిగాని, వేట నెపంతో జంతువుల్ని చంపడం గాని చేసేవారు సత్ప్రవర్తనులు కారు. ఎవరైతే నిజం పలుకకుండా ఎల్లప్పుడూ అబద్ధాన్నే చెబుతారో వారు సత్ప్రవర్తనులు కారు. ఎవరైతే తన స్వార్థం కోసం ప్రభుత్వానికి గాని, తన పై అధికారికి గాని ఎదురు తిరుగుతాడో వారు సత్ప్రవర్తనులు కారు. అలా చేసినవారు చాలా కుటుంబాల్ని నాశనం చేసినవారవుతారు.

ఎవరైతే మోసగాళ్ళని నమ్మరో, వారు సత్ప్రవర్తనులు. ఎవరైతే యితరుల్ని తక్కువ చేసి చూపిస్తారో వారు సత్ప్రవర్తనులు కారు. మత గ్రంథాలలో ఉందని చెప్పి కొంతమందిని బానిసలుగా చూసేవారు సత్ప్రవర్తనులు కారు. ఏ ఉపాధ్యాయులైతే కొంతమంది విద్యార్థుల్ని నిమ్న కులాలవారిగా పరిగణిస్తారో వారు సత్ప్రవర్తనులు కారు. న్యాయమూర్తులు పక్ష పాతంతో శిక్షను నిర్ణయిస్తే వారు సత్ప్రవర్తనులు కారు. కూలీలుగా పని చేసేవారినిగాని, చెప్పులు కుట్టేవారు మొదలైన వారిని నీచంగా చూసినవారు సత్ప్రవర్తనులు కారు. మోసంతో జోస్యం చెప్పి అమాయకుల వద్ద డబ్బు దోచుకునేవారు సత్ప్రవర్తనులు కారు. గ్రహస్థితి అనుకూలంగా లేదని అమాయకుల చేత పూజలు చేయించి దోచుకునేవారు సత్ప్రవర్తనులు కారు. విభూతి, కుంకుమ మొదలైన వాటిని ముఖానపెట్టి ఆయురారోగ్యాలు కలుగుతాయని చెప్పేవారు సత్ప్రవర్తనులు కారు.

రోగులకు, కుష్ఠువ్యాధిగ్రస్తులకి, వికలాంగులకి, అనాధలకి సేవ చేసేవారు సత్ప్రవర్తనులు. కాలానుగుణంగా ఋషులు రాసిన గ్రంథాలలో కొంత సత్యం ఉంటుంది. కాబట్టి ఏ మత గ్రంథన్నైనా ఎవరైనా చదవవచ్చును. అందరూ ఒకే సృష్టికర్త చేత సృష్టింపబడినవారని భావించినవారు సత్ప్రవర్తనులు.

కుమారుడు లేక కుమార్తె జన్మిస్తే సంతోషిస్తారు తల్లిదండ్రులు. వారికి నామకరణం చేస్తారు. మాట్లాడడం నేర్పుతారు. వారు కొంచెం పెద్దవారయితే తల్లిదండ్రుల్ని, పెద్దల్ని తాము చేయదలిచే పనుల్ని గురించి సలహాలు అడగాలి. వివాహ సమయాల్లో, దానధర్మాలు చేయాలి. అప్పుడు కులప్రసక్తి ఉండకూడదు.

నైతికత లేని వ్యక్తి మరణ సమయంలో బాధపడతాడు. ఎందుకంటే తన ప్రవర్తనకి అప్పుడు పశ్చాత్తాపం కలుగుతుంది. కాబట్టి ప్రతి వ్యక్తీ మంచి పనులు చేసి, నిర్మల హృదయం కలిగి ఉండాలి. మరణ సమయంలో యీ విధంగా భగవంతుని ప్రార్థించాలి.

"భగవంతుడా! నువ్వు నన్ను సృష్టించావు. సరిగా ఆలోచించే శక్తినిచ్చావు. ఈ ప్రపంచంలో నేను ధర్మయుక్తంగా నడిచాను. నన్ను అనుగ్రహించు. నా వారిని కూడా అనుగ్రహించు. నీ సత్యపథం విస్తరించుగాక!"

మృతదేహాన్ని స్నానం చేయించి, నూనె రాసి, కొత్త బట్టలు వేసి, పూలదండలు వేయాలి. దహనం చేసే వరకు బట్టలు తీయకూడదు. పదమూడవ రోజున అందరికీ భోజనాలు పెట్టాలి. అలాగే ప్రతీ యేట చేయాలి.

ఇదీ జ్యోతిరావు ప్రవచించిన మతం. సంఘాన్ని అభివృద్ధి చేసేదే మతం. అందుకే తన మతానికి "ప్రజలకు నిజమైన మతం" అని పేరు పెట్టాడు.

✦ ✦ ✦

## భరతవాక్యం

బ్రాహ్మణుల ఆధిపత్యంలో ఉన్న సాంఘిక వ్యవస్థ పైనా, సంస్కృతి పైనా జ్యోతీరావు బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు. దానికి కారణం ఆనాటి రాజకీయ, సాంఘిక, చారిత్రక పరిస్థితులు. జ్యోతీరావు యొక్క అభిప్రాయాలతో చాలామంది ఏకీభవించారు. పీష్వాల చివరి దశ, బ్రిటిషు వారి పాలనా కాలంలో మహారాష్ట్రలో బ్రాహ్మణుల ఆధిపత్యం పెరిగింది. సాంఘిక అసమానతలు చోటు చేసుకున్నాయి. ఇతర సంస్కర్తలకు తలనొప్పిగా పరిస్థితి మారింది.

జ్యోతీరావు మరణించాక సత్యశోధక సమాజం బ్రాహ్మణ, బ్రాహ్మణేతరుల మధ్య వివాదాన్ని రేకెత్తించింది. జ్యోతీరావు యొక్క నమ్మకాలు, హేతుబద్ధత నశించాయి. సౌభ్రాతృత్వం అసలే పోయింది. మనకి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బ్రాహ్మణేతరులకు అధికారం వచ్చింది. కాని మతపరమైన విభేదాలు ఎక్కువయ్యాయి. అయినా జ్యోతీరావు యొక్క ఆదర్శం తప్పక రాబోయే అనర్థాల్ని అధిగమించగలదు. సత్ప్రవర్తనే మతం అనే రోజులు వస్తాయి.

✦ ✦ ✦

# 12. జ్యోతిబా గురించి

భారతదేశంలో బానిసత్వాన్ని ఎదిరించిన మొదటి వ్యక్తి మహాత్మా జ్యోతీరావు ఫూలే.

బ్రిటిషువారి పరిపాలనతో భారత దేశంలో పాశ్చాత్య సంస్కృతి, పాశ్చాత్య దేశాల సంస్కరణలు ప్రవేశించాయి. బ్రిటిషువారు రాకముందే కొన్ని శతాబ్దాల నుండి పాశ్చాత్య దేశాలతో భారతదేశానికి వాణిజ్య సంబంధాలున్నాయి. కాని వారి సంస్కృతి మనకు అప్పుడు రాలేదు. అప్పుడే వాణిజ్య, రాజకీయ సంబంధాలు పోర్చుగీసు, డచ్, ఫ్రెంచి, బ్రిటిషు దేశాలతో ఉండేవి. పోర్చుగీసు వారు భారతదేశపు పశ్చిమ తీరంలో మూడు వందల సంవత్సరాలకి పైగా వాణిజ్యం చేశారు. అయినా భారతీయులు పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడలేదు. కాని బ్రిటిషు వారి పాలనా కాలంలో అలవాటు పడ్డారు.

భారతీయ మేధావుల్ని, పాశ్చాత్య సంస్కృతి, సంస్కరణలు ఆకర్షించాయి. ఈ రోజు వరకు ఆ అలవాటు నిలిచి వుంది. కొంతమంది దీనికి వ్యతిరేకులు కూడా ఉన్నారు. అంటే రెండు రకాల స్పందన ఉంది. ఆకర్షితులైన వారు ఆత్మశోధన చేసుకున్నారు. దాని వల్ల హేతువాదం, శాస్త్రీయ విశ్లేషణ, చారిత్రక పరిశోధన, సంస్కరణలు చేపట్టాలనే ఆకాంక్ష. సాంఘిక, సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం పాటు పడాలనే కోరిక మొదలైనవి వారి మనసులలోకి ప్రవేశించాయి. అలాగే సాంప్రదాయాల్ని విమర్శించడం కూడా మొదలైంది. అదే సంస్కరణలకి దారి తీసింది. చాలామంది సంస్కర్తలు భారతీయ సాంఘిక వ్యవస్థని సంస్కరించడానికి పూనుకున్నారు. వాస్తవానికి గత రెండు వేల సంవత్సరాలు చరిత్ర వారికి వ్యతిరేకంగా ఉంది. మూఢనమ్మకాలతో జడంగా, నిస్సహాయ స్థితిలో ఉన్న సంఘాన్ని సంస్కరించాలనుకున్నారు. ప్రజల సనాతన, ఉపయోగం లేని భావాల్ని

మార్చాలనుకున్నారు. సనాతనాచార పరాయణులైన వారు చాలా ఆటంకాల్ని కలుగజేశారు. అటువంటి పరిస్థితులలో కొత్త ప్రపంచం వచ్చింది. కొత్త వ్యవస్థకి దారి తీసింది. కొంతమంది విద్యావంతులలో పాశ్చాత్య సంస్కరణల పట్ల వ్యతిరేకత కలిగింది. ఆ వ్యతిరేకత బ్రిటిషు పాలకుల మీదకి కూడా తిరిగింది. కొత్తదనానికి మొదట్లో విముఖత ఉంటుంది. తమ పారంపర్యంగా భగవంతుని ద్వారా వచ్చిన సంస్కృతి ఎక్కడ నాశనం అయిపోతుందో అనే భయం కూడా వ్యతిరేకతకి కారణం.

పాశ్చాత్యులు భారతీయ సాంఘిక వ్యవస్థ యెడల మొదట్లో న్యూనతా భావం ఉంది. అంటే భారతీయ సాంప్రదాయాలు, జ్ఞానసంపద అంతా భ్రాంతులు, నిరాధారమైన అభిప్రాయాలు, మహిమలు, విలువలతో ఉన్న కలగలుపు వ్యవస్థ అని వారి అభిప్రాయం. అటువంటి సంస్థలో మార్పు రాకపోతే ప్రగతి పథంలోకి పోలేము పైగా కుల వ్యవస్థ శాశ్వతంగా ఉండిపోతుంది. మనకున్న గొప్పతనం అంతా భ్రాంతి అని మన సంస్కర్తల అభిప్రాయం. సంస్కరణలు చేపడతామన్న వారిని సనాతనులు ఘాటుగా విమర్శించారు. పాశ్చాత్య సంస్కృతి యొక్క మోజులో పడ్డారని దుయ్యబట్టారు. బ్రిటిషువారే యిటువంటి మార్పులకి కారణం అని వారిలో అసంతృప్తి కలిగింది. భారతదేశ ప్రాచీన సంస్కృతీ సాంప్రదాయాల గురించి, వాటి ఔన్నత్యం గురించి ప్రచారాలు మిక్కుటంగా రాసాగాయి. ఈ ప్రచారాలు రాను రాను బలం పుంజుకున్నాయి. ప్రజలలో సంస్కరణలకి వ్యతిరేకత కలిగింది. దీనివల్ల సనాతనులకి సంస్కర్తలకి తరచు పోట్లాటలు జరిగేవి.

ఈ పోరాటాలు రాజకీయాలు, సాహిత్యం, మతం మొదలైన రంగాలలోకి కూడా ప్రవేశించాయి. ఒక్కొక్కప్పుడు బహిరంగంగానే పోట్లాడుకొనేవారు. ఒక్కొక్కప్పుడు నివురు కప్పిన నిప్పులా సాగేవి. ఈ పోరాటాల ద్వారా జీవితాన్ని రెండు కోణాలలో చూడవలసి వచ్చింది. ఒకటి సడలని సనాతనుల పట్టుదల, రెండవది హేతువాద దృష్టి, ప్రగతిమార్గాన్ని చూపించేది. ఇటువంటి సంఘటనలు బెంగాలులోను, మహారాష్ట్రలోను ఎక్కువగా ఉన్నాయి.

సంస్కర్తలు మూడు రకాలుగా ఉన్నారు. ఒకరు మత సంస్కరణలు చేపట్టారు. అది బ్రహ్మ సమాజం రూపంలో కనబడుతుంది. మహారాష్ట్రలో ప్రార్థనాసమాజంలో కనబడుతుంది. మహారాష్ట్రలో రెనడే, భండార్కర్, మోదక్, విఠల్‌రావు షిండే, చందావర్కర్ మొదలైనవారు ప్రారంభించారు. అగార్కర్ ప్రారంభించినది రెండవది. అతడు బ్రాహ్మణుల పక్షాన నిలిచాడు. మూడవది జ్యోతీరావు ప్రారంభించిన బ్రాహ్మణేతరులని. ఈ మూడు రకాల సంస్కరణల వారి అభిప్రాయాలు. యీ క్రింది విధంగా ఉన్నాయి. 1. పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రం అవసరం. 2. ఆధునిక విద్యా విధానం మతంతో సంబంధం లేకుండా

సంస్కరణలకి అనుకూలం. 3. కుల వ్యవస్థ ప్రగతికి అవరోధం కాబట్టి దానిని నిర్మూలించాలి. 4. చతుర్వర్ణాలు సంఘవ్యవస్థని నాశనం చేస్తాయి. 5. సంఘ సంస్కరణ తప్పనిసరి 6. కుటుంబ వ్యవస్థ, వివాహ వ్యవస్థలతో సంస్కరణలు మొదలు కావాలి. దీనికి స్త్రీ విద్య, బానిసత్వ విముక్తి మొదటగా ప్రారంభించాలి.

వీటిలో తేడా ఏమంటే, మహారాష్ట్రలో బ్రాహ్మణేతరుల పక్షం ఒకటి, బ్రాహ్మణుల పక్షం ఒకటి ఉన్నాయి. మొదటిది బ్రాహ్మణేతరుల సమస్యల్ని తీర్చేది. రెండవది అగ్రకులాల వారికి సంబంధించినది. బ్రాహ్మణేతరుల పక్షం వారు హిందూ మత సాంప్రదాయాలను సంస్కరించాలని, బ్రాహ్మణ పక్షం వారు సాంప్రదాయాల్ని నిలబెట్టాలని పట్టుదలతో ఉన్నారు. ఇటువంటి అభిప్రాయాలకు కారణం బ్రిటిషువారికి పూర్వమున్న రాజకీయ, సాంఘిక పరిస్థితులు. బ్రాహ్మణేతరుల ఉద్యమానికి కారణం కులవ్యవస్థ వల్ల వారు చాలా కాలం నుండి పడుతూన్న బాధలు, సరియైన చట్టం లేకపోవడం (చట్ట ఉల్లంఘన), అవినీతి, అరాచకత్వం.

బ్రాహ్మణ పక్షం వారు అగ్రకులాల వారికే ప్రాధాన్యత యిచ్చేవారు. బ్రిటిషు వారి పరిపాలనకి వాటిలో ఉద్యోగాలకి బ్రాహ్మణ ఆచారాలు యిమడవు. అలాగే పరిశ్రమలకి,



సాంకేతికత దూరం. అందువల్లనే సంస్కర్తలు ఆ ఆచారాలని మార్చాలనుకున్నారు. ముఖ్యంగా పూజాదికాలు. విగ్రహారాధన, శ్రాద్ధకర్మ మొదలైనవి ఉద్యోగాలకి ఆటంకాలని వారు భావించారు. అంతేకాక ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో మార్పు తేవాలనుకున్నారు. ఉద్యోగాలు, వర్తకం, రవాణా మొదలైన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మీద ప్రభావం చూపాయి.

వ్యవసాయం ఋణాలివ్వడం, బిచ్చమెత్తడం మొదలైన వాటి వల్ల కుటుంబపోషణ జరగడం లేదు. అందువల్ల లాయరుగానో, ప్రభుత్వ ఉద్యోగిగానో, వైద్యంలోనో, బోధనలోనో చేరుతున్నారు. ఉన్నత విద్యాభ్యాసం వల్ల వివాహం చేసుకునే వయస్సు పెంచవలసి వచ్చింది. బాల్య వివాహాలు ఆగాలి. దూర ప్రాంతాలకి పోయి ఉద్యోగాలు చేసేవారు ఉమ్మడి కుటుంబం నుండి విడిపోవడంవల్ల జీతం చాలక స్త్రీలకు కూడా విద్య ఉండా లనుకున్నారు. అందువల్ల స్త్రీ విద్య ప్రాధాన్యతని సంతరించుకుంది. పురాణాలలో చెప్పబడిన ఆదర్శ స్త్రీ జీవితం ప్రస్తుత కాలంలో పనికిరాదు. అందువల్ల స్త్రీలకు స్వాతంత్ర్యం కావాలనే నినాదం మొదలయింది. హిందూ సాంప్రదాయం ప్రకారం స్త్రీ పురుషుని మీదే ఆధారపడి ఉండాలి. కాని సంస్కర్తలు స్త్రీలకు కూడా సమాన హక్కులు కావాలని కోరుతున్నారు. వారి సంస్కరణలలో సహగమనం (సతి), బాల్య వివాహాలు, విధవలుగా జీవితాంతం ఉండడం, విడాకులు తీసుకోవడం, వారసత్వపు హక్కు లేకపోవడం, పరదా వేసుకోవడం, పురుషులతో మాట్లాడకుండా ఉండడం మొదలైనవి ఉన్నాయి. అందువల్లనే స్త్రీ విద్య వారికి మొదటి అడుగయింది.

హిందూ మతం ప్రాచీన సాంప్రదాయాల్నీ, కుల వ్యవస్థనీ, అస్పృశ్యతనీ కాపాడు తుంది. వాటన్నింటికీ వేదాంతపరంగా బ్రాహ్మణులు వివరంగా చెబుతూ ఉంటారు. హిందూ మతాన్ని సంస్కరించాలని సంస్కర్తలు అనుకున్నారు. వారు బెంగాలులో బ్రహ్మ సమాజాన్ని, మహారాష్ట్రలో ప్రార్థనా సమాజాన్ని స్థాపించారు.

మతం అనేది మానవుల అభిప్రాయం. కాబట్టి దానికి రాజకీయాలతో పని లేదు. పీష్వాల కాలం అంతరించడానికి పది సంవత్సరాలు ఉందనగా జ్యోతీరావు జన్మించాడు. బ్రిటిషు పాలన మొదటి కాలం. కాబట్టి జ్యోతిరావు పాశ్చాత్య సంస్కరణల ప్రభావంలో ఉన్నాడు. అతడు వెనకబడిన కులంలో జన్మించడం వల్ల విద్యాభ్యాసంలో చాలా అడ్డంకులు కలిగాయి. కాని తెలివైనవారు కావడం వల్ల సంఘంలో ఉండే సమస్యల్ని గమనించ గలిగాడు. వ్యతిరేకించడం, తిరుగుబాటు అంటే జ్యోతీరావుతో పాటు అతి కొద్దిమందికి మాత్రమే తెలుసు. ఎవరికి వారు తమ చుట్టూ ఉన్న పరిస్థితుల్ని అవగాహన చేసుకోగలిగితే ప్రగతిని సాధించగలుగుతారు. తమ స్థితిని గుర్తించలేనివారు బానిసలుగానే మిగిలిపోతారు. బ్రాహ్మణేతరులలో జ్యోతీరావుకి అటువంటి అవగాహనా శక్తి ఉంది తాము బానిసత్వంలో ఉన్నామనే సంగతి గుర్తించకపోతే బానిసత్వంలోనే ఉండిపోతారు.

జ్యోతీరావు వంటి వ్యక్తి జన్మించడానికి చారిత్రక కారణాలు కూడా ఉన్నాయి. అవి బ్రాహ్మణుల ఆధిపత్యం, కులవ్యవస్థ, మూఢనమ్మకాలు, అర్థం లేని ఆచారాలు. ఈ

లోటుపాట్లు యిప్పుడు కూడా ఉన్నాయి. పీష్వాల చివరి కాలంలో బ్రాహ్మణ పీష్వాలు పరిపాలించారు. కాబట్టి ఆ లోట్లు ఉన్నాయి. చట్టం అగమ్యగోచరంగా ఉంది. పన్నులు వసూలు చేయడం, బాకీలు వసూలుచేయడం మొదలైనవి రైతులకి బాధాకరంగా మారాయి. జ్యోతీరావు తన "ఇషారా" (హెచ్చరిక) పుస్తకంలో వాటిని విశదంగా తెలియజేశాడు.

"ఒక రైతు పన్ను కట్టడంలో కొద్ది జాప్యం చేసినా, అతనిని ఎండలో వంగో పెట్టేవారు. అతని వీపు మీద పెద్ద రాయిని పెట్టేవారు లేదా అతని భార్యని కూర్చోమనేవారు. పైగా మిరపకాయల ఘాటుని పీల్చమనేవారు. పాలకులు ప్రజల్ని జంతువులుగా చూసేవారు. ప్రజలు పంట పండించడం, నేత నేయడం, రాజుకి విలాసాలు సమకూర్చడం చేసేవారు. బ్రిటిషువారు రావడం వల్ల అలాంటి ఘోరాలు కొంతవరకు తగ్గాయి.

పూర్వం వ్యవసాయం వర్షం మీద ఆధారపడి ఉండేది. వర్షం రాకపోతే రైతులు అప్పులు చెల్లించలేకపోయేవారు. అందువల్ల వారు ఋణదాతల్ని ఆశ్రయించేవారు. వారు రైతుల్ని యింకా బాధపెట్టి వారికి ఉన్నదంతా లాక్కునేవారు. ఋణదాతలకి ప్రభుత్వం అండగా ఉండేది. ఏడు రూపాయిలు ఋణం తీసుకున్నందువల్ల ఒక రైతు తన భూమిని కోల్పోయాడు. రైతు అక్కడ నుండి పారిపోవాలి లేదా ఆత్మహత్య చేసుకోవాలి".

పీష్వాల కాలంలో కులవ్యవస్థ కఠినంగా ఉండేది. దానిని గురించి జ్యోతీరావు యిలా చెబుతున్నాడు.



"ఒక శూద్రుడు నది వద్ద బట్టలు ఉతుకుతున్నాడు. ఆ సమయంలో ఒక బ్రాహ్మణుడు అటు పక్కకి వచ్చాడు. వెంటనే ఆ శూద్రుడు బట్టలన్నింటికీ పోగు చేసి,

బ్రాహ్మణుని మీద నీళ్ళు చిందకుండా ఉండేటంత దూరంగా పోయాడు. ఒకవేళ నీళ్ళు చిందితే ఆ బ్రాహ్మణునికి కోపం వచ్చి తన చెంబుని శూద్రుని తల మీదకు విసురుతాడు. శూద్రుడు స్పృహ తప్పుతాడు. స్పృహ వచ్చిన తరువాత అతడు రక్తంతో తడిసిన బట్టల్ని పోగుచేసుకుని యింటికి వెళ్తాడు. అతడు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసే అవకాశం లేదు. ఎందుకంటే అది బ్రాహ్మణ ప్రభుత్వం. ఫిర్యాదు చేస్తే ఆ శూద్రుడే శిక్షింపబడతాడు".

ఇక అస్పృశ్యుల సంగతి చెప్పనక్కర్లేదు. వాళ్ళ నీడ కూడా బ్రాహ్మణుల మీద పడకూడదు. అందుకని వాళ్ళు ప్రొద్దుట, సాయంకాలాలలో బయటకి రారు. ఒకవేళ బ్రాహ్మణులు నడిచేరోడ్డులో వాళ్ళు నడవవలసి వస్తే వారు తలకి ఒక కుండని బోర్లించుకుని నడవాలి. లేదా చేతికి ఒక చెట్టుకొమ్మని మణికట్టు దగ్గర కట్టుకుని వెళ్ళాలి. ఆ చెట్టుకొమ్మ వాళ్ళ పాదగుర్తుల్ని తుడిచి వేస్తూ ఉంటుంది. ఆ పరిస్థితి జంతువుల పరిస్థితి కంటే హీనమైనది బ్రాహ్మణులు దేవతలు. మిగిలినవారిది క్రింది అంతస్తు.

పీష్వాల కాలంలో చాలా ధనాన్ని బ్రాహ్మణలకు అన్న సంతర్పణ చేయడానికే సరిపోయేది. ఈ పరిస్థితిని జ్యోతీరావు తీవ్రంగా ఖండించాడు. అతడు దురాశాపరులైన బ్రాహ్మణులను, దుర్భర దారిద్ర్యంతో అలమటిస్తున్న, నిమ్నకులాల వారిని పోలుస్తూ రాశాడు. నేరాలు చేసిన శూద్రుల్ని కిరాతకంగా హింసించేవారు. బ్రిటిషు పరిపాలనలో అటువంటి క్రూరమైన శిక్షలు ఆగాయి. ఎందుకంటే వాళ్ళ చట్టాలు సరళంగా ఉంటాయి. పైగా శిక్షలు కులాల బట్టి ఉండవు. జ్యోతీరావు తక్కువ కులంలో పుట్టాడు. కాబట్టి అతనికి యీ విషయాలన్నీ బాగా తెలుసు. అందువల్ల అతడు బానిసత్వాన్ని రూపు మాపడానికి నడుం కట్టాడు.

బ్రిటిషు పరిపాలన వచ్చిన తరువాత కూడా పూర్తిగా వ్యవస్థలు మారలేదు. అయినా వారి సంస్కృతి, భావాలు ప్రజల్ని ఉద్ధరిస్తాయనే నమ్మకం జ్యోతీరావుకి ఉంది. కాని అనుకున్నంతా జరగలేదు. విలువలతో కూడిన పాలన బ్రిటిషు వారి నుండి వస్తుందని జ్యోతీరావు నమ్మకం. వేల సంవత్సరాల నుండి బానిసత్వంలో మగ్గడానికి కారణం ఏమిటో వాటిని సమూలంగా తీసివేయడానికి ఆయన ప్రయత్నించాడు. "బ్రాహ్మణ మతంలో బానిసత్వం" అనే పుస్తకం రాశాడు. ఆ పుస్తకాన్ని అమెరికాలోని నీగ్రోలకి అంకితమిచ్చాడు.

ఆ కాలంలోని పరిస్థితుల్ని గురించి జ్యోతీరావు యిలా రాశాడు.

బ్రిటిషు పరిపాలిస్తూ ఉన్నా బ్రాహ్మణుల చేతిలోనే అధికారం ఉంది. దాని వల్ల బ్రాహ్మణేతరులు బాధలు పడుతూనే ఉన్నారు. పూణేలో కూడా శూద్రులు, బ్రాహ్మణులు

నీళ్ళు తెచ్చుకునే నది వద్దకు వెళ్ళడానికి వీలు లేదు. పాఠశాలలు కూడా బ్రాహ్మణుల ఆధీనంలోనే ఉన్నాయి. శూద్రులు చదువులేకుండానే ఉండిపోవాలి. లావాదేవీలలో వారు మోసగింపబడుతున్నారు. వారు సంపాదించుకున్న డబ్బు బ్రాహ్మణుల ఆంక్షల ద్వారా వృధాగా ఖర్చు అవుతుంది. తమకు అన్యాయం జరుగుతూందనే విషయం వారు గ్రహించి ఉండకపోవచ్చు లేదా వారికి న్యాయం చేసేవారు లేకపోయి ఉండవచ్చు. వారి సమస్యల్ని పట్టించుకునేవారు లేరు".

"బానిసత్వం" అనే పుస్తకంలో జ్యోతీరావు శూద్రులు మానసికంగా అనుభవిస్తున్న బాధల్ని వివరించాడు.

"సామాన్య మానవుడు బానిసత్వంలో ఉన్నాడు. దాని నుండి బయటికి వద్దామనే కోరికే వారికి లేదు. వారు కూడా తమ యజమానులు పక్షాన్నే ఉన్నారు. అమెరికాలో తెల్లజాతివారు కూడా నల్లజాతి బానిసల్ని బానిసత్వం నుండి విముక్తి కలిగించాలనుకున్నారు. కొంకణదేశంలో రైతులు తమ యజమానుల మీద ఫిర్యాదు చేయడానికి వీలయిన పద్ధతిని బ్రిటిషువారు పెట్టారు. భూస్వాములు రైతుల చేత రోజల్లా పనిచేయించుకుని వారి సరిపడినంత ఆహారాన్ని యిచ్చేవారు కాదు. వారు రైతుల్ని కొట్టేవారు కూడా. అయినా వారు యజమానుల వైపే నిలిచేవారు. అందువల్ల శూద్రులకి విద్య నేర్చుకొనే అవకాశం కల్పిస్తే వారికి మూఢనమ్మకాలు తొలగిపోతాయి".

ఆధునిక విద్య ద్వారా సామాన్య మానవుడు చట్టం ద్వారా లబ్ది పొందగలుగుతాడనే నమ్మకం జ్యోతీరావుకి ఉంది. అయితే బ్రిటిషు పాలన వల్ల కొంత లాభం ఉంది కాని అది సమూల మార్పు చేయలేదు. బ్రిటిషు ప్రభుత్వం సామాన్యుడికి అతని బాధ తగ్గించడానికి తగిన ఆర్థిక వెసులుబాటు కల్పించలేదు. శూద్రులు పేదలుగానే మిగిలిపోయారు. వ్యావసాయికంగా అభివృద్ధి కనబడలేదు. వ్యావసాయిక విప్లవానికి మూడు పద్ధతులున్నాయి. 1. భూస్వామ్య పద్ధతి పోవాలి. దానితో పాటు ఫ్యూడల్ పద్ధతి కూడా పోవాలి. 2. వారి పనికి తగిన వేతనం లభించాలి. 3. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేయాలి. జ్యోతీరావు ఆధునిక పద్ధతులలో వ్యవసాయం చేయవలసిన ఆవశ్యకతని గుర్తించాడు. అంతేకాక ఋణదాతల కర్కశత్వాన్ని నిరసించాడు. బ్రిటిషు వారి వల్ల హిందూ సాంప్రదాయాలలోని లోటుపాట్లు సరికావనే విషయాన్ని గుర్తించలేదు.

1857లో సిపాయిల తిరుగుబాటు జరిగింది. అప్పుడు జ్యోతీరావు చిన్నవాడు. ఆ తిరుగుబాటు బ్రిటిషు ప్రభుత్వాన్ని కూల్చివేయగలదనుకున్నారు. కాని అది విజయవంతం

కాలేదు. ఆ సమయంలోనే జ్యోతిబా తన సత్యశోధక ఉద్యమాన్ని ప్రారంభించాడు. చాలామంది విద్యావంతులు బ్రిటిషు పాలనకి వ్యతిరేకులయ్యారు. పాశ్చాత్య విద్య వల్లనే వారికి స్ఫూర్తి కలిగింది. వారు వార్తాపత్రికల ద్వారా, ప్రసంగాల ద్వారా తమ వ్యతిరేకతని తెలియజేశారు. సిపాయిల తిరుగుబాటు విజయవంతం కాకపోవడం జ్యోతిబాకి సంతోషం కలిగించింది. అది అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. చరిత్ర చూస్తే అతని సంతోషానికి కారణం తెలుస్తుంది. అతడిలా చెప్పాడు.

"సిపాయిల తిరుగుబాటు విజయవంతం అయి, బ్రిటిషువారు తొలగిపోతే చరిత్ర పునరావృతం అవుతుంది. బ్రాహ్మణుల ఆధిపత్యం అధికమవుతుంది. వేదాలు, శాస్త్రాలు బలం పుంజుకుంటాయి. శూద్రులకి అధోగతే. సాంఘికంగా అణగద్రొక్కడం వేల సంవత్సరాల నుండీ జరుగుతుంది. ముఖ్యమైనది సాంఘిక బానిసత్వం తొలగాలి. ఈ బానిసత్వపు వేళ్ళు బ్రాహ్మణుల మతంలో ఉన్నాయి.

బ్రాహ్మణుల ఆధిపత్యం వేల యేళ్ళుగా చలామణి అవుతూనే ఉంది. బ్రాహ్మణులకు ఆధిపత్యం ఎలా వచ్చిందనేది తెలియాలి. అయితే అవన్నీ శ్రుతి,స్మృతి, పురాణాల కథలలో లాంటివే. అయినా చివరికి అర్థమయిందేమిటంటే పరశురామావతారంలో బ్రాహ్మణులకు ఆధిపత్యం వచ్చినట్లు కనపడుతుంది. దశావతార కథల్ని జ్యోతీబా యిలా వర్గీకరించాడు. 1. ఆర్యులు ఇరాన్‌ను నుండి సముద్రమార్గంలో రెండు పర్యాయాల భారతదేశానికి వచ్చి వ్యవసాయదారుల్ని జయించాడు. 2. ఈ విషయం మత్స్య, కూర్మ అవతారాల ద్వారా తెలుస్తుంది. ఈ రెండూ జలచరాలు. 3. ఆర్యులు పూర్తిగా విజయం సాధించలేదు. కాబట్టి వారు భూమార్గం ద్వారా వచ్చారు. ఈ విషయాలు వరాహ, నారసింహ, వామన అవతారాల ద్వారా తెలుస్తుంది. వామనావతార సమయంలో బ్రాహ్మణులకి పూర్తి ఆధిపత్యం దక్కింది. ఆధిపత్యం చివరి వరకూ నిలవాలంటే వారు క్షత్రియుల్ని, గర్భిణీ స్త్రీలను కూడా సంహరించారు. 4. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆర్యబ్రాహ్మణులు ప్రజలలో వారు అజ్ఞానులుగా మారేటట్టు బోధించారు. పురాణాలలో బ్రాహ్మణుల యొక్క కుట్రలు, కుతంత్రాలు బయటపడతాయి. కులవ్యవస్థని ఏర్పాటు చేయడంలో శూద్రకులాల మధ్య విభేదాలు తలెత్తాయి. అంటే బ్రాహ్మణులు విభజించి పాలించారన్నమాట. వారిని ఎదిరించిన వారిని అస్పృశ్యులుగా పరిగణించారు. నిజానికి వర్ణభేదాలు లేనే లేవు.

గత శతాబ్దంలో చాలామంది పాశ్చాత్య పండితులు వేదకాలం నాటి ఆర్యులు, ముఖ్యంగా బ్రాహ్మణులకు భారతీయ సాంఘిక వ్యవస్థ మీద అధికారం ఎలా వచ్చిందనే

విషయం మీద పరిశోధనలు చేశారు. వారి పరిశోధనల ప్రకారం ఆర్యులు బయట నుండి వచ్చి భారతీయుల్ని జయించి, సాంఘికంగాను, మతపరంగానూ, రాజకీయంగానూ ఆధిపత్యాన్ని పొందారు. జ్యోతీరావు ఫూలే యొక్క సిద్ధాంతం కూడా అదే రీతిలో నడుస్తుంది. పురాణాలలో అవతారాల గురించి ఉంది. అది చరిత్రకి అందని కాలంలో బ్రాహ్మణుల ఆధిక్యతని గురించి చెప్పింది. ఈ కథల నుండి జ్యోతీబా వివరంగా ఒక చరిత్రని రాయాలనుకున్నాడు. అయితే దానిలో విజయం సాధించాడని చెప్పలేం. ఎందుకంటే పురాణాలలోని కథలన్నీ హేతుబద్ధంగా లేవు. అన్నీ విచిత్రంగా ఉన్నాయి. దేవుడు చేపగాను, తాబేలుగాను, వరాహంగాను, నరసింహంగాను అవతారం ఎత్తాడనడంలో జ్యోతిబా అవన్నీ అలంకారాలతో కూడిన వర్ణనలుగా భావించాడు. మత్స్య, కూర్మ మొదలైనవి పడవలనీ, వాటిలోనే ఆర్యులు ఇరాన్ నుండి భారతదేశానికి వచ్చి ఉంటారనీ అతని అభిప్రాయం. కాని ఆ అభిప్రాయానికి ఆధారాలు లేవు. పైగా ఆర్యులు (బ్రాహ్మణులు) బయట నుండి వచ్చారనడానికి కూడా ఆధారాలు లేవు. కాబట్టి బ్రాహ్మణుల ఆధిపత్యం బయట నుండి వచ్చినవారికి భారతీయులకు మధ్య జరిగిన యుద్ధఫలితం అని చెప్పడానికి అవకాశం లేదు.

వృత్తులలోను, సాంఘికంగాను, ఆర్థికంగాను అసమానతలుంటే కుల వివక్ష, వర్గ వివక్షలు తప్పని సరి. బ్రాహ్మణులకు శూద్రులకు మధ్య యిటవంటి వివక్ష చరిత్రకందని కాలంలో కూడా ఉండేవని తేలింది. బయట నుండి ఆర్యులు వచ్చారనీ, వివక్షలున్నాయనీ బ్రిటిషు చరిత్రలోను, మొగలులు చరిత్రలోను కనిపిస్తుంది. జ్యోతీబా ప్రకారం ఆర్యులు భారతదేశంపై దండయాత్ర చేశాడంటాడు. కాని పాశ్చాత్య పండితుల ప్రకారం వారు వేదకాలం నాటి ఆర్యులని అంటారు. ఆర్యులు అంటే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు అని వారి అభిప్రాయం. జ్యోతీబా సిద్ధాంతం మహారాష్ట్రలోని సమకాలీన సాంఘిక వ్యవస్థ మీద ఆధారపడింది.

మహారాష్ట్రలోను, పరిసర ప్రాంతాలలోను ఉన్న బ్రాహ్మణులు రెండే కులాలున్నాయని నమ్ముతారు. ఒకటి బ్రాహ్మణులు, రెండవది శూద్రులు. ఉత్తర హిందూ స్థానంలో క్షత్రియులు, వైశ్యులు ఉన్నారు. బ్రాహ్మణులు వారిని ఆర్యులుగా పరిగణిస్తారు. అయితే రెండు కులాల గురించి తెలుసుకున్న జ్యోతిబా యొక్క భావాలు నమ్మదగినవిగా లేవు. కాని పరశురామావతారం గురించి జ్యోతిబాకి కలిగిన భావాలు కొంతవరకు అర్థవంతంగా ఉన్నాయి. బహుశా ఆ అభిప్రాయమే క్షత్రియులు ఆర్య బ్రాహ్మణులు కారని అతనికి కలిగింది.

నాలుగు వర్ణాలు బ్రహ్మ యొక్క శరీరం నుండి పుట్టాయనే దానిని జ్యోతిబా నమ్మలేదు. అతడు బ్రాహ్మణుల పవిత్రత గురించి పరిశోధించాడు. ఉదాహరణకి వేదకాలంలోని బ్రాహ్మణులు గుర్రం మాసం, ఎద్దు మాంసం తినేవారనీ, సోమరసం తాగేవారనీ ఉంది. అయితే జ్యోతిబా సంస్కృత పదాల్ని సరిగా అర్థం చేసుకోలేదు. భాషకి సంబంధించిన విషయంలో ధైర్యంగా విమర్శించడం జ్యోతిబాకి సరి అయినది కాదు. అందుకే విష్ణుశాస్త్రిచిప్లూంకర్ జ్యోతిబాని విమర్శించాడు. అయితే జ్యోతిబా సిద్ధాంతాన్ని పూర్తిగా ఖండించలేదు.

బ్రాహ్మణేతరులు వేదాలలోని దేవతల్ని కాకుండా యితర దేవతల్ని ప్రార్థించేవారనే జ్యోతిబా అభిప్రాయం. భారతీయ సాంఘిక వ్యవస్థ దృష్ట్యా ప్రాధాన్యతని సంతరించుకుంది. బ్రాహ్మణులు కూడా ఆ దేవతల్నే పూజించేవారని తెలుస్తుంది. దీనిని బట్టి యిద్దరి మతాలు కలబోతగా ఉన్నాయని తెలుస్తుంది. కాబట్టి దసరా, దీపావళి పండుగలు ఆదివారం యొక్క పవిత్రత, ఖండోబా, జ్యోతిబా, భైరోబా, మస్తాన్ మొదలైన దేవతలు బ్రాహ్మణేతరుల మతం వారే అని జ్యోతిబా నిర్ధారించాడు. బ్రాహ్మణులు బ్రాహ్మణేతరులు మతాన్ని నాశనం చేయాలనుకున్నారు. అంతేకాక, జన్మతా అగ్రకులంగా బ్రాహ్మణులను చేసి, మూఢనమ్మకాల్నీ, బానిసత్వాన్నీ, అసమానతల్నీ ప్రవేశపెట్టారు.



జ్యోతిబా సత్యశోధక సమాజాన్ని స్థాపించి, బ్రాహ్మణ మతాన్ని ఖండించడం ప్రారంభించాడు. తన ఉద్యమం తప్పక విజయవంతం అవుతుందనీ, తన ఉద్యమం ఆచరణాత్మకంగా ఉందనీ అభిప్రాయపడ్డాడు. ప్రతి మతంలోను కొంత నిజం, కొంత అబద్ధం ఉందనీ, మతాలు సౌభ్రాతృత్వానికీ, పరస్పరంగా సహాయం చేయడానికే

అడ్డంకులుగా ఉన్నాయనీ అభిప్రాయపడ్డాడు. ప్రతి ఒక్కరూ తన మతమే గొప్పదని భావిస్తాడు, యితర మతాల్ని ద్వేషిస్తాడు. కాబట్టి ఒకరికొకరు శత్రువులవుతున్నారు, కలహించుకొంటూ రక్తపాతాన్ని సృష్టిస్తున్నారు. మానవులంతా ఐక్యంగా ఉండాలనేది పరమ సత్యం. మతాలు దానికి తూట్లు పొడుస్తున్నాయి. ప్రగతికి బదులు వారు క్షీణతకు పోతున్నారు. అలాగే జాతీయత, దేశభక్తి మొదలైనవి కూడా క్షీణిస్తున్నాయి. దానివల్ల మనుష్యుల సామర్థ్యం కుంటుపడుతూంది. దేశాలు పరస్పరం యుద్ధాలకి సిద్ధం అవుతున్నాయి. యుద్ధాల మీద ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. అనవసర పన్నుల భారం ప్రజల మీద పడుతుంది, ముఖ్యంగా రైతుల మీద.

జ్యోతీరావు తన సార్వజనిక సత్యధర్మం ద్వారా తన నియమాలు, అభిప్రాయాలు తెలియజేశాడు. స్త్రీలకి, పురుషులకి సమాన హక్కులు ఉండాలి. ఒకరి మీద ఒకరు పెత్తనం చెలాయించకూడదు. పుట్టుకతోనే భగవంతుడు అందరికీ మత స్వేచ్ఛ, రాజకీయ స్వేచ్ఛ యిచ్చాడు. ఎవరైతే వాటిని అతిక్రమిస్తారో వారు సత్యానికి శత్రువులు. ఒకరు ఎక్కువ యింకొకరు తక్కువ అనేది లేదు. ప్రపంచంలోని జీవితాన్ని సజావుగా అనుభవించే హక్కు అందరికీ ఉంది. వ్యవసాయం మొదలైన వృత్తులు వ్యక్తి యొక్క గౌరవానికి భంగం కావు. ప్రకృతి నియమాలైన కార్యకారణ సంబంధాల గురించి పూర్తిగా అవగాహన చేసుకొని ప్రవర్తించడం ప్రతి వ్యక్తి యొక్క బాధ్యత. పరస్పరం సహాయం చేసుకోవడం మానవుల కర్తవ్యం. అదే భగవంతునికి పూజ. భగవంతుడే యీ విశ్వానికి యజమాని. ఆయనకు స్తోత్రాలు వల్లించడం, నామ జపం చేయడం, జపమాలలతో జపం చేయడం అవసరం లేదు. ఆయన అలా చేయమని కోరలేదు. క్రీస్తు చెప్పిన దానిని అనగా అందర్నీ ప్రేమించు అనే సూత్రాన్ని పాటిస్తే అభివృద్ధి చెందుతారు.

వేల సంవత్సరాల నుండీ ఉన్న సంస్కృతి, జ్ఞానం మొదలైన వాటిని జ్యోతిబా పూర్తిగా అవగాహన చేసుకున్నాడు. సత్యశోధనకై శ్రమించాడు. సత్యం అనేది శాస్త్రాలలోను సాధువులలోను, గురువులలోను, భగవంతుని అవతారాలలోను, ప్రవక్తలలోను కాకపోతే యింక దేనిలో ఉంటుంది? మానవుని అంతరాత్మలో ఉంటుంది. వివేకం, విచక్షణాజ్ఞానం మానవులకి భగవంతుడిచ్చాడు. భగవంతుడు అవతరించలేదు. తాను సాక్షాత్కరించి సాధువులకు బోధించలేదు. ప్రతివారికీ తర్కించే శక్తి యిచ్చాడు.

జ్యోతిబా ఆలోచనలు మానవ విలువల్ని సూచించాయి. అతని ప్రసంగాలు ఉద్వేగ పూరితాలు. అతడు త్రికాలాలలోని విషయాల్ని ఊహించి రచనలు చేశాడు. అన్యాయాన్ని

సహించలేని కారణంగానే అతడు బ్రాహ్మణుల మతాన్ని, వారి ఆధిపత్యాన్ని ఘాటుగా విమర్శించాడు. అయితే అతడు యింకా పూర్తిగా అవగాహన చేసుకుంటే పూర్తిగా, సరియైన రీతుల్లో విమర్శించడానికి అవకాశం ఉండేది. అప్పటి పరిస్థితుల్లో విద్యకి ప్రాధాన్యత లేదు. అందువల్లనే అతని భాష కొంత సాఫీగా లేదు. విద్యావంతులు ఆ భాషని అంగీకరించలేదు. అన్నాసాహెబ్ అతని రచనల్ని గురించి యిలా అన్నాడు. “జ్యోతిబా రచనలు అడవిలో కాచిన పండులాంటిది”. అంటే రుచికరంగా లేవని అర్థం. కాని ఆ రచనల్లో ఔషధ గుణాలున్నాయి. అతని రచనల వల్ల స్ఫూర్తిని పొంది, షిండే, భాస్కరరావు యాదవ్, డాక్టర్ అంబేద్కర్ మొదలైనవారు కూడా సంఘ చరిత్ర మీద రచనలు చేశారు.

శూద్రుల ఉద్యమాన్ని జ్యోతీరావు దక్షిణ భారతంలో స్థాపించాడు. ఆ ఉద్యమం 1935 వరకు బాగానే అభివృద్ధి చెందింది, బాగా నడిచింది. కాని తరువాత యీ రోజు క్షీణ దశకి వచ్చింది. ఎందుకంటే ఆ ఉద్యమం అనుకున్నది సాధ్యమయింది. అందువల్ల దాని అవసరం లేదు. కాని జ్యోతిబా పూర్తిగా విజయం సాధించాడనడానికి అవకాశం లేదు. అయితే జ్యోతిబా యొక్క ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వంలో బ్రాహ్మణుల ఆధిపత్యం తొలగించడం. అది 1935లో రాజ్యాంగం ద్వారా తీరింది. అయితే హేతువాద దృష్టి, సాంఘిక అసమానతలు, బానిసత్వం మాత్రం పూర్తిగా తొలగిపోలేదు.

సత్యశోధక సమాజం ద్వారా ప్రారంభింపబడిన శూద్రుల ఉద్యమం బ్రాహ్మణుల మీద అతి క్రూరంగా, సంకుచితంగా ధ్వజమెత్తడం వల్ల ఓటమిని చూసింది. తరువాత మాంటేగ్ – చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల ద్వారాను, 1935లో ఏర్పడిన రాజ్యాంగం ద్వారాను శూద్రులకి మునిసిపాలిటీలలోను, స్థానిక సంస్థలలోను సీట్లు లభించాయి. అదే విధంగా గత ముప్ఫయి సంవత్సరాలలో వెనకబడిన జాతుల వారికి ప్రభుత్వ ఉద్యోగాలు యివ్వాలని సంకల్పించింది. శూద్రులకి సంతృప్తి కలిగింది. కాంగ్రెస్, జాతీయ ఉద్యమాలు శూద్రుల ఉద్యమాన్ని సమూలంగా తొలగించకలిగింది. ఎందువల్లనంటే ఆ ఉద్యమం మానవుల హక్కుల్ని గురించీ, ప్రజాస్వామ్య విలువలు గురించీ ప్రజలకి సరియైన అవగాహన కలి గించలేకపోయాయి. ఇది ఆసరాగా తీసుకుని జాతీయోద్యమం పెట్టుబడిదారులకి, అగ్ర కులాల వారికి ప్రాధాన్యత యిచ్చింది. అసమానతలు, కులవ్యవస్థకి కారణం బ్రిటిష ప్రభుత్వమే అని జాతీయోద్యమకారులు వక్రభాష్యం చెప్పారు. బ్రిటిషువారి పాలన అంతరిస్తే భారతీయులంతా సౌభ్రాతృత్వంతో, ఐకమత్యంగా ఉంటారని తప్పు తోవ పట్టించింది.

ప్రజలకు స్వాతంత్ర్యోద్యమం అంటే సరియైన అవగాహన లేకుండా పోయింది. అందువల్ల అగ్రకులాల వారి నేతృత్వంలో ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. దీన్ని గమనించిన జ్యోతిబా దేశభక్తి, జాతీయత అంశాల మీద వ్యతిరేక అభిప్రాయాల్ని వెలిబుచ్చాడు. "మానవులందరూ సమానమే" అన్నాడు. తన యుద్ధం సాంఘిక, రాజకీయ బానిసత్వం మీద అని చెప్పేవాడు.

రాయి మీద మొక్క మొలకెత్తదు కదా? అలాగే జాతీయోద్యమం శూద్రుల పరిపాలనకి సమ్మతించదు. ఆ రెంటికీ మధ్య భావాల భిన్నత్వం ఉంది. మానవులలో అసమానతలు లేకుండా ఉండాలనేది శూద్రుల భావన. జాతీయ స్వపరిపాలన సాంప్రదాయబద్ధం. కాబట్టి సాంప్రదాయబద్ధంగా ఉండే పాలన పోతే కాని శూద్రుల పాలన రాదు.

"నేను దీనిని హెచ్చరిక చేసే గంటని మాత్రమే" అంటూ వివరించాడు జ్యోతిబా.

✦ ✦ ✦

మహాత్మా

# జ్యోతీరావు ఫూలే

(1827 - 1897)



VICTORY

విక్టరీ పబ్లిషర్స్

# 30-17-3ఎ, వారణాసి వారి వీధి, సీతారాంపురం,

విజయవాడ - 520 002, ఫోన్ : 0866-2444156